www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★




మళ్లీ పోరాటంలోకి కార్మికులు, రైతులు ఎందుకు? 06

ప్రజాస్వామ్యవాదులు ఏకంకండి

బిహార్‌లో యువత ఆకాంక్షలు అణచివేత 05

సంపుటి 08, సంచిక: 326 | బుధవారం | 29-10-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్లకు 80 టిఎంసిలు

**నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి**

- డ్యామ్‌ల స్థితిగతులపై నివేదిక రూపొందించాలి
- సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలి
- ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా సమీక్షలు
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితులు, సిఆర్ పాటిల్ రాసిన లేఖపై అధికారులతో సమీక్ష**



ప్రజాపక్షం/హైదరాబాద్

తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టిఎంసిల నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు,తాగు నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. దీనికి పాత పనులను ఉపయోగిస్తూ, ముందుకు వెళ్లేందుకు అంచనాలను రూపొందించాలని చెప్పారు. సుందిళ్లకు మరమ్మత్తులను చేపట్టి వినియోగంలోనికి తీసుకురావాలని,తద్వారా ఆ నీటిని శ్రీపాద ఎల్లంపల్లికి తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, కార్యదర్శి మాణిక్‌రాజు, నీటిపారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. ఇటీవల కేంద్రజలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ సిఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖపై రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో చర్చించారు. అలాగే తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టు, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైన కూడా సిఎం సమీక్షించారు. కేంద్ర మంత్రి లేఖలో ప్రస్తావించిన అంశాలను సిఎం అధికారులకు వివరించారు. డ్యాముల భద్రత విషయంలో ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్ర మంత్రి లేఖలో పొందుపర్చిన అంశాలు, ప్రాజెక్టులకు వారీగా స్థితిగతులు, అంచనాలను పూర్తిస్థాయి నివేదికలను తరువాయి 2లో



## వేతన సంఘం ఏర్పాటు

**రంజన ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలో 8వ పే కమిషన్**

**18 నెలల్లో తుది నివేదిక విడుదల**

**తీర్మానానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం**

**రబీ సీజన్‌లో ఎరువుల సబ్సిడీ పెంపునకు రూ.37,952 కోట్లకు గ్రీన్ సిగ్నల్**

**న్యూఢిల్లీ:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ సమీపిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఎనిమిదవ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు విశ్రాంత మహిళా న్యాయమూర్తి జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ ఈ వేతన సంఘానికి నాయకత్వం వహిస్తారు. ఎనిమిదవ వేతన సంఘం కార్యకలాపాల పరిధిని, పరిమితులను నిర్దేశిస్తూ న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశం ఒక తీర్మానానికి ఆమోదం తెలియజేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షత వహించారు. ఏడవ వేతన సంఘం కాలపరిమితి ముగిసిన వెంటనే కొత్త వేతన సవరణలు చేపట్టడానికి వీలుగా 2026 జనవరి ఒకటో తేదీ నుండీ (సాధారణ సంప్రదాయ తేదీ) ఎనిమిదవ వేతన సంఘం పనిచేయడం ప్రారంభిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలలో చేయవలసిన మార్పులు, వారికి లభించాల్సిన ప్రయోజనాలకు సంబంధించి ఈ వేతన సంఘం సిఫార్సులు చేస్తుంది. ఈ సిఫార్సులవల్ల దేశంలో 50 లక్షలమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందుతారు. తొలుత ఒక తాత్కాలిక నివేదిక ఇచ్చిన తర్వాత, 18 నెలల గడువులో సంఘం తుది నివేదిక సమర్పిస్తుంది. తాత్కాలిక నివేదిక ఇచ్చిన తర్వాత ఈ వేతన సంఘం పనిచేయడానికి ఒక నిర్దిష్ట ప్రారంభ తేదీని నిర్ణయిస్తామని మంత్రివర్గ సమావేశం అనంతరం సమాచార ప్రసారాలశాఖమంత్రి అశ్వనీ వైష్ణవ్ పాత్రికేయులకు చెప్పారు. సాధారణ సంప్రదాయం ప్రకారం వేతన సంఘం జనవరి ఒకటోతేదీనే బాధ్యతలు తీసుకుని పనిచేయడం తరువాయి 12లో




## అమెజాన్‌లో 14 వేల ఉద్యోగాల కోత

**కృత్రిమ మేధపై వ్యయాల పెంపు**

**సీటెల్:** అమెజాన్ కంపెనీ 14,000 కార్పొరేట్ ఉద్యోగాల్లో కోత పెట్టేందుకు సిద్ధమైంది. మానవశ్రమ స్థానంలో కృత్రిమ మేధకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వినియోగదారుల అభిరుచులు, భవిష్యత్ అవసరాలు, మార్పులు,పోటీ ప్రపంచానికి అనుగుణంగా కృత్రిమ మేధపై ఎక్కువ ఖర్చుపెట్టేందుకు కంపెనీ సిద్ధమైంది. ఉన్నతస్థాయి ఉద్యోగులతోపాటు వివిధ స్థాయిల్లో పనిచేసే ఉద్యోగాలలో కూడా కోత విధిస్తారు. ఈ వారం నుండే ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఉద్యోగాల కోత ప్రభావం పడే టీములు, ఉద్యోగులను మంగళవారంనాడే గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేసే సిబ్బంది ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించుకోవడానికి 90 రోజులు గడువు ఇస్తారని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గాలెట్టి ఒక మెసేజ్ ద్వారా ఉద్యోగులకు తెలియజేశారు. అమెజాన్‌లో 3,50,000 మంది కార్పొరేట్ ఉద్యోగులు ఉన్నారు. మొత్తంగా కంపెనీలో 15.60 లక్షలమంది శ్రామికులు ఉన్నారు. ఈ లెక్క ప్రకారం తాజా లేఆఫ్‌లో నాలుగు శాతం మందిని తొలగిస్తారు. 2023లో 27,000 మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించిన తర్వాత మూడు సంవత్సరాలకు ఇంత భారీస్థాయిలో ఉద్యోగాల్లో కోత పెట్టడం మళ్ళీ ఇదే. ఆనాడు రెండు విడతలుగా 9,000 మందిని ఒకసారి, 18,000 ఉద్యోగులను మరోసారి కంపెనీ తొలగించింది. ఈసారి కూడా ఇదే విధానం పాటిస్తారని భావిస్తున్నారు. కంపెనీ కార్యకలాపాలు, మానవ వనరులు, క్లౌడ్ కంప్యూటింగ్ యూనిట్, తరువాయి 2లో

**సినిమా టిక్కెట్ ధర పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా ఇవ్వాల్సిందే**

వాటా ఇస్తేనే ధరల పెంపు జిఒ జారీచేస్తాం

సినీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సినీ కార్మికులపై సిఎం వరాలజల్లు 03

## సాయుధ పోరాటం వీడిన చంద్రన్న, బండి ప్రకాశ్

**డిజిపి శివధర్‌రెడ్డి ఎదుట లొంగుబాటు**

**జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులకు రక్షణ కల్పిస్తామని హామీ**

**ఈ ఏడాది ఇప్పటివరకూ 427 మంది లొంగిపోయినట్లు వెల్లడి**



ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ (మావోయిస్టు) కీలక నేతలు, కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్‌లు తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి ఎదుట మంగళవారం లొంగిపోయారు. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వీరు అజ్ఞాతం వీడారు. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డిజిపి వెల్లడించారు. సాయుధ పోరాటాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వచ్చే మావోయిస్టు నేతలకు పూర్తి రక్షణ కల్పిస్తామని, వారిపై ఎలాంటి చర్యలు ఉండవని డిజిపి శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా, మావోయిస్టు పార్టీలో 40 ఏళ్లకు పైగా వివిధ స్థాయిల్లో చంద్రన్న పనిచేశారని తెలిపారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా పనిచేశారని, 1981లో పీపుల్స్‌వార్‌లో చేరారని వెల్లడించారు. అంచెలంచెలుగా ఎదిగి తరువాయి 2లో

**మావోయిస్టు సిద్ధాంతం ఓడిపోలేదు : చంద్రన్న** 03



## కాంట్రాక్ట్ కార్మికులకు శాశ్వత ఉద్యోగాలు

- ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ పునరుద్ధరణ
- కల్లుపై నిషేధం ఎత్తివేత
- బిహార్ మహాఘట్ బంధన్ మ్యానిఫెస్టో విడుదల

**పాట్నా :** తాము అధికారంలోకి వస్తే బిహార్‌లో ప్రతి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందిస్తామని మహాగఠ్‌బంధన్ హామీ ఇచ్చింది. 'బిహార్ కా తేజస్వి ప్రణ్' పేరుతో 32 పేజీల ఎన్నికల ప్రణాళికను పాట్నాలోని ఓ ప్రముఖ హోటల్‌లో కూటమి నేతలు కిక్కిరిసిన విలేకరుల సమావేశంలో మంగళవారం కూటమి నేతలు మహాగఠ్‌బంధన్ మేనిఫెస్టో విడుదల చేశారు. కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్,కాంగ్రెస్ నుంచి పవన్ ఖేడా, మదన్‌మోహన్ ఝా, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ్‌నరేశ్ పాండే, విఐపి నేత ముకేశ్ సాహ్ని, ఐఐపి నాయకుడు ఐ.పి.గుప్తా, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బిహార్ ఎన్నికల కోసం గఠ్‌బంధన్ మ్యానిఫెస్టోలో ఆచరణాత్మక పరిష్కారాలను హామీనిచ్చే 25 ప్రధాన అంశాలు ఉన్నాయని తేజస్వీ యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు.'బిహార్‌లో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన 20 రోజుల్లోపు ఉపాధికి హామీ ఇచ్చే కొత్త చట్టం ప్రవేశపెట్టబడుతుంది' అని ఆయన అన్నారు. బిహార్ అంతటా ఉపాధి హామీ పథకం అమలు చేయబడుతుందని ఆయన అన్నారు. 'బిహార్ ప్రభుత్వ విభాగాలలోని అన్ని కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తాం. అలాగే, అ 'జీవిక దీదీ'లందరినీ పర్మినెంట్ చేసి, నెలకు రూ.30,000 జీతం ఇస్తామని' మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో ఐటి పార్కులు, సెజ్‌లు, పాడి పరిశ్రమ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఎడ్యుకేషన్ సిటీ(విద్యా నగరం), రాష్ట్రంలో ఐదు కొత్త ఎక్స్‌ప్రెస్‌వేలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 'బిహార్ ప్రజలు నేరాలు, మోసాలు లేని పాలనను కోరుకుంటున్నారు... వారు ఎన్నికల్లో ఎన్‌డిఎకి గుణపాఠం చెబుతారు' అని తరువాయి 2లో

## తీరందాటిన 'మోంతా'

- గాలి, వానతో తీర ప్రాంతం అల్లకల్లోలం
- ఆంధ్రప్రదేశ్‌లో పొంగుతున్న వాగులు వంకలు, స్తంభించిన జనజీవనం
- నేలకొరిగిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు

**అమరావతి:** వాతావరణ శాఖ అంచనా వేసినట్లుగానే 'మోంతా' బీభత్సం సృష్టిస్తోంది. గంటకు 15కిలోమీటర్ల వేగంతో తీరంవైపు దూసుకొస్తోంది. ఈ ప్రభావంతో ఎపి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కోస్తా జిల్లాల్లోని సముద్ర తీరమంతటా అలలు ఎగసిపడుతున్నాయి. గాలి, వానలతో తీర ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఉత్తర వాయవ్యంగా కదిలి బంగాళాఖాతంలో ఏర్పడిన మోంతా తుపాను కాకినాడ మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకింది. పూర్తిగా తీరం దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, ఈ ప్రభావంతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతి భారీ వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఏపీ విపత్తుల తరువాయి 2లో



## తెలంగాణలో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను 'మోంతా' ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించారు. బుధవారం ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, తరువాయి 2లో



## 2030 నాటికి తెలంగాణ 'ఏరో-ఇంజిన్' రాజధాని

**'ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్' న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ' ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**


ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను 2030 నాటికి దేశంలోనే 'ఏరోఇంజిన్' రాజధానిగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ ఏరో సంస్థలు రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేలా సమగ్ర తరువాయి 2లో

## డాక్టర్లకు అండగా ఉండాలి

**లేదంటే న్యాయవ్యవస్థను సమాజం క్షమించదు**

**'సుప్రీంకోర్టు' కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ :** డాక్టర్లను జాగ్రత్తగా చూసుకోకపోతే, వారికి అండగా నిలబడకపోతే న్యాయవ్యవస్థను సమాజం క్షమించదని మంగళవారం సుప్రీంకోర్టు పేర్కొంది. గుర్తింపులేని హాస్పిటల్లలో కోవిడ్ 19తో పోరాడుతూ ప్రాణాలను కోల్పోయిన వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలను బీమా పాలసీలలో చేర్చకూడదని దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం తన తీర్పును రిజర్వ్ చేస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, ఆర్.మహదేవన్ ద్విసభ్య ధర్మాసనం బీమా కంపెనీలు చెల్లుబాటు అయ్యే (వాలీడ్) క్లెయిమ్‌లను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రైవేట్ వైద్యులు లాభదాయకంగా పనిచేస్తున్నారనే భావన సరైనది కాదని హితవు పలికింది. 'మనం మన వైద్యులను జాగ్రత్తగా చూసుకోకపోతే, వారి తరపున నిలబడకపోతే సమాజం మనల్ని తరువాయి 12లో



## మాజీమంత్రి హరీశ్‌రావుకు పితృవియోగం

- సిఎం రేవంత్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం
- సత్యనారాయణ మృతదేహానికి నివాళి అర్పించిన మాజీ సిఎం కెసిఆర్, మంత్రులు పొన్నం, గడ్డం తదితరులు



# ప్రపంచం
WORLD NEWS

## లోయలో పడిన బస్సు : ఆరుగురు మృతి



**సుక్రే:** సెంట్రల్ సౌత్ అమెరికా దేశం బొలీవియాలో మంగళవారం ఒక బస్సు లోయలోపడిపోవడంతో 16 మంది మరణించారు. మరో 32 మంది గాయపడ్డారు. పర్వతమార్గంలో ఉన్న సన్నటి దారిలో ప్రయాణించి వెళుతుండగా రోడ్డు అంచునే ఉన్న 1000 అడుగుల లోతు (300 మీటర్లు) ఉన్న లోయలోకి బస్సు జారి పడిపోయింది. డ్రైవరు స్టీరింగు అదుపు తప్పడంతో కోచాబంబ ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. మృతదేహాలను వెలికి తీయడం సమస్యగా మారింది. కేవలం మూడు మృతదేహాలను మాత్రమే వెలికితీశారు. ఐతే ప్రమాదంలో 23 ఏళ్ళ వయసుగల యువ డ్రైవరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. వాతావరణం సరిగ్గా లేని పరిస్థితుల్లో ప్రమాదకరమైన మలుపులో స్టీరింగ్‌ను తిప్పుతుండగా ఈ ఘటన జరిగి ఉండవచ్చునని అధికారులు అంచనావేశారు.



## ఏది కోరుకుంటే అదిస్తా, జపాన్‌కు అండగా ఉంటా

### పొగడ్తల వలకు చిక్కిన ట్రంప్ వరాల జల్లు

### నోబెల్‌కు సిఫార్సు చేసిన తకచి

**టోక్యో:** రెండు రోజుల జపాన్ పర్యటనలో అ దేశ సైన్యం పూర్తి లాంఛనాలతో అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్‌కు ఘన స్వాగతం పలికింది. వాణిజ్య ఒప్పందాలు, పొగడ్తలు, చిరునవ్వులు, కేరింతల మధ్య గొప్ప గౌరవాన్ని ఆయన అందుకున్నారు. అమెరికాకు ఆర్థిక లాభంతోపాటు ట్రంప్ వ్యక్తిగతంగా కూడా లాభపడ్డారు. జపాన్ పొగడ్తలతో ఉబ్బితబ్బిబ్బైపోయిన ట్రంప్ ప్రధానమంత్రి సనే తకచిని తిరిగి పొగడ్తల్లో ముంచెత్తారు. ''జపాన్ ఏది కోరుకుంటే అది ఇస్తా, మీకు ఎప్పుడు ఏ సమయంలో ఎలాంటి సహాయం కావాలన్నా అండగా నిలబడతా, ఎలాంటి సహాయం కావాలన్నా ఇస్తా'' అంటూ జపాన్ ప్రధానమంత్రి సనే తకచికి అభయం ఇచ్చారు. వరాలు ప్రసాదించారు. జపాన్ తమకు ఎంతో బలమైన మిత్రదేశమని ప్రకటించారు. అరుదైన ఖనిజాల సరఫరాపై రెండు దేశాల నాయకులు సంతకాలు చేశారు. రెండు దేశాల సంబంధాలు సరికొత్త స్వర్ణయుగంలోకి ప్రవేశించాయని సనే తకచి ప్రకటించారు. మొదటి రోజు సోమవారం సాయంత్రం జపాన్ చక్రవర్తితో ట్రంప్ సమావేశం జరిపారు. తర్వాత మంగళవారం జపాన్ కొత్త ప్రధానమంత్రి సనే తకచితో ట్రంప్ ముఖాముఖీ సమావేశమయ్యారు. అమెరికాకు అరుదైన ఖనిజ వనరులను సమకూర్చేందుకు జపాన్ వాణిజ్య ఒప్పదం చేసుకుంది. కేరింతలు, పొగడ్తలు, చిరునవ్వులు, వాణిజ్య ప్రయోజనాలు, వ్యక్తిగత ప్రయోజనాలమధ్య ఉల్లాసంగా ట్రంప్ పర్యటన సాగింది. అమెరికాలో భారీ పెట్టుబడులు సమకూర్చేందుకు జపాన్ కొత్త ప్రధానమంత్రి తకచి ట్రంప్‌కు భరోసా ఇచ్చారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్‌తో సమావేశం నిర్వహించి మొదటి విషమ పరీక్షను తకచి విజయవంతంగా అధిగమించారు. అదేవిధంగా ప్రపంచశాంతికి కృషి చేస్తున్నందుకుగాను డోనాల్డ్ ట్రంప్ పేరును నోబెల్ బహుమతికి సిఫార్సు చేస్తామని ఆమె ప్రకటించారు. ట్రంప్‌ను ఆమె పెద్ద ఎత్తున పొగడ్తలలో ముంచెత్తారు.

## దురుసు ప్రవర్తన, మొరటుభాషతో టర్కీ చర్చలకు పాక్ భగ్నం!



### అఫ్గానిస్థాన్‌కు యుద్ధ హెచ్చరిక

**కాబూల్:** అఫ్గానిస్థాన్‌–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల పరిష్కారానికి టర్కీలో జరుగుతున్న చర్చలు ఎలాంటి ఫలితాలు లేకుండా ముగిశాయి. దురుసు ప్రవర్తన, మొరటు భాషతో పాకిస్థాన్ ప్రతినిధులు చర్చలను భగ్నం చేశారు. ఈ చర్చలు ప్రధానంగా పాకిస్థాన్‌లో ఉగ్రవాద సంస్థ తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) గురించే జరిగాయి. టిటిపిని అదుపు చేయాలని అఫ్గానిస్థాన్ ప్రభుత్వప్రతినిధులను పాకిస్థాన్ కోరింది. టిటిపి ఉగ్రవాదులు పాకిస్థాన్‌లో దాడులుచేస్తే అఫ్గానిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని, యుద్ధం తప్పదని పాకిస్థాన్ ప్రతినిధులు మొరటు హెచ్చరిక చేశారు. టర్కీలో మధ్యవర్తుల ద్వారా అక్టోబరు 25న శనివారం ఈ చర్చలు మొదలయ్యాయి. ఐతే ఇంకా పరిష్కార మార్గాలను ఇరు పక్షాలు అన్వేషిస్తున్నాయని మంగళవారం ఉదయం తొలుత వార్తలు వెలువడ్డాయి. టిటిపి దాడులు చేయకుండా అదుపు చేసుకునే బాధ్యత పాకిస్థాన్ సైన్యం, భద్రతా దళాలదే తప్ప తమకు సంబంధం లేదని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు చర్చల్లో స్పష్టం చేశారు. తమ భూభాగం నుండి ఎవరూ దాడులు చేయకుండా చూసుకోవడం మాత్రమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రతినిధులు మొండిగా వాదించడంతో, తమ భూభాగాన్ని ఎవరూ దుర్వినియోగం చేయకుండా తాము చూసుకుంటామని, కానీ పాకిస్థాన్ దళాలు తమ భూభాగంలోకి ప్రవేశించడం, గగనతలాన్ని ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడకూడదని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు తిరిగి హెచ్చరిక చేశారు. టిటిపి ఉగ్రవాదం పాకిస్థాన్ అంతర్గత విషయమని, దాంతో తమకు సంబంధం లేదని, మీ దేశంలో ఉగ్రవాదులను తామెలా అదుపుచేస్తామని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు ప్రశ్నించినప్పటికీ పాకిస్థాన్ ప్రతినిధులు వినిపించుకోలేదు. టర్కీలో జరుగుతున్న ఈ చర్చల్లో సంప్రదింపుల సందర్భంగా పాకిస్థాన్ ప్రతినిధులు అనుసరించిన దురుసు ప్రవర్తన, మొరటు భాష, పదజాలం చూసి మధ్యవర్తిదేశం టర్కీ, ఖతార్‌లకు చెందిన అధికార ప్రతినిధులు కూడా విస్తుపోయినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ కాబూల్ కేంద్రంగా ప్రచురితమవుతున్న పత్రిక మంగళవారం బ్రేకింగ్ న్యూస్‌లో ప్రకటించింది.పాకిస్థాన్ తరపున ప్రతినిధులకు చర్చల్లో నాయకత్వం వహించిన వ్యక్తి పూర్తిగా మర్యాద తెలియనివాడని వర్గాలు పేర్కొన్నాయి. తమ దురుసు ప్రవర్తనతో పాకిస్థాన్ ప్రతినిధులు చర్చలను భగ్నం చేశారు. ఈ సంప్రదింపులు ఎలాంటి ఫలితాలు లేకుండానే ముగిశాయని పేర్కొంది. పాకిస్థాన్ ప్రతినిధుల ప్రవర్తన చూసి మధ్యవర్తిదేశం తీవ్రంగా కలత చెందిందని పత్రిక పేర్కొంది. చర్చల బల్లవద్ద ఎలా ప్రవర్తించాలో పాకిస్థాన్ ప్రతినిధులకు తెలియదని, ఎలాంటి పొంతనాలేని వాదనలు వారు సంప్రదింపుల్లో ముందుకు తీసుకువస్తున్నారని పేర్కొంది. ఎజెండాలో ఉన్న అన్ని అంశాలపై చర్చ జరిగినప్పటికీ ఒకేఒక్క అంశం చుట్టూ చర్చలను పాకిస్థాన్ ప్రతినిధులు సాగదీస్తున్నారు. పాకిస్థాన్‌లో ఉంటూ పాకిస్థాన్‌లో తిరుగుబాటు చేసి, ప్రభుత్వంపై యుద్ధం చేస్తున్న గ్రూపులన్నింటినీ మీరే నియంత్రణలోకి తీసుకురావాలని, మీరే వారిని అదుపుచేయాలని అఫ్గానిస్థాన్ ప్రతినిధులను పాకిస్థాన్ ప్రతినిధిబృందం నాయకుడు డిమాండ్ చేయడం మధ్యవర్తులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ''సమస్య పాకిస్థాన్‌లో ఉంది, పాకిస్థాన్ భూభాగంలో పోరాటం జరుగుతున్నందువల్ల ఈ సమస్యతో తమకు సంబంధం లేదని అఫ్గానిస్థాన్‌కు చెందిన తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధులు వాదించారు. కానీ భారతదేశ సహకారంతో తాలిబన్ ప్రభుత్వం చేతులు కలిపి ఉగ్రవాదులను తమ భూభాగంలోకి పంపిస్తోందన్నది మొదటినుండీ పాకిస్థాన్ ప్రభుత్వం చేస్తున్న వాదన. ఐతే ఈ చర్చల్లో టిటిపి వెనుక భారతదేశం ఉందన్న విషయం, భారతదేశం పేరు వినిపించిందా? లేదా? అనే విషయం బయటకు రాలేదు. ''మీదేశంలో ఉన్న మీదేశ తిరుగుబాటుదారులను వేరే దేశం ద్వారా నియంత్రణ చేయాలని అడుగుతారా? స్వంతదేశంలో ఉన్న తిరుగుబాటుదారులను అదుపు చేయమని పొరుగు దేశాన్ని ఎలా అడుగుతారు?'' అనేది అఫ్గానిస్థాన్ ప్రతినిధులు అడుగుతున్న ఎదురుప్రశ్న.

### నేను చిటికెలో పరిష్కరిస్తా : ట్రంప్

పాకిస్థాన్–అఫ్గానిస్థాన్ మధ్య తలెత్తిన సంఘర్షణను తాను చిటికెలో పరిష్కరిస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న ట్రంప్ అంతకు ముందు మలేసియాలో పర్యటించినప్పుడు థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య శాంతి ఒప్పందంపై సంతకాల సందర్భంగా ఆదివారం మాట్లాడుతూ, పాకిస్థాన్–అఫ్గానిస్థాన్ మధ్య సమస్యను తాను చిటికెలో పరిష్కరిస్తానన్నారు. టిటిపి ఉగ్రవాదులకు అఫ్గానిస్థాన్ ఆశ్రయం ఇచ్చి తమ భూభాగంలోకి పంపుతోందని పాకిస్థాన్ ప్రభుత్వం పదే పదే ఆరోపణలు చేస్తున్నది. ఈ వ్యవహారంలో భారత్‌పై కూడా ఆరోపణలు చేస్తోంది. మీరు దాడి చేశారంటే మీరే దాడిచేసి మా భూభాగంలోకి వచ్చారంటూ రెండు దేశాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి.

## సూడాన్ అంతర్యుద్ధంలో కొత్త మలుపు!

### కాల్పుల విరమణకు ఐక్యరాజ్యసమితి డిమాండ్





**న్యూయార్క్ :** ఆఫ్రికా ఈశాన్యప్రాంత దేశం సూడాన్‌లో అంతర్యుద్ధ పరిస్థితులు పరాకాష్ఠకు చేరాయి. అల్–ఫాషెర్ నగరం తమ చేతికి చిక్కిందని ఆర్ఎస్ఎఫ్ పేర్కొంది. దీంతో సూడాన్‌లో అంతర్యుద్ధం కొత్త మలుపు తిరిగింది. ఈ పరిణామంతో డార్ఫర్‌లోని ఐదు రాష్ట్రాలూ ఆర్ఎస్ఎఫ్ నియంత్రణలోకి వచ్చినట్లయింది. దీంతో డార్ఫర్‌తోపాటు సూడాన్ దక్షిణానకొన్ని ప్రాంతాలు కూడా ఆర్ఎస్ఎఫ్ అధీనంలో ఉన్నట్లవుతుంది. ఆర్మీపై ఆర్ఎస్ఎఫ్ ఆధిపత్యం సాధించినట్లవుతుంది. 2023కు ముందు సైన్యంతో కలిసి పరిపాలన చేసిన నాయకులు ఆర్ఎస్ఎఫ్ (ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్) పేరుతో చీలికవర్గంగా విడిపోయి ఆర్మీపై అంతర్యుద్ధం ప్రారంభించి తాజాగా డార్ఫర్‌లోని అతిపెద్ద అల్–ఫాషెర్ నగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆర్మీ కేంద్ర కార్యాలయాన్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో సూడాన్ ఆర్మీ అల్–ఫాషెర్ నుండి తిరుగుముఖం పట్టింది. ఈ విషయాన్ని మంగళవారంనాడు సూడాన్ ఆర్మీ వర్గాలు ధృవీకరించాయి. పశ్చిమ డార్ఫర్‌లో ఆర్మీ అధీనంలో ఉన్న చిట్టచివరి కేంద్రం ఇదే. ఇది కూడా చేజారిపోయింది. దీంతో అల్–ఫాషెర్ నగరంలో ఉన్న ప్రజల భద్రతపట్ల ఐక్యయరాజ్యసమితి, స్థానిక గ్రూపులు ఆందోళన చెందుతున్నాయి. అల్–ఫాషెర్ లో పరిస్థితులను ప్రజాస్వామ్య అనుకూలవాదులు వీడియోల ద్వారా బాహ్య ప్రపంచానికి తెలియజేస్తున్నారు. ఈ నగరంలోని వీధుల్లో కాలి బూడిదైన వాహనాలు కుప్పలు కుప్పలుగా పడి ఉండటం కనిపిస్తోంది. అనేకమృతదేహాలు కూడా ఈ వాహనాలవద్దనే పడి ఉన్న దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. అల్–ఫాషెర్ వెలుపల ఉన్న అబూ షాక్ శిబిరంతోపాటు ఆ చుట్టుపక్కల అనేక శిబిరాలలో 4.50 లక్షలమంది ప్రజలు తలదాచుకున్నారు. యుద్ధం మొదలైనప్పటినుండీ రెండేళ్ళుగా ఈ శిబిరాలపై ఆర్ఎస్ఎఫ్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అల్–ఫాషెర్ నగరంలో దాదాపు 2.50 లక్షలమంది ప్రజలు చిక్కుకుపోయారు. ఈ నగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి అనేక రోజులుగా ఆర్ఎస్ఎఫ్ ప్రయత్నాలు చేస్తోంది. ఆర్ఎస్ఎఫ్ ఈ నగరాన్ని చుట్టుముట్టి లోపలికిగానీ, వెలుపలికిగానీ రాకపోకలను 2024 నుండీ నిషేధించింది. చివరకు స్వాధీనం చేసుకుంది. దీంతో నగరంలో ప్రజలు ఆహార కొరతతో మల మల మాడిపోతున్నారు. సూడాన్‌లో పరిస్థితులపట్ల ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ మంగళవారం తీవ్రంగా స్పందించారు. సూడాన్‌లో కాల్పుల విరమణ పాటించాలని ఆయన ప్రతిపాదించారు. ఆకలితో మలమల మాడిపోతున్న ప్రజలు బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలని, వారిని వదిలిపెట్టాలని, లేదా అల్–ఫాషెర్‌లోకి మానవతా సహాయాన్ని పంపిణీ చేసేందుకు అనుమతించాలని ఆంటోనీ గుటెర్రెస్ డిమాండ్ చేశారు. సూడాన్‌లో వేలాదిమంది ప్రజలను ఆర్ఎస్ఎఫ్ ఊచకోత కోస్తోందని ఆయన విమర్శించారు. వీటిని ఆరోపణలుగా పేర్కొంటూ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ ఖండించింది. 2023లో ప్రారంభమైన ఈ అంతర్యుద్ధంలో ఇప్పటివరకూ 1,50,000 మంది మరణించగా, మరో 1.40 లక్షల మంది ఇళ్ళు వదలిపారిపోయారు.

## భారీ వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆసిఫాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయనే అంచనాలు ఉన్నాయని తెలిపారు. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్నారు.

## శాశ్వత ఉద్యోగాలు (మొదటి పేజీ తరువాయి)

తేజస్వీ యాదవ్ అన్నారు. ప్రజలు 'పడాయి' (మెరుగైన విద్య), 'దవాయి' (మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు), 'కమాయి' (ఉపాధి),'సిచాయ్' (మెరుగైన నీటిపారుదల సౌకర్యాలు) అందించే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. బిహార్ పట్ల ఎన్‌డిఎకి ఎలాం టి దార్శనికత లేదని, వారు ఇప్పటివరకు ఎన్నికల కోసం మ్యానిఫెస్టోను విడుదల చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను బిజెపి నాయకులు, అవినీతి అధికారులు కీలుబొమ్మగా మార్చారని, బిజెపిని పెంచుకోవడంపైనే ఆ పార్టీకి ఆసక్తి ఉందని, అందుకు నితీశ్‌కుమార్‌ను ఉపయోగించుకుంటున్నారని, ఆయన ముఖ్యమంత్రి ముఖం కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారని ఆయన ఆరోపించారు. బిహార్ నిషేధం, ఎక్సైజ్ చట్టం పూర్తిగా విఫలమైందని,ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే, కల్లుపై నిషేధాన్ని ఎత్తేస్తామని తేజస్వీ యాదవ్ అన్నారు. బిహార్ అభివృద్ధికి ఇండియా బ్లాక్ మ్యానిఫెస్టో ఒక రోడ్ మ్యాప్ అని, రాష్ట్రాన్ని నంబర్ వన్ గా మార్చాలనేది దీని సంకల్పం అని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం నుంచి ఇండియా బ్లాక్ తరఫున బిహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పవన్ ఖేడా తెలిపారు.

**వక్ఫ్ సవరణ చట్టం అమలుకు నో..**

**బౌద్ధ సమాజ సభ్యులకు బౌద్ధ దేవాలయాల నిర్వహణ ..**

తాము అధికారంలోకి వస్తే బిహార్‌లో వక్ఫ్ (సవరణ) చట్టం అమలును అడ్డుకుంటామని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణను మరింత పారదర్శకంగా, సంక్షేమ ఆధారితంగా చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. బుద్ధగయలోని బౌద్ధ దేవాలయాల నిర్వహణను బౌద్ధ సమాజ సభ్యులకు అప్పగిస్తామని ప్రతిపక్ష కూటమి హామీ ఇచ్చింది.'అన్ని మైనారిటీ వర్గాల రాజ్యాంగ హక్కులు రక్షించబడతాయి. వక్ఫ్ (సవరణ) చట్టం నిలిపివేయబడుతుంది... వక్ఫ్ ఆస్తి నిర్వహణ పారదర్శకం గా, సంక్షేమ ఆధారితంగా, ఉపయోగకరంగా చేయబడుతుంది' అని ఇండియా బ్లాక్ మ్యానిఫెస్టోలో పేర్కొంది.

## ఉద్యోగాల కోత (మొదటి పేజీ తరువాయి)

అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తోసహా అనేక విభాగాలపై ఈ కోత ప్రభావం పడుతుందని అంచనావేస్తున్నారు. ప్రపంచంలో అతిపెద్ద ఇ–కామర్స్ కంపెనీ, క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీస్ ప్రొవైడర్ అమెజాన్ తన కంపెనీ క్రమబద్ధీకరణకు,బ్యూరోక్రసీని తగ్గించడానికి 30,000 ఉద్యోగాలలో కోత పెట్టేందుకు సిఇఓ ఆండీ జెస్సీ చొరవ తీసుకున్నారని రాయిటర్స్ వార్తాసంస్థ తొలుత ప్రకటించింది. ఈ వార్తపై వ్యాఖ్యానించేందుకు తిరస్కరించిన అమెజాన్, 14,000 కార్పొరేట్ ఉద్యోగాలలో కోత పెడుతున్నట్లు మంగళవారం అధికారిక ప్రకటన చేసింది. కంపెనీ ఖర్చులు తగ్గించాలని ఆండీ జెస్సీ ఈ ఏడాది జూన్ నెల నుండీ చాలా గట్టి పటుదలతో ఉన్నారు. ఈ మేరకు ఉద్యోగులకు లేఖ ద్వారా ఒక సందేశాన్ని చూచాయిగా అందించారు. ఇప్పుడు ఈ లేఖను కూడా జతచేసి ప్రకటన విడుదల చేశారు. సిఇఓగా 2021లో ఆయన బాధ్యతలు చేపట్టినప్పటినుండీ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కంపెనీలో కృత్రిమ మేధ ప్రాధాన్యాన్ని పెంచాలని ఉవ్విళ్ళూరుతున్నారు. ఆటోమేషన్ నిత్యకృత్యంగామారడం, అనిశ్చితి వంటి అనేక అంశాలు శ్రామికశక్తిని కుదించేందుకు దారితీశాయి. కంపెనీ శ్రామికశక్తి వినియోగంపై కృత్రిమ మేధ ప్రభావం చూపిస్తుందని రాబోయే సంవత్సరాలలో దానికే ప్రాధాన్యం వస్తుందని ఆండీ జెస్సీ ముందునుండీ హెచ్చరించిన విధంగానే ఈ నిర్ణయం ప్రకటించారు. దాదాపు 1000 జనరేటివ్ ఎ ఐ సర్వీసులు, వివిధ రకాల సేవలు అందించే ఎఐ అప్లికేషన్లు చురుగ్గా నిర్మాణంలో ఉన్నాయని ఆనాడే ఆయన చెప్పారు. కానీ ఎంతమంది ఉద్యోగులను తొలగిస్తారన్న విషయాన్ని ఆనాడు ఆయన ప్రకటించలేదు. కంపెనీ అనుసరించిన ''రిటన్ లూ ఆఫీస్'' విధానాన్ని అమలు చేయడంలో, స్వచ్ఛంధంగా తొలగింపులను సృష్టించడంలో వైఫల్యాలు ఎదురయ్యాయని, అందువల్లనే ఈ స్థాయిలో కంపెనీలో తొలగింపుల పరిస్థితికి దారితీసిందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి.





## నవీన్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు కమ్మ సంఘాల నాయకులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని సిఎం రేవంత్ రెడ్డికి హామీనిచ్చారు. కమ్మ సంఘాల నాయకులు హైదరాబాద్, జూబ్లీ హిల్స్‌లోని సిఎం నివాసంలో కమ్మ సంఘాల నాయకులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. నామినేటెడ్ పదవుల్లో తమ సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని, అమీర్‌పేట్ మైత్రీ వనంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కమ్మ సంఘం ప్రతినిధులు సిఎంను కోరారు. దీనిపైన సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, శేరిలింగంపల్లి ఎంఎల్‌ఎ అరికెపూడి గాంధీ, కూకట్ పల్లి ఇన్‌చార్జ్ బండి రమేశ్, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, కమ్మ సంఘాల ముఖ్య నాయకులు హాజరయ్యారు.

## స్కూల్ నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'సమగ్ర శిక్ష' కింద రంగారెడ్డి జిల్లాలోని ఫారూఖ్‌నగర్ మండలం, మొగిలిగిడ్డ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణ రూ. 10 కోట్లను మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## 80 టిఎంసిలు

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని డ్యాముల స్థితి గతులపైన నివేదికను రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యల పట్ల నవంబర్ రెండవ వారంలో మరోసారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని సిఎం నిర్ణయించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమై న ప్రణాళికలు సిద్ధం చేయాలని, దీనికి సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని సిఎం సూచించారు.



## 'సిఎం ప్రజావాణి'లో 256 దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన 'సిఎం ప్రజావాణి' కార్యక్రమంలో మొత్తం 256 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 71, రెవెన్యూ శాఖకు సంబంధించి 37, ఇందిరమ్మ ఇండ్ల కోసం 83దరఖాస్తులు రాగా, ప్రవాసి ప్రజావాణికి ఒక దరఖాస్తు అందింది. ఇతర శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులను స్వీకరించి ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ఆయా శాఖలకు చెందిన సంబంధిత అధికారులతో వారు ఫోన్ లో మాట్లాడారు.

## 'ఏరో ఇంజిన్' రాజధాని (మొదటి పేజీ తరువాయి)

'రోడ్ మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. 'టాటా అడ్వాన్స్‌డ సిస్టమ్స్ లిమిటెడ , 'సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్' సంయుక్తంగా రూ.425 కోట్ల పెట్టుబడితో ఆదిభట్లలో ఏర్పాటు చేసిన 'ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్' న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని మంగళవారం హైటెక్ సిటీలోని ఐటిసి కోహినూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. గ్లోబల్ 'ఏరోస్పేస్‌డిఫెన్స్ స్పేస్' హబ్ గా తెలంగాణ ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. హైదరాబాద్ అంటే కేవలం 'సిటీ ఆఫ్ పెరల్స్' మాత్రమే కాదని, ప్రొపల్షన్, ప్రెసిషన్, ప్రోగ్రెస్ నగరంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల ఎగుమతులు 2023–24లో రూ.15,900 కోట్లు ఉండగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల్లోనే ₹30,742 కోట్లకు పెరిగాయన్నారు. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ హయాంలో ఈ రంగం సాధించిన వృద్ధి రేటుకు నిదర్శనమన్నారు. ఈ 'న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ'లో ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలు లీప్ ఇంజిన్ల తయారీలో వినియోగించే బేరింగ్ హౌసింగ్ (స్టేషనరీ కాంపోనెంట్), లో ప్రెషర్ ట్బన్ షాఫ్ట్ (రొటేటివ్ కాంపోనెంట్) తయారవుతాయన్నారు. ఫలితంగా తెలంగాణ బ్రాండ విశ్వవ్యాప్తమవ్వడంతో పాటు కొత్తగా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 'విమాన ప్రయాణ భవిష్యత్తును నిర్మించాలనుకుంటే దానిని తెలంగాణలో నిర్మించండి' అని ఈ వేదికగా అంతర్జాతీయ దిగ్గజ ఏరో సంస్థలకు పిలుపునిచ్చారు. ఇంజిన్స్, కాంపోనెంట్స్, ఎమ్మార్వో, కన్వర్షన్స్, స్పేస్, డ్రోన్స్, డిజిటల్, ఏఐ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ లిమిటెడ సీఈవో, ఎండీ సుకరన్ సింగ్, ఈడీ మసూద్ హుస్సేన్, సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్స్ వైస్ ప్రెసిడెంట్ డొమినిక్ డూప్, టీజీఐఐసీ ఎండీ శశాంక, తెలంగాణ ఏరో స్పేస్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ పిఎ తదితరులు పాల్గొన్నారు.

## తీరందాటిన 'మొంతా'

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇప్పటికే కోస్తా అంతటా అనేక ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. మామిడికుదురు మండలం మాకినపాలెం గ్రామంలో ఈదురుగాలులకు తాటిచెట్టు కూలి 49 ఏళ్ళ మహిళ మృతి చెందింది. నగరం గ్రామంలో మరో తాటిచెట్టు కింద పడి 15 ఏళ్ళ మందపాటి ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. కోస్తాలోని అన్ని జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నెల్లూరు జిల్లా దగదర్తి, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో కుంభవృష్టి కురిసింది. ఈ రెండు ప్రాంతాల్లో దాదాపు 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 15 ప్రాంతాల్లో 50 నుంచి 100 మిల్లీమీటర్ల మధ్యలో వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. తుపాన్ ప్రభావం నేపథ్యంలో శంషాబాద్ నుంచి ఏపీకి వెళ్లాల్సిన 18 విమాన సర్వీసులు రద్దయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే దాదాపు 107 రైళ్ళను రద్దు చేసింది. కొన్నింటిని దారిమళ్ళించారు. ఏపీ, తెలంగాణాలో ప్రత్యేక వార్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

## చంద్రన్న, బండి ప్రకాష్

(మొదటి పేజీ తరువాయి)

1983లో కమాండర్ స్థాయికి వెళ్లి 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారని, 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారని తెలిపారు. దాదాపు 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగారని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో బండి ప్రకాష్‌తో పాటు పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారని స్పష్టం చేశారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడం, దీర్ఘకాలిక మోకాళ్ల వ్యాధి, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి అలాగే సిపిఐ మావోయిస్టులో ఏర్పడిన సిద్దాంతపరమైన భేదాభిప్రాయాలు, అంతర్గత విభేదాలు వంటి కారణాల వల్ల చంద్రన, ప్రకాష్‌లు పార్టీతో తమ సంబంధాలను తెంచుకొని తెలంగాణ ప్రభుత్వ సహాయంతో జన జీవన స్రవంతిలో తిరిగి చేరాలని నిర్ణయించుకోవడం జరిగిందని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన బండి ప్రకాష్ (55)1984 అక్టోబర్‌లో సిపిఐ నాయకుడు విటి అబ్రహం హత్యకు పాల్పడి 1988లో ఆదిలాబాద్ జైలు నుంచి పారిపోయి 1999లో మావోయిస్టు ఉద్యమంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని డిజిపి తెలిపారు. అబ్రహం హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష విధించగా 1992లో మల్కాజ్‌గిరిలో ప్రకాష్‌ను అరెస్టు చేసి చంచల్ గూడ జైలుకు తరలించారు. 2004 ఆగస్టులో క్షమాభిక్షపై ఇతను విడుదలయ్యాడు.2005లో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చలు విఫలం కావడంతో ప్రకాష్ మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.2015 నుండి ఇప్పటి వరకు ఇతను సింగరేణి కోల్ బెల్ట్ కమిటి ఇన్‌ఛార్జ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటి ప్రెస్ టీమ్ ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతూ మావోయిస్టు పత్రికా ప్రకటనలను ప్రభాత్ పేరుతో విడుదల చేస్తున్నాడని డిజిపి వివరించారు. పుల్లూరు ప్రసాద్‌రావు మీద ప్రకటించిన రూ. 25 లక్షల నగదు, బండి ప్రకాష్ పేరు మీద ప్రకటించిన రూ.20లక్షల నగదు బహుమతిని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డిజిపి వారికి అందించారు. వీరిద్దరికి పునరావాస విధానంలో లభించాల్సిన అన్ని ప్రయోజనాలు అందిస్తామని డిజిపి స్పష్టం చేశారు.

**ఈ ఏడాది లొంగిపోయిన వారి సంఖ్య 427..**

అజ్ఞాతంలో ఉన్న సిపిఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన 427 మంది నేతలు, సభ్యులు ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ఉన్నారని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు. వీరిలో ఇద్దరు కేంద్ర కమిటి సభ్యులు, ఎనిమిది మంది రాష్ట్ర కమిటి సభ్యులు, ఇద్దరు డివిజన్ కమిటి కార్యదర్శులు, ఎనిమిది మంది డివిజన్ కమిటి సభ్యులు, 35 మంది ఏరియా కమిటి సభ్యులు సాయుధ పోరాటాన్ని వీడి తమ కుటుంబాలతో కలిసి శాంతియుత జీవితం గడపాలని పోలీసుల ముందు లొంగిపోయారని డిజిపి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన 64 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో అదనపు డిజిపి మహేష్ మురళీధర్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్ఐబి చీఫ్ బి.సుమతిలతో పాటు లొంగిపోయిన మావోయిస్టు నేతలు పుల్లూరి ప్రసాద్‌రావు, బండి ప్రకాష్‌లు పాల్గొన్నారు.

**ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కుట్ర భగ్నం**

**భద్రాద్రి కొత్తగూడెం:** పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు తలపెట్టిన కుట్ర భగ్నమైంది. దీంతో సిఆర్‌పిఎఫ్ జవాన్లు తృటిలో ప్రాణాలతో బయట పడ్డారు. వివరాల ప్రకారం, సుక్మా జిల్లా పుల్బాగ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని మావోయిస్టుల కోసం సిఆర్‌పిఎఫ్ బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆ దిశగా బాంబు డిటెక్టర్‌తో సోదాలు నిర్వహిస్తుండగా 40 కేజీల ఐఇడి మందు పాతరను గుర్తించారు. దానిని బయటకు తీసి బిఆర్‌పిఎఫ్ బాంబు స్క్వాడ్ నిపుణులు నిర్వీర్యం చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఆ ఐఇడి బాంబు పేలితే భారీ నష్టం వాటిల్లేదని పోలీసులు తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



నల్లకుంట శంకర మఠంలో శృంగేరి జగద్గురువులు విధుశేఖర భారతీ స్వామి వారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మ విజయ యాత్రలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన విధుశేఖర భారతీ స్వామితో సిఎం రేవంత్ రెడ్డి సమావేశమై ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా సిఎం వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికల గురించి స్వామివారికి వివరించారు. రాష్ట్రంలోని హిందూ ఆలయాల అభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం స్వామికి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

● పెండింగ్ ఫీజులను చెల్లించకపోతే విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతుంది? ● ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయ్ : తక్కళ్ళపల్లి శ్రీనివాస రావు, ఎన్.ఎ స్టాలిన్ మండిపాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజానికి అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, మానవీయ విలువలు కల్పించే సాధనే విద్యా అని, అలాంటి విద్యను నేటి పాలకులు భ్రష్టు పట్టిస్తున్నారని ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస రావు, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ స్టాలిన్ విమర్శించారు. సమస్యల సుడిగుండంలో, సకల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న విద్యారంగాన్ని కాపాడలేని నిస్సహాయక స్థితిలో పాలక వర్గాలు ఉన్నాయన్నారు. పెండింగ్ ఫీజులను చెల్లించకపోతే విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతుందని?, ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయని వారు మండిపడ్డారు. హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, ఎన్.ఎ.స్టాలిన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుండా, కొత్త సమస్యలను సృష్టిస్తూ, భ్రష్టు పట్టిస్తున్నాయని దుయ్యబట్టారు. విద్యారంగం సమస్యలను పరిష్కరించడంలో పాలక వర్గాలకు ఎటువంటి చిత్తశుద్ధి లేదనే విషయం వారి పాలనతోనే స్పష్టమవుతోందన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి, పేద, మధ్య తరగతి వర్గాలకు విద్య పూర్తిగా దూరం చేసే కుట్రను అమలు చేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే 'నూతన జాతీయ విద్యావిధానం2020' పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యను కార్పొరేటీకరణ, విద్య కేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేసేందుకు విద్యార్థులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్.ఎ.స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఉద్ధరిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, విద్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. రాజకీయ లబ్ధి కోసం వందల కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్న పాలకులు, ప్రభుత్వ విద్యను పక్కన పెడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ రూ. 8,300 కోట్ల బకాయిలను, బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థుల బకాయిలను చెల్లించడం లేదని, దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరవధిక సమ్మె నోటీసులు ఇచ్చిన ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్య సంఘాలతో ప్రభుత్వం తక్షణం చర్చించి, విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, గ్యార నరేష్, రహమాన్, గ్యార క్రాంతి, సి.రాజు, రాష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్దన్, మచ్చ రమేష్, భాషబోయిన సంతోష్, నెల్లి సత్య, అక్రమ్, అజిత్, ప్రీతమ్, దిడ్డి పార్థసారథి, మూడవత్ పవన్, ప్రణీత్ గౌడ్, ప్రవీ ణ్, బి.ప్రేమ్ కుమార్, దినాకర్, అనిల్, హరీష్, దత్తు రెడ్డి,ప్రవీణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సినిమా టికెట్ ధర పెంచాలంటే సినీ కార్మికులకు 20% వాటా ఇవ్వాల్సిందే

అభినందన సభలో సినీ కార్మికులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇక నుంచి సినిమా టికెట్ ధర పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. వాటా ఇస్తేనే టికెట్ల పెంపునకు జిఒ ఇస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో మంగళవారం సినీ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సినీ కార్మికులపై సిఎం వరాల జల్లు కురిపించారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేశాయన్నారు. తెలుగు సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తీసుకురావడంలో ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, అన్న ఎన్‌టిఆర్, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ వంటి ప్రముఖులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ, కార్మికులను ఆదుకున్నారన్నారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల కోసం మణికొండలో 10 ఎకరాల స్థలాన్ని అందించి, చిత్రపురి కాలని ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. సినీ కార్మికుల శ్రమ తనకు తెలుసునని, ఆస్కార్ స్థాయికి తెలుగు పరిశ్రమ వెళ్లింది అంటే కారణం కార్మికులేనని అన్నారు. సినీ కార్మికులు రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నారని అభినందించారు. వారి సమస్యలను తెలుసుకునేందుకే దిల్ రాజును ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించామన్నారు. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని సిఎం గుర్తు చేశారు. గత ప్రభుత్వం నంది అవార్డులను పట్టించుకోలేదన్నారు. నిలిపివేసిన నంది అవార్డుల స్థానంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుమీద గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ను ప్రకటించి చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ సినీ పరిశ్రమకు వేదికగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికలో ఫిల్మ్ ఇండస్ట్రీకి ప్రత్యేక చాప్టర్ ఉంటుందన్నారు. హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చే బాధ్యత తనదన్నారు. చిన్న సినిమాలు తక్కువచేసి చూసే ప్రసక్తే లేదన్నారు. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీనిచ్చారు. కృష్ణానగర్ ప్రాంతంలో సినీ కార్మికుల పిల్లలు చదువుకునేందుకు 34 ఎకరాల్లో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల నిర్మిస్తామని హామీనిచ్చారు. 'కర్ణుడు ప్రాణం పోయినా మిత్రధర్మం వదలలేదు, అలానే మీకు అండగా నిలబడడం తెలంగాణ ప్రభుత్వ ధర్మం' అని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలోచనలతో చిత్రపరిశ్రమ ముందుకు వస్తే ప్రభుత్వం కూడా సహకరిస్తుందన్నారు. నవంబర్ చివరి వారంలో సినీ కార్మికుల సమస్యలపై మరోసారి సమావేశం ఏర్పాటు చేసి, సంక్షేమానికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, సినీ నిర్మాతలు, దర్శకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

**సినీ కార్మికులపై సిఎం వరాల జల్లు..**

- సినీ కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు.
- ఆ నిధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు మంజూరు.
- సినిమా ఆదాయంలో 20 శాతం వాటా కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌కు ఇవ్వాలన్న సూచన.
- టికెట్ ధరలు పెంపు అనుమతులు కూడా కార్మికుల వాటా నిబంధనతో మాత్రమే ఇస్తాం.
- కార్మిక సంఘాల అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం.
- భారత్ ఫ్యూచర్ సిటీలో సినీ ఫైటర్స్ ట్రైనింగ్ స్థలం కేటాయిస్తాం.
- కృష్ణా నగర్‌లో సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మిస్తాం.
- ఆరోగ్య సమస్యలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించనున్నట్లు సిఎం హామీలు ఇచ్చారు.

## అప్పుడు అడవిలో.. ఇప్పుడు జనంలో

మావోయిస్టు భావజాలాన్ని ఓడించడం ఎవరి తరం కాదు: పుల్లూరి ప్రసాదరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న కీలక వ్యాఖ్యలు చేశారు. 'మాది లొంగుబాటుకాదు.. అభివృద్ధిలో కలిసి పనిచేయడానికే జనజీవన స్రవంతిలో కలిశాం.. ఇప్పటి వరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పోరాటం చే శాం భవిష్యత్తు లో కూడా అలాగే చేస్తాం.. మా సిద్ధాంతం ఓడిపోలేదు.. ఓడించడం కూడా ఎవరితరం కాదు.. ప్రజల మధ్య ఉండి సేవ, పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాం.. ఆయుధాలను పార్టీకే ఇచ్చి జనంలోకి వచ్చాం'' అని చంద్రన్న కీలక వ్యాఖ్యలు చేశారు. డిజిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మీడియా అడిగిన పలు ప్రశ్నలకు ఆ యన సమాధానం చెప్పారు. ప్రస్తుతం సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవోజి ఎన్నికయ్యారని ఆయన స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీలో చీలిక వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం చంద్రన్నతో కలిసి తాము ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల కోసం పనిచేయడం ఖాయమన్నారు. మావోయిస్టు భావజాలంను ఓడిచ దం ఎవరితరం కాదు, ఎల్లవేళ్లలో బతికే ఉంటుందన్నారు. ప్రజల నుంచే ఈ భావజాలం పుట్టుకొస్తుందని ఆశిస్తున్నానన్నారు. కాగా, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్న చంద్రన్న.. మావోయిస్టు పార్టీలో 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని తెలంగాణ డిజిపి శివధ్రరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం చంద్రన్నతో పాటు మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్ కూడా తెలంగాణ డిజిపి ఎదుట లొంగిపోయారు.

## ఎల్ఐసి సొమ్ము అదానీకి బిజెపి ప్రభుత్వం ధారాదత్తం

డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ శతాబ్ది బహిరంగ సభను జయప్రదం చేయాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎల్ఐసిలో ఉన్న రూ.33 వేల కోట్ల ప్రజల బీమా సొమ్మును సంక్షోభంలో ఉన్న ఆదానీ కంపెనీకి కట్టబెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి ఆరోపించారు. సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగింది సమావేశానికి జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఎల్ఐసిలో దేశ ప్రజల సొమ్మును అదానికి ధారాదత్తం చేయడాని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వం నిర్ణయాని వ్యతిరేకిస్తూ ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నుండి ఈతర రాష్ట్రాలకు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్‌లపై ఆర్‌టిఎ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన తరుచుగా ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు, ప్రభుత్వం ఆర్భాటం చేస్తుంది తప్ప మిగతా సమయంలో ఎందుకు తనిఖీలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆర్‌టిఎ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించి నిబంధనలను పాటించని ట్రావెల్స్‌లపై చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేయాలని కోరారు. డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓచారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని ఇందు కోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని ఖమ్మంకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సిపిఐ 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించిందని, దేశ స్వతంత్ర పోరాటంలో అగ్ర భాగం నిలిచిందని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎల్ఎసి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన వరి ధాన్యం, పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. వరి,పత్తి తేమ శాతం పేరుతో ఇబ్బందులు పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.వరి ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి రైతులకు సరైన వసతులు కల్పించాలని ప్రభుత్వాని కోరారు. అదేవిధంగా సిపిఐ శతాబ్ది బహిరంగ సభ విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా నవంబర్ 17 నుంచి జరిగే సిపిఐ జాతను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఉజ్జిని యాదగిరి రావు అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సినియర్ నాయకులు మల్లేపల్లి అది రెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, బోలురి నర్సింహా, నల్పరాజు రామలింగయ్య, తీర్పాటి వెంకటేశ్వర్లు, బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోండి

సిసిఐ చైర్మన్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ముంబయిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తాతో ప్రత్యేకంగా భేటి అయ్యారు. వారిద్ద రి మధ్య గంట పాటు సాగిన ఈ సమావేశంలో, ప్రస్తు త వాతావరణ పరిస్థితులు, ఎంఎస్‌పి సేకరణతో పా టు రైతులకు తక్షణ ఉపశమనం అందించాల్సిన అవసరాన్ని మంత్రి సిసిఐ చైర్మన్‌కు వివరించారు. తెలంగాణతో సహా దక్షిణ భారత రాష్ట్రాలలో అధిక తేమ స్థా యిలు ఉన్న కారణంగా, ప్రస్తుత నిబంధనల ప్రకారం నిర్దేశించిన 8–12 శాతం తేమ శాతాన్ని పాటించడం అసాధ్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, తుఫాను వల్ల పంటలు దెబ్బతిన్నాయి. అందుకే, రైతులకు నష్టం జరగకుండా ఉండేందు కు తేమ శాతాన్ని తక్షణమే 14 శాతం వరకు సడలించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న సాగు ఖ ర్చులకు అనుగుణంగా పత్తికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని సవరించాలని, అలాగే అన్ని పత్తి పండించే జిల్లాల్లో సిసిఐ కొనుగోలు కేంద్రాలను విస్తరించి , ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుండి రైతులను కాపాడాలని కోరారు. తెగులు నష్టం, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రత్యేక ఉపశమన ప్యాకేజీ అందించాలని కోరారు. గత సీజన్లలో సేకరించిన పత్తికి సంబంధించి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పత్తిరైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి,సానుకూలంగా పరిష్కరిస్తామని సిసిఐ చైర్మన్ లలిత్ కుమార్ గుప్తా..మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి హామీ ఇచ్చారు.





## మాజీ మంత్రి హరీశ్‌రావుకు పితృవియోగం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం మరణించారు. ఆయన అంత్యక్రియలు హైదరాబాద్, ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో పూర్తయ్యాయి. సత్యనారాయణ చితికి హరీశ్‌రావు నిప్పు అంటించారు. సత్యనారాయణ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. హరీష్ రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మృతి పట్ల రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు. కాగా అంతకుముందు హైదరాబాద్‌లోని సత్యనారాయణ భౌతికకాయానికి పలువురు నివాళ్లు అర్పించారు. బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. సత్యానారయణ భార్య లక్ష్మ మ్మకు కెసిఆర్ ధైర్యం చెప్పారు. ఆయన మృతి పట్ల కెసిఆర్ విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి,, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్ వెంకట స్వామి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావుతో పాటు బిఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు , ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, నాయకులు హరీశ్ రావు తండ్రి భౌతికకాయానికి నివాళ్లు అర్పించారు.

**సిపిఐ సంతాపం:** సత్యనారాయణ మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సంతాపాన్ని తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.


**PUBLIC NOTICE**

To whom so ever It May Concern: In respect of Registered Sale Deed Document No.4104/2025 dtd 11.09.2025 on the file of SRO Bheemgal.This Public Notice issued as per the instructions of my Client The DCB BANK in respect of the In respect of Registered Sale Deed Document 4104/2025 dtd 11.09.2025 on the file of SRO Bheemgal executed by Smt. Arepally Sunitha in favour of Smt. Dusa Divya in respect The RCC ROOFED house bearing G.P No: 2-50/1, admeasuring area place in area 1533.58 Sq.ft or 170.40 Sq. Yards bounded by: North: 12-0" Wide Road, South House of Nadukuda Rajender, East: Open place of Dusa Divya, West: Open Plot of Arepally Rajpal.This public notice is being issued to inform the general public and all concerned parties that my client intend to avail a loan facility from a private bank namely (DCB BANK) against the security of the aforementioned property. At Present the said Property is in the Possession of the Applicant/Present Owner Smt. Dusa Divya. If any-body is having claim, right, mortgage, charge over the said property, approach before me with the documentary evidence within 07 days, otherwise it can be presumed that the said property covered in the Sale Deed Document No. 4104/2025 document is genuine as there is link document No 2030/2019 and also as per the Gram panchayath records said house stands on vendor of my client i.e Arepally Sunitha and authorities issued the Gp ownership Certificate No G.P/03/2018-19 dtd: 10.05.2018. The Bank intends to make advance to the Present owner i.e Dusa Divya as the said property is free from all encumbrances in and charges.

Issued By:
**M.Shyam Babu,**
B.Sc., LLB.
Advocate,
H.No: 6-7-148,
Hamalwadi X Road,
Nizamabad.
Ph.No: 7386580285

**Date: 28.10.2025**
**Place: Nizamabad**


## రాజకీయ ఉద్దేశంతోనే ఇసి నిర్ణయాలు

సిపిఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్ విమర్శ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత ఎన్నికల సంఘం (ఇసి) స్వతంత్రంగా వ్యవహరించాలని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ డిమాండ్ చేశారు. ఈనెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైన సిపిఐ (ఎం) అఖిల భారత స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాశ్‌కరత్ మాట్లాడుతూ ఇసి రాజకీయ ఉద్దేశంతో నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహించాలని ఇసి ప్రకటించిందన్నారు. రెండు నెలల క్రితం ఎస్ఐఆర్‌ను బీహార్‌లో నిర్వహించిందని గుర్తు చేశారు. లౌకిక, ప్రతిపక్ష పార్టీలన్నీ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశాయని చెప్పారు. బతికున్న ప్రజల ఓట్లను ఇసి తొలగించిందని విమర్శించారు. ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. అక్కడ స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయని చెప్పారు. ఈ సమయంలో ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తే ప్రజలు గందరగోళానికి గురవుతారని అన్నారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు ఆధార్ కార్డును కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఇసిని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రాజకీయ ఉద్దేశంతో ఇసి నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. గతంలో ఇసి నిర్ణయాలను అధికారంలో ఉన్న పార్టీ వ్యతిరేకించేదని గుర్తు చేశారు. ఇప్పుడు అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. ఇసి స్వతంత్రతను కోల్పోతున్నదని ప్రకాష్‌కరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందని, ఇంకా తుది తీర్పును వెల్లడిరచలేదని గుర్తు చేశారు. దేశంలో ఆర్‌ఎస్ఎస్, బిజెపిపై రాజకీయంగా, సైద్ధాంతికంగా పోరాటం చేయాలని ప్రకాశ్ కరత్ పార్టీ శ్రేణుల కు పిలుపునిచ్చారు. ఇందుకోసం వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేస్తామని చెప్పారు. ఆర్‌ఎస్ఎస్, బిజెపి హిందుత్వ ఎ జెండాను అమలు చేస్తున్నాయని విమర్శించారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలని ఏప్రిల్‌లో మధురైలో నిర్వహించిన సిపిఐ(ఎం) 24వ మహాసభలో లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడంతో పాటు రాజకీయంగా, సైద్ధాంతికంగా బలోపేతం కావాలన్నారు. సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ లౌకిక శక్తులన్నింటిని ఒకవే దిక మీదకు తేవడం తమ లక్ష్యమన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు వ్య తిరేకంగా జరిగే పోరాటాలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేస్తామన్నారు.

### ఫీజు బకాయిలను విడుదల చేయాలి : జాన్‌వెస్లీ

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు ఈనెల 30న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సిపిఐ(ఎం) మాజీ ఎంపి పి.కె. బిజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్ తదితరులు పాల్గన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
**పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ విభాగము**
జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్, కొత్తగూడెం.

NIT No. 194/2025-26, E- ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు తేది: 28.10.2025

ఈ దిగువ సంతకం దారుచే SERP పథకముల క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని (01) పనులు కొరకు గాను అంచనా విలువ రూ. 7.20 లక్షలు ఆన్‌లైన్‌లో రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి పిలవబడుతున్నవి.
ECV, EMD ఇతరవివరములు https://tender.telangana.gov.in నందు ది: 30.10.2025 నుండి లభించును. భవిష్యత్తులో ఏవైనా సవరణలు, నిబంధనలలో మార్పులు ఉన్నచో పై వెబ్‌సైట్ నుండి మాత్రమే ప్రచురించబడును.

Sd- DISTRICT PR ENGINEER, PIU KOTHAGUDEM
Sd/- Dy.Excecutive Engineer(T) PIU Division, Kothagudem

DIPR R.O. No. : 9824-PP/CL/ADVT/1/2025-26, Date: 28-10-2025

**శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం**
గ్రా॥ నవాబుపేట, మం॥ లింగాలఘణపురం, జి॥ జనగామ.

లేఖ నెం. 10/SKRSD/2025, ఈ-టెండర్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన తేది: 16.10.2025

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! జనగామ జిల్లా, లింగాలఘణపురం మండలం, నవాబుపేట నందు గల శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానమునకు చెందిన 2025 2026వ సంవత్సరమునకు చెందిన అంగడి హక్కు పొందు వేలం పాటను ఈ-టెండర్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగవేలం ప్రక్రియల ద్వారా తేది. 30-10-2025 గురువారం మ. 12:00 గం.లకు శ్రీయుత కలెక్టరు గారి కార్యాలయము, జనగామ నందు జరుపుటకు నిర్ణయించడమైనది. ఈ వేలంపాట నందు పాల్గొనదలచిన వారు తేది: 26-10-2025 నుండి 30-10-2025 ఉ.10:30 ని.ల వరకు ఆన్‌లైన్‌లో https://tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు టెండరు దాఖలు చేసుకోవలయును. సీల్డ్ టెండర్స్ కోరు వార్కి 26-10-2025 నుండి 29-10-2025 సాయంత్రం 5:00 గం.ల వరకు దేవస్థాన కార్యాలయము నందు టెండర్స్ షెడ్యూల్ ఫారం లభించును. సీల్డు టెండర్స్ 30-10-2025 మ.12:00 గం.లకు శ్రీయుత కలెక్టరు గారి కార్యాలయ ఆవరణ నందు గల మీటింగు హాలు నందు పెట్టబడిన టెండరు బాక్సు నందు రూ. 10,00,000/- ధరావత్తు డి. డి. జతపర్చి టెండరు వేయవలెను. బహిరంగ వేలం పాటలో పాల్గొనదలచినవారు తేది.26-10-2025 ఉ.10:00 గం.ల నుండి తేది 29-10-2025 రోజు సా. 5:00 గం.ల లోపు దేవస్థాన కార్యాలయము నందు రూ. 5,000/-లు చెల్లించి రశీదు పొందవలయును. రశీదు మరియు 10,00,000/- డిడితో తేది: 30-10-2025 గురువారం మ. 12:00గం.లకు శ్రీయుత కలెక్టరు గారి కార్యాలయము, జనగామకు హాజరు కావలయును.

ఈ-టెండర్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగవేలం షెడ్యూలు

| క్ర.నం. | ఈ-టెండరు వివరములు | ధరావత్తు సొమ్ము | షెడ్యూలు ఖరీదు | కాలపరిమితి |
|---|---|---|---|---|
| 1 | అంగడి వేలం | రూ. 10,00,000/- డి.డి. ద్వారా | 115,000/- డి.డి. ద్వారా | 22-11-2025 21-11-2026 1 సంవత్సరం మాత్రము |

శ్రీ బి.వి. సురేష్ బాబు, ఫౌండర్ ట్రస్టీ
ఇట్లు, అర్చక మరియు సిబ్బంది
బి.లక్ష్మీ ప్రసన్న, కార్యనిర్వహణాధికారి, సెల్: 8317600148

DIPR R.O. No. : 9869-PP/CL/ADVT/1/2025-26, Date: 28-10-2025

## రైతులకు ఇబ్బందులు రావొద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలం లోని బాలెంలలో ఎన్‌డిసిఎమ్ఎస్ ఆధ్వర్యంలో ఉప్పుల సందీప్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటను, దళారులను నమ్మి అమ్మవద్దని కోరారు. ధాన్యంలో తేమ శాతం 17కి మించకుండా ఉండాలని, బాగా ఎండబెట్టి తాలు మట్టి లేకుండా ఉండే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోతి గోపాల్‌రెడ్డి, నాయకులు రామసాని రమేష్ నాయుడు, రామసాని శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.






**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** చండీగఢ్‌లో జరిగిన సిపిఐ జాతీయ మహాసభలో జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లా వెంకటరెడ్డి తొలిసారి నల్లగొండ సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి వచ్చిన సందర్భంగా జిల్లా సమితి ఆధ్వర్యంలో పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.




## ప్రజలకు సుపరిపాలన అందించాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు సుపరిపాలన అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహిం చిన విజిలెన్స్ అవగాహన వారోత్సవంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సరైన రీతిలో ప్రజలకు చేరేవిధంగా అధికారులు పారదర్శకతతో, బాధ్యతగా విధులు నిర్వహించి నియమ నిబంధనలు పాటిస్తూ అర్హులైన వారిని మాత్రమే గుర్తించాలని సూచించారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ క్షేత్రస్థాయిలో అధికారులు విధి నిర్వహణలో ఏమైనా తప్పు చేసిన, లబ్ధిదారుల ఎంపికలో ఏమైనా అవకత వకలు జరిగిన లోతుగా విచారించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దని తెలిపారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. విజిలెన్స్ ఎన్ఫోరెన్స్‌మెంట్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 14432 గురించి ప్రజలకు తెలియ జేయాలని సూచించారు. తదుపరి విజిలెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించి అధికారు లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామా రావు, విజిలెన్స్ అధికారులు దశరథ, రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి గడపకు సిపిఐ వందేళ్ల చరిత్ర

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల చరిత్రను గడపగడపకు తీసుకెళ్లాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కోరారు. మంగళవా రం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో మడిపల్లి మనోజ్ అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో మొట్ట మొదటి రాజకీయ పార్టీ అన్నారు. పార్టీ లక్ష్యం పురాతన ఫ్యూడల్ సామా జిక వ్యవస్థను రూపుమాపి దాని స్థానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి నూతన సోషలిస్టు సామాజిక వ్యవస్థను నెలకొల్పటమే లక్ష్యమన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న జరుగుతుందని దానిని జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ, ధూళి పాల ధనుంజయ నాయుడులు మాట్లాడుతూ ఖమ్మం బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి మూడం ధనరాజు రెడ్డి, రైతు సంఘం నాయకులు వాసుదేవరావు, మఠంపల్లి మండల కార్యదర్శి పున్నయ్య, పడిగ పాటి సైదిరెడ్డి, చింతకాయల కనకయ్య పాల్గొన్నారు.

## రూ.20వేలు నష్టపరిహారం చెల్లించాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ప్రసాద్



**ప్రజాపక్షం / కోదాడ:** మండల పరిధి గ్రామా లలో గత వారం రోజు లుగా కురుస్తున్నవా నలు, గాలి ధూమారా లకు వరి పంట నేల రాలి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యాక్షులు బొల్ల ప్రసాద్ ప్రభుత్వని డిమాండ్ చేవారు. మంగళ వారం మండల వ్యవసాయాధికారి పాలెం రజనికి రైతు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించి మాట్లాడారు. మండల వ్యాప్తం సుమారు ఐదువేల ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని, నష్టపోయినరైతుకు రూ.20వేలు అందించాలన్నారు. లేని పక్షంలో తమ సంఘం తరపున ఆందోళనలు చేప ట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## సిసిఐ కేంద్రాలలో పత్తి కొనుగోలు చేయాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/చండూరు :** రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పత్తి పంటను సిసిఐ కేంద్రాలలో విక్రయించుటకు తక్షణమే సిసిఐ కేంద్రాలను ప్రారంభించి పత్తిని కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం చండూరు మండల అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు వెంకటేశ్వర్లు ,బండమీది వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం చండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు ఇప్పటికే పత్తి పంటను ప్రైవేట్ వ్యాపరస్తులకు అడ్డికి పావుసేరుకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతు చేతికి పత్తి పంటవచ్చి రెండు నెలలు అవుతున్న ఇప్పటి వరకు సిసిఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిం చకపోవడంతో దళారులకు పత్తిని తక్కువ ధరకు విక్రయించవలసి వస్తుం దని అన్నారు. సిసిఐ మద్దతు ధర 8100 ఉంటే మద్య దళారులకు 6వేల రూపాయలకు అమ్ముకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటల్ పత్తిని 8100కు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశా రు. లేనిచో రైతు సంఘం ఆధ్వరంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

## డాక్టర్ చెరుకు సుధాకర్‌పై గృహ హింస కేసు నమోదు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** గృహ హింస కేసులో నకిరేకల్ కు చెందిన ప్రముఖ వైద్యులు, చెరుకు సుధాకర్‌తో పాటు అతని భార్య చెరుకు లక్ష్మీ, కుమారుడు చెరుకు సుహాస్, మరో ఇద్దరుపై సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నకిరేకల్ కు చెందిన చెరుకు సుధాకర్ కుమారుడు డాక్టర్ చెరుకు సుహాస్ కు సూర్యాపేట పట్టణానికి చెందిన సింధూశ్రీతో 2012లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె కూడా ఉంది. అయితే ఇటీవల హాస్పటల్ లో పని చేసే మరో మహిళను గుట్టు చప్పుడు కాకుండా వివాహం చేసుకున్నట్టు తెలి సింది. ఈ విషయం భార్యకు తెలియడంతో సుహాస్‌ను నిలదీయగా నిర్ల క్ష్యంగా సమాధానం చెప్తూ ఆమెను బెదిరింపులకు గురి చేస్తున్నాడు. దీనితో ఆమె సూర్యాపేట టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో డాక్టర్ చెరుకు సుధా కర్, ఆయన భార్య లక్ష్మీ, కుమారుడు సుహాస్ తో పాటు మరో ఇద్దరి పై గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీ సులు తెలిపారు.

# ధాన్యం తడవకుండా చర్యలు

### ధాన్యం కుప్పల వైపు వర్షపు నీరు రాకుండా కాలువలు తీయాలి, టార్పలిన్లు కప్పాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచన



**ప్రజాపక్షం/నల్లగొండ(కట్టంగూరు) :** వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచిం చారు. ధాన్యం కుప్పల వైపు వర్షపు నీరు రాకుండా కాలువలు తీసి నీటిని మళ్లించాలని అన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టు కొని నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రా లకు తీసుకురావాలని చెప్పారు.మంగళ వారం ఆమె కట్టంగూరు మండలం, ఐటిపాముల, కట్టం గూరు, రెడ్డి కాలనీలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమశాతం సరిగా ఉంటే తాలు, తరుగు వంటివి లేకుండా ఉంటే తక్షణమే కొనుగోలు చేసి మిల్లు లకు పంపించాలని ఆదేశించారు. ఎక్కడైనా హమాలీల కొరత ఉంటే ఎక్కువ మందిని ఏర్పాటు చేసి వెంటనే ధాన్యం మిల్లులకు వెళ్లేలా చూడాలని ఆదేశించారు. మొంతా తుఫాన్ దృష్ట్యా రైతులు వర్షాలు తగ్గేవరకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డి సి ఓ పత్యా నయ్క్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫ రాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ ,నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, కొనుగోలు కేంద్రాల నిర్వహ కులు తదితరులు ఉన్నారు.

### విడతలవారీగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రైతులు విడతలవారీగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ పై సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఆకాల వర్షాలు సవాల్ గా మారాయని,ఒకేసారి రైతులు కొనుగోలు కేంద్రాలకు మిల్లులకు ధాన్యం తీసుకురావడం వల్ల ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని, అలా కాకుండా విడతల వారీగా ధాన్యాన్ని తీసుకు వచ్చినట్లయితే కొనుగోలు కేంద్రాలతో పాటు, మిల్లులలో ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయవచ్చని చెప్పారు. ప్రత్యేకించి సన్నధాన్యం కొనుగోలు విషయంలో తేమ, ఇతర అంశాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ విషయంపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌సి శరత్‌చంద్ర పవర్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఏసిపి మౌనిక, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి ,ఆర్‌డిఓలు రమణారెడ్డి ,శ్రీదేవి, డిఎస్‌పి శివరాం రెడ్డి ,రాజశేఖర్ శర్మ, డిసిఓ పత్యా నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్,రైస్ మిల్లర్ల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, భద్రాద్రి హాజరయ్యారు.



## అధికారి, అధ్యక్షుడు కలిసి సొసైటీ సొత్తు స్వాహా

### రైతు ఉత్పత్తిదారుల ఆందోళన

**ప్రజాపక్షం/మోతె :** రైతు ఉత్పత్తిదారుల సొసైటీ ఆఫీస్ వద్ద రైతులు, సొసైటీ సభ్యులు ఆందోళన నిర్వహించిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వారు తెలిపిన వివరాల ప్రకారం గడిచిన రెండు సంవత్సరాల క్రితం పది మంది ఆఫీసుబేరర్లను ఎన్నుకొని అధ్యక్షు లుగా బోళ్ళ మధుసూదన్ రెడ్డి పనిచేస్తుండగా పది మందితో ఏర్పడ్డ కమిటికి ఒక్కొక్కరికి రూ.4వేలు కట్టి సుమారు రూ.40వేలతో రిజిష్టర్ చేసుకోవడం జరిగిందన్నారు. జాయింట్ అకౌంట్ ద్వారా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా డి రాములు పవర్‌తో బ్యాంక్ అకౌంట్‌లో సుమారు రూ.3 లక్షల 50వేలు జమ అయినాయని చెప్పారు. అట్టి డబ్బులకు లెక్కలు చెప్ప కుండా సుమారుగా నేటి వరకు రూ. 9 లక్షల 50 వేల రూపాయలు యఫ్ ఏఓ శ్రీనివాస్ రావు, సిఇఓ సతీష్‌లు అధ్యక్షులు బొక్క ఉపేందర్ రెడ్డిలు సొసైటీ సొత్తు స్వాహా చేస్తున్నారని ఆరోపిస్తూ నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఇది ఏమని అడిగితే వాస్తవాలను దాచిపెట్టి ప్రశ్నించిన డైరెక్టర్లను బెదిరించి పోలీసులతో కేసులు నమోదు చేయిస్తున్నారని రైతులు మండిపడ్డారు. అడ్డగో లుగా సొసైటీ సొమ్మును కాజేస్తున్న అధ్యక్షునిపై అధికారులపై చర్యలు తీసు కోవాలని రైతులు సొసైటీ డైరెక్టర్లు వేడుకున్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం

### నవ చేతన సంచార పుస్తకాలయం ప్రారంభించిన సిపి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని యాదగిరిగుట్ట అసిస్టెంట్ కమిషనర్ పోలీస్ (ఏసి పి)శ్రీనివాస్ నాయుడు అన్నారు. మంగళవారం యాదగిరిగుట్టలో నవ చేతన సంచార పుస్తకాలయంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక, సామాజిక, శాస్త్రీయ అంశాలు పిల్లలకు, కుటుంబా నికి సంబంధించిన అనేక పుస్తకాలు సమాజంలోకి తీసుకురావడంలో భాగంగా నవ చేతన విజ్ఞాన కేంద్రం చేస్తున్న కృషి అభినందనీయం అన్నా రు. సంచార పుస్తకాలయం ను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థు లకు అనేక పుస్తకాలు ముఖ్యంగా ఉద్యోగాలకు సంబంధించిన కాంపిటేటివ్ పుస్తకాలు కూడా ఇందులో అందుబాటులో ఉంచారన్నారు. ఇలాంటి పుస్త కాలను ప్రజలందరూ కుటుంబ సమేతంగా సందర్శించి మంచి పుస్తకాలను కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ భాస్కర్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గోద శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, సిపిఐ మున్సి పల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, నాయకులు పేరబోయిన పెంటయ్య, పేరబో యిన బంగారి మాటూరి మల్లయ్య,అరె పుష్ప, గోపగాని రాజు, కోకల రవి, మునుకుంట్ల నరసమ్మ, గుండు వెంకటేష్ అనంతుల నరసింహ, వెంకటేష్, రాములు, సత్తిబాబు, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విధులకు హాజరు కాని వారిపై చర్యలు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరిక

### ఆయుర్వేదిక్ డాక్టర్ సయ్యద్ నుస్రత్ సస్పెన్షన్

### డాక్టర్ రజిని కుమారి,డాక్టర్ వీరన్నకు షోకాజ్ నోటీసులు జారీ

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు వైద్యాధి కారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, అనధికారికంగా విధులకు హాజరు కాని వారిపై కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలె క్టర్ హనుమంతరావు హెచ్చరించారు. మంగళవారం రామన్నపేట ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. మంగళవారం ఎంత మంది సిబ్బంది విధులకు హాజరు అయ్యారని రిజిస్ట ర్‌ను పరిశీలించారు. అనధికారికం గైర్హాజరైన ఆయుర్వేద డాక్టర్ సయ్యద్ నుస్రత్‌ను కలెక్టర్ సస్పెండ్ చేస్తూ, డాక్టర్ రజిని కుమారి, డాక్టర్ వీరన్నలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనధికారికంగా విధులకు హాజరు కాని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వార్డులను కలియ తిరిగారు. వార్డులలో పరిశుభ్రంగా లేనందున శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. వైద్యులు అందరూ రోజు విధు లకు హాజరు కావాలని నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చ రించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడారు.



వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు మంచిగా వైద్యం అందిస్తున్నారా, సిబ్బంది ఏమైనా ఇబ్బంది పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో వర్షం నీరు నిలువ ఉండ డంతో నీరు బయటకు వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఆదే శించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్షేత్ర సందర్శనకు వెళ్ళిన రైతులు



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** ఆయిల్ పామ్ తోటల సాగులో మెలుకువలు తెలుసుకునేందుకు తుంగ తుర్తి, సూర్యాపేట డివిజన్ పరిధిలోని వివిధ మండలా లకు చెందిన పలువురు రైతులు మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా సత్తుపల్లి, దమ్ముపేట మండలాలకు క్షేత్ర సందర్శనకు వెళ్ళారు. ఇట్టి కార్యక్రమంను సూర్యాపేట డివిజన్ ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి కె స్వాతి జెండా ఊపి ప్రారంభించారు. తుంగతుర్తి, సూర్యాపేట డివిజన్ పరిధిలోని మండ లాల్లో ఆయిల్ పామ్ తోట సాగు చేయాలనుకునే రైతులు క్షేత్ర సందర్శనలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి చర్చించారు. పంటసాగులో ఉండే కష్టన ష్టాలు, పంట దిగుబడి, పంటను అమ్ముకునే విధానాన్ని నేరుగా వారి నుండి తెలుసు కున్నారు. ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటలుగా చేస్తున్న కోకో, వక్క, తమలపాకు, జాజికాయ, జాపత్రి, మిర్యాల వంటి నూతన పంటలను రైతులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యానవన అధికారిని స్వాతి, పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ శశికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, విస్తరణ అధికారులు ముత్యం రాజు, కె రాము, అనిల్, క్షేత్ర సహాయకులు భద్రాచలం, నాగరాజు, రమేష్, కరుణా కర్, సందీప్, లింగయ్య, అశోక్, రైతులు పాల్గొన్నారు.

## ఎంజాయి పేరుతో గంజాయి వద్దే వద్దు

### తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా

### యువతను చైతన్యం చేస్తున్న తెలంగాణ ప్రజా నాట్యమండలి




**ప్రజాపక్షం/దేవరకొండ:** డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈనెల 27 నుండి నవంబర్ 02 వరకు బస్సు కళా జాత మంగళవారం దేవరకొండ పట్టణానికి చేరింది. పట్టణంలోని బస్టాండ్ లో ప్రజ లను, యువతను చైతన్యం చేసేందుకు పాటలు, ప్రదర్శనలు, కళారూపాలతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక సలహామం డలి సభ్యులు, తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా నేతృత్వంలో 30 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ కళా జాత వివిధ విశ్వవిద్యాలయాలు, డిగ్రి, జూనియర్ కళాశాలను సంద ర్శించి తమ సాంస్కృతిక కళారూపాల ద్వారా విద్యార్థులకు గంజా యి, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగనుందని నర్సింహా తెలిపారు. ఈబస్సు జాత ఎంపిక చేసిన జిల్లాలలో, మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగా హన కల్పించనుందని ఈ బస్సు కళాజాతను నవంబర్ 02వ తేదిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాలలో సాయంత్రం 5 గంట లకు ముగియనుందని తెలిసి తెలియక కొంత మంది విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి అలవాటుపడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న నేపథ్యంలో కళాజాతను చేపట్టామని పల్లె నర్సింహా వివ రించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ సిఐ వెంకట్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, కళాజాత బృందం, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

# వేగవంతమైన సేవలు అందించినప్పడే ప్రజల్లో నమ్మకం

### జిల్లా ఎస్‌పి కె నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** వేగవంతమైన సేవలు అందించినప్పుడే పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరుగు తుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. మంగళ వారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికా రుల నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించి గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను సమీక్షించారు. అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి సూచ నలు, సలహాలు అందించారు. నేర నిరూపణలో సిబ్బంది సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలి అన్నారు. ఫిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేరుకోవాలని సూచించారు. రాత్రిళ్ళు పెట్రో లింగ్ పటిష్టంగా ఉండాలి, కేసులు పెండింగ్‌లో లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలన్నారు. నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా సంబంధ కేసుల్లో వేగంగా దర్యాప్తు చేసి కోర్టులతో సమన్వయంగా పనిచేయాలని తెలిపారు. ప్రజలను, శాంతిభద్రతలకు ఇబ్బందులు కలిగించే వారిపై ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలపై అవ గాహన కల్పించి రోడ్డు ప్రమాదాల ద్వార ఒక్క ప్రాణం కూడా పోకుండా సిబ్బంది పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ పని విభాగాన్ని సమర్థ వంతంగా నిర్వహిస్తూ గత నెలలో కేసుల ధర్యాప్తు, ఇన్విస్టిగేషన్‌లో బాగా పనిచేసిన కోదాడ పట్ట ణ ఇన్స్పె క్టర్ శివశంకర్, సూర్యాపేట టూ టౌన్ ఎస్ఐ శివతేజ, అనంతగిరి ఎస్ఐ నవీన్ కుమార్‌లను జిల్లా ఎస్‌పి అభి నందించి, వారికి రివార్డులను అందజేశారు.




**పోలీసు వాహనాలను తనిఖీ చేసిన ఎస్‌పి**

బాధితులకు వేగవంతంగా పోలీసు సేవలు అందించ డంలో పోలీసు వాహనాలు కీలకమని ఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలు పూర్తి కండీషన్‌లో ఉండాలని, వాటిని ఎక్కువ కాలం ఉపయోగించే విధంగా ఎప్పటికప్పుడు నాణ్యత పరిశీ లించుకోవడంతోపాటు సర్వీ సింగ్ చేయించాలని డ్రైవర్లకు సూచించారు. పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని పోలీస్ మోటర్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిని ఎస్‌పి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అడ్మిన్ అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఇన్‌స్పెక్టర్లు శివశం కర్, ప్రతాప్‌లింగం, రామకృష్ణారెడ్డి, చరమందరాజు, నాగేశ్వరరావు, నరసింహారావు, రాజశేఖర్, వెంక టయ్య, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ, ఎస్ ఐలు, ఐటి కోర్ సిబ్బంది, డిసిఆర్‌బి సిబ్బంది ఉన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

### ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కన్వీనర్ గిరి రామ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తిరుమలగిరి సాగర్ మండలం ఎల్లాపురం తండాకు చెందిన కుర్రబాబు పా ర్వతిల దంపతులు జీవనోపాధి కోసం నల్లగొండలో కూలీ పనులు చేస్తూ ఉంటూ, తమ చిన్న కుమార్తెను దళారీల ద్వారా అమ్మినట్టు వెలుగులోకి వచ్చిన దారుణ సంఘటనపై జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కన్వీనర్ గిరి రామ ఆందోళన వ్యక్తం చేశారు. దళారులు గిరిజన తండాలను లక్ష్యంగా చేసుకొని ఆడపిల్లల వివక్ష,పేదరికం,అవగా హన లోపం,నిరక్షరాస్యత, ఆర్థికభారాలను ఆసరాగా చేసుకొని ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి అని పెర్కోన్నారు.మహిళల రక్షణ, ఆడపిల్లల భద్రత పట్ల సమాజం, ప్రభుత్వం, చట్ట అమలు సంస్థలు అప్రమ త్తంగా వ్యవహరించవలసిన అవసరం ఉందన్నారు. ఈ ఘటనపై తక్షణం సమగ్ర విచారణ జరిపి, దళారీలతో పాటు దీనికి కారణమైన వారిని గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామీణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## సిద్ధరామయ్య సిఎం పదవీకాలానికి.. కాలపరిమితిలేదు

**బెంగళూరు:** కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీ నేతల్లో పోటీ నానాటికీ తీవ్రతరం అవుతోంది.ఈ నేపథ్యంలో కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర ఈ విషయమై స్పందించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి కావడానికి సిద్ధరామయ్య కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడిగా (సిఎల్‌పి) ఎన్నికైనప్పుడు , ఆయన పదవీకాలానికి ఎటువంటి కాలపరిమితిని నిర్దేశించలేదని హోం మంత్రి జి.పరమేశ్వర స్పష్టం చేశారు.అయితే పార్టీ అధిష్ఠానం ఏది నిర్ణయించినా దానికి పార్టీలోని ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉంటారని, ఈ అంశంపై ఉన్న గందరగోళానికి ముగింపు పలకాలని ఆయన కాంగ్రెస్ నాయకులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే నెలలో తన ఐదేళ్ల పదవీకాలంలో సగం పూర్తి చేసుకున్నప్పుడు ముఖ్యమంత్రి పదవిలో ఈ నేపథ్యంలో కొందరు దీనిని 'నవంబరు విప్లవం' అని వ్యాఖ్యానిస్తున్నారు. సోవారం నాడు ఇక్కడ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్.సి. మహదేవప్పను ఆయన నివాసంలో అధికార కాంగ్రెస్ పార్టీలో ఇద్దరు కూడా పేరొందిన దళిత నాయకులే.

## బిహార్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయ్

**ఎన్‌డిఎ ప్రభుత్వానికి కనీస ఆందోళన లేదు**

**ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ విమర్శ**



**సరాన్ :** బిహార్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. ఈ పరిస్థితిపై రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి కనీస ఆందోళన కూడా లేదని ఆరోపించారు. మంగళవారం ఆయన సరన్‌లో ఎన్నికల ర్యాలీలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజలను మనోవేదనల నుంచి బయటపడేసేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమికి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సరన్ ప్రతిరోజూ హత్య, దోపిడీ, అపహరణ వంటి ఘటనలను చూస్తోందని కానీ, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ దాని గురించి కనీసం పట్టించుకోని, బాధితులను ఓదార్చడానికి ఆయన ఎప్పుడూ రారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలు, ఉద్యోగాలు, ఫిర్యాదుల పరిష్కారాన్ని మెరుగుపరచడానికి ఇండియా కూటమికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారు. సరన్‌లోని తరైయా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో యాదవ్ మాట్లాడుతూ బిహార్ ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదలతో విసిగిపోయారని, వారు 'పఢై, దవై, కమై, సిచాయ్' (మెరుగైన విద్య, ఆరోగ్య సౌకర్యాలు, ఉపాధి, నీటిపారుదల సౌకర్యాలు)ను నిర్ధారించే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. పార్సా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన మరో ర్యాలీలో మాట్లాడుతూ బిహార్‌లో ప్రొహిబిషన్ విధానాన్ని తేజస్వీ వ్యతిరేకించారు. బిహార్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ చట్టం బిహార్‌లో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో మద్యం ఇంటికే డెలివరీ చేసే వ్యవస్థ ఉందని, ప్రజలు దానిని సులభంగా పొందుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే, 'కల్లు' (తారి)పై నిషేధాన్ని తొలగిస్తామన్నారు. ఎన్‌డిఎ 20 సంవత్సరాలలో అమలు చేయలేని అభివృద్ధి పనులను, ఇండియా కూటమి అధికారంలోకి వస్తే 20 నెలల్లో చేపడుతుందని యాదవ్ కూడా నొక్కి చెప్పారు. దీనికి తమకు 20 నెలలు మాత్రమే కావాలన్నారు.

## ప్రజాస్వామ్యవాదులు ఏకం కండి

**యావత్ దేశం ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించాలి**

**ఇది దేశ ప్రజాస్వామ్య పునాదికి తీవ్ర ముప్పు**

**కేరళ సిఎం పినరయ్ విజయన్ ఉద్ఘాటన**





**తిరువనంతపురం :** భారత ఎన్నికల నవంబరు 4వ తేదీ నుంచి నిర్వహించనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను యావత్ దేశం వ్యతిరేకించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పిలుపునిచ్చారు. ఇది దేశ ప్రజాస్వామ్య పునాదికి తీవ్ర ముప్పుగా ఆయన అభివర్ణించారు. ఈ క్రమంలో ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వారందరూ ఏకం కావాలని సూచించారు. ఇసిఐ ఇప్పుడు బహుళ రాష్ట్రాలకు విస్తరింపజేస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ సార్వత్రిక ఓటు హక్కును అణగదొక్కడానికి, రాజకీయ లాభం కోసం ఓటర్ల జాబితాలను తారుమారు చేయడానికి స్పష్టమైన ప్రయత్నాన్ని సూచిస్తుందని ఆయన హెచ్చరించారు. కేరళ, ఇతర రాష్ట్రాలలో ఎస్ఆర్‌ను అమలు చేయడానికి ఇసిఐ తీసుకున్న చర్య ప్రజాస్వామ్య ప్రక్రియకు తీవ్రమైన సవాల్‌ను విసురుతుందని విజయన్ ఒక ప్రకటనలో ఉద్ఘాటించారు. ఇది పోల్ ప్యానెల్ ఉద్దేశాలపై లోతైన సందేహాలను లేవనెత్తిందని, దేశ ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని ఆయన అన్నారు. కేంద్ర అధికారులు ఓటర్ల జాబితాను తమ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చుకోవడానికి ఎస్ఆర్‌ను ఒక మార్గంగా ఉపయోగిస్తున్నారనే విమర్శను ఏ విధంగానూ తిరస్కరించలేమనిని, ఇది మరింత సందర్భోచితంగా ఉందని విజయన్ అన్నారు. బిహార్ ఎస్ఐఆర్ రాజ్యాంగ చెల్లుబాటు అంశం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నప్పటికీ, అదే ప్రక్రియను ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనే చర్యను నిర్దోషిగా లేదా నిష్పాక్షికంగా చూడలేమన్నారు. దీర్ఘకాలిక, విస్తృతమైన సంప్రదింపులు అవసరమయ్యే ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను త్వరితగతిన నిర్వహించడం ప్రజల ఆదేశాన్ని దెబ్బతీసే ప్రయత్నాన్ని స్పష్టంగా సూచిస్తుందని విజయన్ పేర్కొన్నారు. ప్రస్తుత జాబితాలకు బదులుగా 2002 నుండి 2004 వరకు ఓటర్ల జాబితాల ఆధారంగా సవరణను రూపొందించాలనే కమిషన్ నివేదిక ప్రణాళిక ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950, ఓటర్ల నమోదు నియమాలు, 1960ని నేరుగా ఉల్లంఘించడమేనని ముఖ్యమంత్రి ఎత్తి చూపారు. కేరళ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నందున, ఇప్పుడు ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను నిర్వహించడం అసాధ్యమని కేరళ ప్రధాన ఎన్నికల అధికారి కమిషన్ ఇప్పటికే తెలియజేశారని విజయన్ కూడా గుర్తించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిన రాష్ట్రాల్లో కేరళ తొలిస్థానంలో ఉంది. ఎస్ఐఆర్ వల్ల బిహార్‌లో ఏం జరిగిందో అందరికీ తెలుసునని, 65 లక్షల మంది పేర్లు ఓటర్లను జాబితా నుండి తొలగించారన్నారు. ప్రక్రియను వేరే చోట పునరావృతం చేయాలనే చర్య 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 పూర్తి ఉల్లంఘన' అని పేర్కొన్నారు. 'ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కును తీసివేయలేము లేదా రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చలేము' అని ఆయన అన్నారు. ఎస్ఐఆర్ 'జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి) బ్యాక్‌డోర్ అమలు'గా మారవచ్చని హెచ్చరించారు. కేరళతో సహా వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను నిర్వహించాలనే ఇసిఐ నిర్ణయం మన ప్రజాస్వామ్య ప్రక్రియకు అవమానం అని విజయన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. పాత జాబితాల ఆధారంగా చేసుకుని స్థానిక ఎన్నికలకు ముందు తొందరపడి చేపట్టం తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతుందని, ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే ఈ ప్రయత్నాన్ని కేరళ గట్టిగా వ్యతిరేకిస్తుందనాన్రు. దానిని రక్షించడానికి ఐక్య ప్రతిఘటనకు పిలుపునిస్తుందన్నారు.

## బిహార్‌లో యువత ఆకాంక్షలు అణచివేత

**'మోదీ-నితీశ్' ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ ధ్వజం**



**న్యూఢిల్లీ :** బిహార్‌లో 'మోదీ-నితీశ్' ప్రభుత్వమే లక్ష్యంగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఈ ప్రభుత్వం బిహార్ యువత ఆకాంక్షలను అణచివేసిందని, రాష్ట్రాన్ని గాలికి వదిలేసి ప్రతి అభివృద్ధిలోనూ అగాధంలోకి నెట్టివేసిందని ఆయన ధ్వజమెత్తారు. మార్పు కోసం, న్యాయం కోసం మహాఘట్‌బంధన్ సంకల్పాన్ని పునరుద్ఘాటించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో రాహుల్‌గాంధీ పేర్కొంటూ ఇటీవల బిహార్ యువతతో తన సంభాషణ వీడియోను షేర్ చేశారు. 'కొన్ని రోజుల క్రితం విద్య, ఆరోగ్యం, ఉపాధి ప్రతి అంశంపై బిహార్ యువతతో చాలా ఆసక్తికరమైన సంభాషణ చేశానన్నారు. ఈ అన్ని అంశాలలో ఈ దయనీయ రాష్ట్రానికి ఒకే ఒక దోషిగా బిజెపి-జెడియు ప్రభుత్వం అని తేలిందని అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు తన పోస్ట్‌లో హిందీలో పేర్కొన్నారు. 'గత 20 సంవత్సరాలుగా, ఈ మోదీ-నితీష్ ప్రభుత్వం యువత ఆకాంక్షలను అణచివేసి, విద్యా రంగంలో 9 నుండి 10 తరగతులలో డ్రాపౌట్ రేటు పరంగా బిహార్ 29 రాష్ట్రాలలో 27వ స్థానంలో ఉందని; 11, 12 తరగతులలో నమోదు రేటులో 29 రాష్ట్రాలలో 28వ స్థానంలో ఉందని; మహిళా అక్షరాస్యతలో 28వ స్థానంలో ఉందని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఉద్యోగ రంగంలో, సేవా రంగంలో ఉపాధి పరంగా బిహార్ 21వ స్థానంలో ఉండగా, పరిశ్రమ/తయారీ రంగంలో 23వ స్థానంలో ఉందన్నారు. శిశు మరణాల రేటు పరంగా, భీమా పథకాల ద్వారా ఆరోగ్య కవరేజీలో 27వ స్థానంలో ఉందని; గృహాలలో మరుగుదొడ్ల అందుబాటులో ఉండటంలో 29వ స్థానంలో ఉందని మాజీ కాంగ్రెస్ చీఫ్ కూడా చెప్పారు. మానవ అభివృద్ధి రంగంలో, మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ) పరంగా బిహార్ 27వ స్థానంలో ఉందని, తలసరి ఆదాయం పరంగా 25వ స్థానంలో ఉందని ఆయన ఎత్తి చూపారు. నేను కలిసిన బిహారీ యువకులందరూ చాలా ప్రతిభావంతులు, తెలివైనవారు. వారి సామర్థ్యాలు , కృషితో, వారు ఎక్కడైనా ప్రకాశించగలరు, కానీ ప్రభుత్వం వారికి అవకాశాలకు బదులుగా నిరుద్యోగం, నిరాశను ఇచ్చింది. ఇప్పుడు మార్పు కోసం సమయం, బిహార్ గర్వాన్ని తిరిగి రగిలించాలి.

## ప్రశాంత్‌కిషోర్‌కు రెండు రాష్ట్రాల్లో ఓటు

**మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని**

**ఎన్నికల అధికారి లేఖ**



**పాట్నా :** ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్ బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు చిక్కుల్లో పడ్డారు. జన్ సురాజ్ పార్టీని స్థాపించి ఏ పొత్తూ లేకుండా ఒంటరిగా బరిలో నిలిచిన కిషోర్‌కు రెండు రాష్ట్రాల్లో ఓటు ఉందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. బిహార్‌లోని కర్గహర్ అసెంబ్లీ నియోజకవర్గంలో, పశ్చిమబెంగాల్‌లోని భవానీనగర్ అసెంబ్లీ స్థానంలో ఆయన ఓటరుగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కర్గహర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కిషోర్‌కు లేఖ రాశారు. ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో మీరు ఓటరుగా ఎందుకు పేరు నమోదు చేసుకున్నారో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ లేఖలో ఆదేశించారు. ఆయన నేరుగాగానీ, ఆయన తరపున ఎవరైనాగానీ హాజరై వివరణ ఇవ్వవచ్చని పేర్కొన్నారు. '2025 అక్టోబర్ 28న ప్రచురితమైన వార్త ప్రకారం.. మీ పేరు బిహార్, పశ్చిమబెంగాల్ రెండు రాష్ట్రాల్లో ఓటరుగా ఉన్నది. కాబట్టి మీరు తప్పనిసరిగా మీ తరఫున మూడు రోజుల్లో మా ముందు హాజరు కావాలి. ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఎందుకు ఓటరుగా పేరు నమోదు చేసుకున్నారో వివరణ ఇవ్వాలి' అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తన లేఖలో ఆదేశించారు.

## కృత్రిమ వర్షానికి ఢిల్లీ సిద్ధం

**క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ పూర్తి**



**న్యూఢిల్లీ :** కాలుష్య భూతంతో ఢిల్లీ యుద్ధం చేస్తోంది. శీతాకాల ప్రభావంతో పాటు బాణాసంచా కారణంగా తీవ్రమవుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు కృత్రిమ వర్షం కురిపించేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది. ఢిల్లీ ప్రభుత్వం, ఐఐటి కాన్పూర్ సహకారంతో మంగళవారం ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్‌సీడింగ్ ట్రయల్స్ నిర్వహించిందని, రానున్న కొద్ది రోజుల్లో ఇలాంటి మరిన్ని ప్రక్రియలు చేపట్టాలని ప్రణాళికలు వేస్తున్నట్లు పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా తెలిపారు. అయితే, పర్యావరణవేత్తలు ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన క్లౌడ్‌సీడింగ్ ట్రయల్‌ను స్వల్పకాలిక చర్యగా అభివర్ణించారు. ఇది తాత్కాలికంగా కాలుష్యాన్ని తగ్గించవచ్చు కానీ రాజధానిలో క్షీణిస్తున్న గాలి నాణ్యతకు మూల కారణాలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. కాగా, విమానం కాన్పూర్ నుండి ఢిల్లీకి బయలుదేరి, మీరట్ ఎయిర్‌ఫీల్డ్ ల్యాండ్ అయ్యే ముందు బురారి, ఉత్తర కరోల్ బాగ్, మయూర్ విహార్ వంటి ప్రాంతాలను కవర్ చేసింది. 'సెస్నా విమానం కాన్పూర్ నుండి బయలుదేరింది. ఇది 2 నుండి 2.5 కిలోగ్రాముల బరువున్న ఎనిమిది అగ్ని జ్వాలలను విడుదల చేసింది. ట్రయల్ అర గంట పాటు కొనసాగింది. ప్రతి అగ్ని జ్వాల రెండు నుండి రెండున్నర నిమిషాల పాటు కొనసాగింది. మేఘాలు 15 నుండి 20 శాతం తేమను కలిగి ఉన్నాయి. 17 నుండి 18 నిమిషాల వరకు మంటలు విడుదలయ్యాయి' అని సిర్సా ఒక వీడియో ప్రకటనలో తెలిపారు. ట్రయల్ తర్వాత 15 నిమిషాల నుండి 4 గంటలలోపు వర్షం పడే అవకాశం ఉందని ఐఐటి కాన్పూర్ అభిప్రాయపడిందని ఆయన అన్నారు. అయితే, తేమ స్థాయిలు 15 నుండి 20 శాతం మాత్రమే ఉన్నందున వర్షపాతం భారీగా ఉండదని మంత్రి చెప్పారు. రెండవ ట్రయల్ కూడా ఆలస్యంగా ఢిల్లీ వెలుపల నిర్వహించారు. కొద్ది రోజుల్లో తొమ్మిది నుండి 10 ట్రయల్స్‌కు ప్లాన్ చేస్తామని, గాలి దిశ ఉత్తరం వైపు ఉందని ఐఎండి తెలియజేసినందున, ఆ ప్రాంతంలోని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటున్నామని సిర్సా చెప్పారు. ఐఐటి కాన్పూర్ ఢిల్లీ మీదుగా ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు వర్గాలు తెలిపాయి. మొదటి రౌండ్‌లో భూమి మట్టానికి దాదాపు 4,000 అడుగుల ఎత్తులో ఆరు ఫ్లేర్‌లను విడుదల చేశారు, దీని కాల వ్యవధి పద్దెనిమిదిన్నర నిమిషాలు. రెండవ విమానం మధ్యాహ్నం 3:55 గంటలకు బయలుదేరగా, ఎనిమిది ఫ్లేర్‌లను దాదాపు 5,000–6,000 అడుగుల ఎత్తులో మోహరించింది.

## సముద్ర భద్రతను ఇకపై ఇరుకైన పట్టకం ద్వారా చూడలేం

**న్యూఢిల్లీ :** ద్రవ అమరికలు, సంలీన సవాళ్లతో కూడిన ఈ అల్లకల్లోల యుగంలో ముప్పు నియంత్రణ యొక్క ఇరుకైన పట్టకం (ప్రిజమ్) ద్వారా సముద్ర భద్రతను ఇక చూడలేమని భారత నావికాదళ ప్రధాన అధికారి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి అన్నారు. సోమవారం నాడు ఇక్కడ జరిగిన ఇండోపసిఫిక్ రీజనల్ డైలాగ్2025 సదస్సులో నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి ప్రసంగించారు. ప్రొఫెసర్ రిక్‌మాన్ 'డైనాక్లిక్ చాలెంజ్' అని పిలిచేదానిని డైనమిక్ సవాల్‌గా, సంక్లిష్ట సవాల్‌గా రెండు విధాలుగా అర్థం చేసుకోవాలని నేవీ చీఫ్ చెప్పారు. అక్టోబరు 28 నుండి 30వరకు మూడు రోజులపాటు మానెక్‌షా సెంటర్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు నావికాదళం ఆతిథ్యం ఇస్తోంది. వివిధ దేశాల నుండి అనేకమంది నావికాదళ అధికారులు, నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. 'శతాబ్దాలుగా సముద్రాలు మానవాళికి అత్యంత పురాతనమైన రహదారులుగా ఉన్నాయి. వాణిజ్యం మరియు సంస్కృతినే కాకుండా ఉత్సుకత, ధైర్యాన్ని కూడా కలిగి ఉన్నాయి అని' అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి వివరించారు. దేశాల అదృష్టాన్ని రూపొందించడం మొదలు భవిష్యత్తు మానవాళిని రూపొందించడం వరకూ సముద్రాలు ఎల్లవేళలా 'మన ఉమ్మడి నిధి'కి నిజమైన కొలమానాలుగా ఉన్నాయని త్రిపాఠి చెప్పారు. ఫ్లూయిడ్ అలైన్‌మెంట్స్, ఫ్యూజ్డ్ సవాళ్లతో కూడిన ఈ అల్లకల్లోల యుగంలో, సముద్ర భద్రతను ఇకపై ముప్పు నియంత్రణ యొక్క ఇరుకైన పట్టకం ద్వారా చూడలేమని తెలియజేశారు. 'గురుగ్రామ్‌లో ఉన్న ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ ఇండియన్ ఓషన్ రీజియన్ ( ఐఎఫ్‌సిఐఓఆర్)లో 15 మంది అంతర్జాతీయ లైజన్ ఆఫీసర్లు (ఐఎల్ఒ)లు పనిచేస్తున్నారని 2028 నాటికి ఐఎఫ్‌సిఐఒఆర్ సామర్థ్యాన్ని 50 మంది ఐఎల్ఒలకు పెంచడమే మా లక్ష్యం' అని త్రిపాఠి వివరించారు.


**FORMAT C-1**

*(for candidate to publish in Newspapers, TV)*

**Declaration about criminal cases**

*(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India & Anr.)*

**Name and address of candidate : NAVEEN YADAV. V**
H.No.8-3-229/S/3/5, Rahmath Nagar,
Yousufguda Check post, Yousufguda,
Hyderabad – 500045.

**Name of Political Party : INDIAN NATIONAL CONGRESS**

**Name of Election : BYE ELECTION TO THE TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

**Name of Constituency : 61-JUBILEE HILLS**

I, **NAVEEN YADAV. V**, a candidate for the above-mentioned election, declare for public information the following details about my criminal antecedents:

**(A) Pending criminal cases**

| Sl. No. | Name of Court | Case No. and dated | Status Ofcase(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 575/2021 C.C No. 12608/2021 dt: 26-11-2021 | Examination of accused | U/S. 109, 505(2) & 506 of IPC. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation |
| 2 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 95/2021 CC No. 11727/2021 dt: 27-10-2021 | Examination of accused | U/S. 506 of IPC. Criminal Intimidation |
| 3 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 93/2021 C.C No. 10432/2021 dt: 01-09-2021 | Examination of accused | U/S. 420 & 506 of IPC Cheating and Criminal Intimidation |
| 4 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 55/2021 C.C No. 8134/2021 dt: 30-06-2021 | Examination of accused | U/S. 341, 506, 509 r/w 143 of IPC Wrongful Restraint, Criminal Intimidation |
| 5 | III ACMM, Nampally, Hyderabad | FIR No. 395/2006, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad dt: 01-11-2006 | Summons to accused | Under section. 406, 420 & 506 of IPC. Criminal Breach of Trust, Cheating & Criminal Intimidation |
| 6 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 340/2021, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad Dt: 2-7-2021 | Under investigation | Under Section. 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act. Trespass and deliberate disobedience of Order. |
| 7 | XIV ACMM, Nampally, Hyderabad | FIR No. 655/2025, Madhura Nagar Police Station, Hyderabad Dt: 06-10-2025 | Under investigation | 123(1), 123(2) Representation of People Act, 1951, 170,171,174 of BNS. Bribery, undue influence, or illegal inducements during elections |

**(B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description ofoffence(s) & punishment imposed | MaximumPunishment Imposed |
|---|---|---|---|
| 1 | NA | NA | NA |

**FORMAT – C1**
**(CHAPTER-3 PARA-3.5)**

**Declaration about Criminal Cases**

**(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India & Anr.)**

Name and address of candidate: **ANAND RAO JOLLU,**
**H.No.8-4-369, B23, FF4, Aditya Nagar, Hyderabad-500018.**

Name of political party : **INDEPENDENT**

*Name of Election : **Assembly BYE-Election 2025**

*Name of Constituency : **61-Jubilee Hills**

I **ANAND RAO JOLLU** (name of candidate), a candidate for the abovementioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

| Sl. No. | Name of Court | Case No. and dated | Status of Case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | **JMFC (Mobile), Sangareddy** | **CC No. 1873/20204 Dt: 07-12-2024** | **386, 447, 427, 504, 34 of IPC** | **Criminal Intimidation (extortion), unlawful trespass, property damage and provocation to breach peace.** |

(B) Details about cases of conviction for criminal offences

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| **N/A** | **Not Applicable** | **Not Applicable** | **Not Applicable** |

ప్రజాపక్షం
బుధవారం, 29 అక్టోబరు

## లెఫ్ట్‌కు ఎదురుదెబ్బలు

ప్రపంచ రాజకీయాల్లో మితవాదం ప్రాబల్యం వహిస్తున్న ఈ కాలంలో వామపక్షాలది ఎదురీతే. ఇది రాజకీయ యవనికపై భావజాల పోరాటం కూడాను. అమెరికా అధ్యక్షునిగా రిపబ్లికన్ డోనాల్డ్ ట్రంప్ రెండవసారి ఎన్నికకావటం ప్రపంచవ్యాప్తంగా మితవాదులకు పెద్ద ప్రోత్సాహకమైంది. అందుకు తగినట్లే అతడు 'మేక్ అమెరికా బిగ్ ఎగైన్' అంటూ మిత్రరాజ్యాలను సైతం సుంకాల పెంపుదలతో అదరగొడుతూనే, మరోవైపు తమ పక్కనే ఉన్న దక్షిణ (లాటిన్) అమెరికాలో వామపక్ష ప్రభావాన్ని అరికట్టేందుకు ఆర్థిక ఆకర్షణలను, సైనిక బెదిరింపులను ప్రయోగిస్తున్నారు. పర్యవసానంగా 2025వ సంవత్సరం వామపక్షాలకు ఎదురుదెబ్బలు, పరాజయాల సంవత్సరమవుతున్నది. అర్జెంటీనాలో ఆదివారం జరిగిన మధ్యంతర పార్లమెంటరీ ఎన్నికల్లో అధ్యక్షుడు జేవియర్ మిలీకి చెందిన పచ్చిమితవాద పార్టీ – ల లిబర్టాడ్ అవాంజా – పెద్ద విజయాలు సాధించటం తాజా ఎదురుదెబ్బ. 2023 అధ్యక్ష ఎన్నికల్లో మిలీ అధ్యక్షునిగా ఎన్నికైనప్పటికీ దిగువసభ, సెనేట్‌లలో వామపక్ష పెరోనిస్ట్‌పార్టీ పూర్తి మెజారిటీతో ఉంది. అయితే తాజా ఎన్నికల్లో అధ్యక్షుని పార్టీకి 40.84శాతం ఓట్లు, పెరోనిస్టులకు 31.67శాతం ఓట్లతో వామపక్షాలకు వ్యతిరేక ఫలితాలొచ్చాయి. దీంతో అధ్యక్షుని పార్టీ బలం దిగువసభలో 37 నుంచి 101కి, సెనేట్‌లో 6 నుంచి 20కి పెరుగుతుంది. ఆర్థిక వ్యవస్థను కాపాడే పేరుతో కఠినమైన పొదుపు చర్యలు, ప్రైవేటీకరణ ఎజండా అమలు జరుపుతున్న అధ్యక్షుడు మిలీకి పెద్ద ప్రోత్సాహం లభించింది. బ్యూనోస్ ఎయిర్స్ రాష్ట్రంలో గత నెలలో జరిగిన ఎన్నికల్లో వామపక్ష పెరోనిస్టులను ఎన్నుకున్న ఓటర్లు ఈ ఎన్నికల్లో మితవాద అభ్యర్థులను గెలిపించి వామపక్షాన్ని దిగ్భ్రాంతి పరిచారు. అర్జెంటీనా ఎన్నికల ఫలితాలు వాస్తవానికి అమెరికా ప్రభుత్వానికి, ప్రత్యేకించి ట్రంప్‌కు విజయం. ఎందుకంటే ట్రంప్ కరేబియన్‌పై పెద్దగా కేంద్రీకరించారు. వామపక్ష అధ్యక్షులున్న వెనిజులా, కొలంబియా రెండింటిపై కక్షగట్టి వేధింపుచర్యలు అమలు చేస్తున్నారు. నావికా దళాన్ని మోహరించి వెనిజులాను బెదిరిస్తున్నారు. ట్రంప్‌ను ఆరాధించే అర్జెంటీనా అధ్యక్షుడు, జేవియర్ మిలీకి ప్రజాభిమానాన్ని కూడగట్టేందుకై 40 బిలియన్ అమెరికన్ డాలర్ల సహాయం ప్రకటించటమేగాక, మిలీపార్టీని గెలిపిస్తేనే సహాయం కొనసాగుతుందని హెచ్చరిక చేశారు. పెరోనిస్టులకు వ్యతిరేక ఓటర్లను పెంచటానికి ఇది సహాయపడింది. పెరోనిస్టులు గెలిస్తే తమ ఆర్థిక స్థితిగతులు మరింత దెబ్బతింటాయని భావించినవారు పెద్దసంఖ్యలో మిలీ పార్టీకి ఓటు చేశారు.

2025లో ఇంతకుమునుపు జరిగిన ఈక్వెడార్ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్షం విజయం తథ్యమన్న అంచనాలు తలక్రిందులైనాయి. బొలీవియాలో అక్టోబర్ 19న జరిగిన ఎన్నికల్లో మధ్యేమార్గ – మితవాద అభ్యర్థి దేశాధ్యక్షునిగా ఎన్నికైనాడు – రెండు దశాబ్దాల వామపక్ష పాలన ముగిసింది. నవంబర్ 16న చిలీ అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. అవసరమైతే, డిసెంబర్ 14న రన్–ఆఫ్ పోలింగ్ జరుగుతుంది. వామపక్ష ఉమ్మడి అభ్యర్థిగా సీనియర్ కమ్యూనిస్టు పోటీ చేస్తున్నారు. హోండూరాస్‌లో ప్రస్తుతం వామపక్షవాది అధ్యక్షునిగా ఉన్నారు. నవంబర్ 30న ఎన్నికలు జరుగుతాయి. చిలీ, హోండూరాస్‌లలో ట్రంప్ ప్రభుత్వం మితవాదులకు పూర్తి సహాయం చేస్తోంది.

బలమైన వామపక్ష అధ్యక్షులున్న బ్రెజిల్, మెక్సికోల్లో సమస్యలు సృష్టించటానికి ట్రంప్ వాణిజ్య సుంకాలను ఉపయోగిస్తున్నారు. ఆ ఇరువురు అధ్యక్షులూ అమెరికా సవాళ్లను దృఢంగా ఎదుర్కొంటున్నారు.

అర్జెంటీనా లాటిన్ అమెరికాలో జనాభారీత్యా, బలమైన ఆర్థిక వ్యవస్థ రీత్యా ముఖ్యమైన దేశం. గత పెరోనిస్ట్ ప్రభుత్వం ఆర్థిక సంక్షోభకాలంలో పేద ప్రజల అనుకూల కార్యక్రమాలు చేబట్టింది, వేతనాలు పెంచింది. దాంతో ద్రవ్యోల్బణం 200 శాతం వరకు పెరిగింది. ఆర్థిక వ్యవస్థ ఒడిదొడుకుల్లో పడింది. మితవాదులు దాన్ని ఉపయోగించుకున్నారు. పార్లమెంటులో వామపక్షానికి ఇప్పటికీ మెజారిటీ ఉంది. ట్రేడ్ యూనియన్‌లు, యువజన సంఘాలు బలంగా ఉన్నాయి. ఎదురుదాడి చేయగల సామర్థ్యం వామపక్షానికి ఉంది. అయితే లాటిన్ అమెరికా వామపక్షాలు ప్రస్తుతం తమ దేశాల్లోని మితవాదులపైనేగాక, వారికి అండగా ఉన్న అధ్యక్షుడు ట్రంప్‌పై కూడా పోరాటం చేయాల్సి ఉంది.

ప్రజాస్వామిక వ్యవస్థల్లో పనిచేసేటప్పుడు వామపక్షాలకూ ఎదురుదెబ్బలు తప్పవు. మళ్లీ కూడదీసుకుని మితవాదులపై భావజాలం రీత్యా, విధానాల పరంగా పోరాడటం ద్వారానే పునరుద్ధానం సాధ్యం. ఆ విధంగా లాటిన్ అమెరికా వామపక్షాలు పుంజుకుని ఆదర్శవంతంగా, ఉత్తేజకారకంగా నిలుస్తాయనుటలో సందేహం లేదు.

## మళ్లీ పోరాటంలోకి

# కార్మికులు, రైతులు; ఎందుకు?

**డాక్టర్ గ్యాన్ పాథక్**

తమకు సంబంధించి కేంద్రప్రభుత్వం స్థూలంగా అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికులు, రైతులు మరోమారు పోరుబాట పట్టారు. ఆ విధానాలు తమపట్ల 'కక్షసాధింపు'గా 'అణచివేసేవి'గా ఉన్నాయని వారు భావిస్తున్నారు. 2025, నవంబర్ 26 పతాక ఘట్టానికి చేరే ఈ నెలరోజుల దేశవ్యాప్త ఆందోళన చేబట్టటానికి తక్షణ కారణాలు – కేంద్ర ప్రభుత్వం శ్రమశక్తి నీతి, 2025 పేరుతో విడుదలచేసిన జాతీయ కార్మిక మరియు ఉపాధి విధానం ముసాయిదా, విద్యుచ్ఛక్తి సవరణ బిల్లు, 2025, ముసాయిదా.

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ అక్టోబర్ 8, 2025 నాడు జాతీయ ఉపాధి విధానం, 2025 ప్రచురించింది. 20 రోజుల్లోపు – అక్టోబర్ 25 నాటికి ఆ విధానంపై తమ అభిప్రాయాలు, సూచనలు, వ్యాఖ్యలు పంపవలసిందిగా తత్సంబంధీకులను, సంస్థలను, ప్రజాసంఘాల సభ్యులను అది కోరింది. కేంద్ర విద్యుచ్ఛక్తి మంత్రిత్వశాఖ అక్టోబర్ 9, 2025నాడు విద్యుచ్ఛక్తి (సవరణ) బిల్లు ముసాయిదా ప్రచురించింది. ప్రజల నుంచి సూచనలు, సలహాలు, వ్యాఖ్యలను అక్టోబర్ 25లోగా కోరింది. 10 కేంద్ర ట్రేడ్ యూనియన్‌లతో కూడిన ఉమ్మడివేదిక (సిటియులు), రైతు సంఘాల ఐక్య సంస్థ – సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) రెండూ పై రెండు ప్రచురణల్లోని వాస్తవిక ఉద్దేశాలను విమర్శించాయి.



అక్టోబరు 18న జరిగిన సిటియులు, ఎస్‌కెఎం సంయుక్త సమావేశం పై రెండు ముసాయిదాలకు వ్యతిరేకంగా, నిరసన తెలియజేయాలని నిర్ణయించటంతోపాటు, దేశంలోని కార్మికులు, రైతులకు సంబంధించి కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న వివాదాస్పద విధాన చట్రానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనను కూడా ప్రకటించింది. కేంద్రప్రభుత్వ విధానాలు రానురానూ సామాన్య ప్రజల పట్ల కక్షసాధింపుగా, అణచివేసేవిగా ఉంటున్నాయని వారొక పత్రికా ప్రకటనలో విమర్శించారు.

తమకు ప్రత్యేకించిన, అందరికీ సంబంధమున్న సమస్యలపై నెలరోజులపాటు దేశవ్యాప్త ప్రచారాందోళనను ఆ సంఘాలు తలపెట్టాయి. ఆ ప్రణాళిక ప్రకారం కేంద్రప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు, తాజా ముసాయిదాల నిజ ఉద్దేశాలను నిరసిస్తూ దేశంలోని ప్రతి జిల్లానుండి కార్మికులు, కర్షకులు ప్రదర్శనలు, సభలు జరిపి చైతన్యపరిచే కృషి సాగిస్తారు. విద్యుచ్ఛక్తి ముసాయిదా బిల్లు, జాతీయ కార్మిక, ఉపాధి విధానం ముసాయిదాలకు వ్యతిరేకంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఉద్దేశించిన విజ్ఞాపన పత్రాలను నవంబర్ 26న జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తారు.

''కేంద్రప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను సవాలు చేస్తూ సమన్వయ పూర్వకంగా, ఏకకాలంలో ఆందోళనోద్యమాలను కొనసాగించాలని సిటియులు, ఎస్‌కెఎం సమావేశం నిర్ణయించింది. ''ఈ సంఘాల నాయకులు తమకు సంబంధించిన కోర్కెలపై రాష్ట్రపతికి ఉద్దేశించి ప్రతి చోట విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తారు. మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధాన చట్రాన్ని వెనక్కి కొట్టటానికి, లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేయటం అవసరం'' అని వారు ప్రకటించారు.

''ప్రభుత్వరంగ సంస్థలను, ప్రభుత్వ సేవలను ప్రైవేటీకరించటానికి కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతిపాదిత విద్యుచ్ఛక్తి సవరణ బిల్లు, కార్మిక–ఉపాధి మంత్రిత్వశాఖ ప్రచురించిన కార్మిక విధాన ముసాయిదా ఇందుకు తాజా ఉదాహరణ. రాష్ట్రప్రభుత్వాల ద్వారా నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయించేందుకు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ద్వారా రైతుల భూమి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి''అని వారి ప్రకటన పేర్కొన్నది. భారతప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రయోజనాలకు ఉపకరిస్తున్నదని, అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల వ్యవస్థకు వ్యతిరేకంగా భారత రైతులు, కార్మికుల, చిన్న వ్యాపారాలు, వాణిజ్య ప్రయోజనాలు కాపాడటంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది.

దేశంలో రైతు ఉద్యమంలో **నవంబరు 26**కు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. 2020లో ఢిల్లీ సరిహద్దులో రైతులు సంవత్సరంపాటు సాగించిన బైఠాయింపు ఆందోళనను ఆరంభించింది ఆ రోజునే. చలికి, వానకు, ఎండకు వెరవని ఆ ఆందోళన మూడు రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల చట్టాలను ప్రధాని నరేంద్రమోదీ ఉపసంహరించుకునేటట్లు చేసింది. అయితే తమ పంటలకు ఎంఎస్‌పికి లీగల్ గ్యారంటీ కల్పించటం సహా రైతుల అనేక డిమాండ్లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తానని మోదీ ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చలేదు. 10 సిటియుల ఉమ్మడి వేదిక రైతులకు తోడ్పాటిచ్చింది. ఇప్పుడు వారు కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక నిరసనలో చేయిచేయి కలుపుతున్నారు.

జాతీయ ఉపాధి విధానం ముసాయిదా, 2025 ముఖ్య ఉద్దేశం కేంద్రం ఉపాధి కల్పన బాధ్యతను తొలగించుకుని రాష్ట్ర ప్రభుత్వాలకు, మార్కెట్ శక్తులకు బదలాయించటంగా విమర్శకులు ఆరోపిస్తున్నారు. కార్మిక చట్టాల ధోరణిని 'కార్మిక హక్కులు' నుంచి 'కార్మిక విధులు'కు మార్చటంగా కనిపిస్తున్నది.

జాతీయస్థాయి సమ్మెలు సహా సిటియుల తీవ్ర ప్రతిఘటన మూలంగా వివాదాస్పదమైన నాలుగు కార్మిక స్మృతిల అమలును కేంద్రం పెండింగ్‌లో ఉంచింది. జులై 9న నిర్వహించిన చరిత్రాత్మక సమ్మె వాటిలో తాజా ఆందోళన. ప్రభుత్వం ఇప్పుడు దొడ్డిత్రోవన అమలులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోందని, జాతీయ, కార్మిక, ఉపాధి విధానం, 2025, ముసాయిదా అందుకు ఉద్దేశించిందిగా సిటియులు అనుమానిస్తున్నాయి.

విద్యుచ్ఛక్తి (సవరణ) బిల్లు, 2025, ముసాయిదా 2003 నాటి విద్యుత్ చట్టాన్ని సమూలంగా మార్పు చేయతలపెట్టింది. టారిఫ్‌లు ఖర్చులను ప్రతిబింబించాలని, క్రాస్ సబ్సిడీలకు ముగింపు పలకాలని, పారిశ్రామిక పోటీతత్వానికి ప్రోత్సాహమివ్వాలని, పునరుత్పాదక ఇంధన హామీలు నెరవేర్చటాన్ని, రెగ్యులేటరీ జవాబుదారీతనాన్ని పటిష్టం చేయాలని అది ప్రతిపాదించింది.

విద్యుచ్ఛక్తి టారిఫ్ లు విద్యుత్ ఉత్పత్తి – సరఫరా వ్యయాన్ని పూర్తిగా భర్తీచేసే విధంగా రెగ్యులేటరీ కమిషన్‌లు ఇకపై ఆదేశించవచ్చు. ఈ కార్మిక వ్యతిరేక చర్యను ఎస్‌కెఎం ఆమూలాగ్రం వ్యతిరేకిస్తున్నది.

## ఇంటర్నెట్ లేని సమాజాన్ని ఊహించగలమా!

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ ఎఐ యుగం వరకు మానవ జీవనశైలిలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈమెయిల్, ఫేస్‌బుక్, యూట్యూబ్, గూగుల్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి పదాలు చిన్న పిల్లలకు సహితం కంఠస్థం అయ్యాయి. కంప్యూటర్ వ్యవస్థను రిమోట్ కంట్రోల్ ద్వారా అనుసంధానం చేస్తూ సమాచార వితరణ సుసాధ్యం చేయడాన్ని ఇంటర్నెట్‌గా చెప్పుకుంటున్నాం. 'ఇంటర్ కనెక్టెడ్ నెట్వర్క్'ను 'ఇంటర్నెట్' అంటున్నాం. ప్రపంచ మానవాళి అరచేతిలో స్మార్ట్‌ఫోన్ రూపంలో వైకుంఠం వెలిసింది. గూగులమ్మ పొట్టలో విశ్వ విజ్ఞానం అంతా దాగిపోయింది. అడిగిందే తడవుగా సమాచారాన్ని మనకు వడ్డిస్తోంది. నేటి 'వరల్డ్ వైడ్ వెబ్'ను 1989లో టిమ్ బెర్నర్ లీలు కనుగొన్నారు. పట్నం మేధావి నుంచి పల్లె నిరక్షరాస్యుడి వరకు అందరికి ఇంటర్నెట్ ఆత్మీయ నేస్తం అయ్యింది. 29, అక్టోబర్ 1969 రోజు తొలి సారి కాలిఫోర్నియా యూనివర్సిటీలో 'చార్లీ క్లైన్'తో కలి సి 'లియొనార్డ క్లీన్రాక్' 'ఎల్', 'ఓ' (లాగిన్) అనే ఆంగ్ల అక్షరాలను ఎలక్ట్రానిక్ ఇంటర్నెట్ మెసేజ్ ద్వా రా విజయవంతంగా పంపించడం జరిగింది.




**అంతర్జాతీయ అంతర్జాల దినోత్సవం:**

ఆధునిక మానవుడు అంతర్జాల లేదా ఇంటర్నేట్ సంద్రంలో మునిగి తేలుతున్నాడు. ఇంటర్నేట్ వాడకుండా ఒక గంట గడవడం లేదు. స్మార్ట్ఫోన్ మానవ శరీరంలో మరో ఆధునిక అంగం అయ్యింది. స్మార్ట్ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడ డం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. విశ్వాన్ని కుగ్రామంగా మార్చిన ఘనత ఇంటర్నెట్ టెక్నాలజీదే అని నమ్ముతున్నాం. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దానిపట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి. అంతర్జాలాన్ని వినియోగిస్తున్న నెటిజెన్లు అనేక ప్రయోజనాలను పొందుతున్నప్పటికీ పలు సందర్భాల్లో ప్రతికూల అనుభవాలు, సైబర్ బుల్లీయింగ్, తిట్ల దండకాలు, అక్రమ వినియోగాలు, అసభ్యకర అవమానకర మాటలను కూడా వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. ఆ సృజనశీల ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏట 29 అక్టోబర్ రోజు ప్రపంచ దేశాలు అంతర్జాతీయ అంతర్జాల దినోత్సవం (ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ డే)పాటించడం 2005 నుంచి ప్రారంభం అయ్యింది.

**జగమంతా అంతర్జాల మయం :**

నేటి 'ఇంటర్నెట్'ను ప్రారంభంలో 'ఆర్పినెట్' అని పిలిచేవారు. నేటి డిజిటల్ ఎఐ యుగంలో ఇంటర్నెట్‌ను ఇన్ఫర్మేషన్ సూపర్ హైవే అని పిలవాల్సిన స్థితి రావడం చూస్తున్నాం. ఇంటర్నెట్‌ను శోధించడాన్ని 'సర్ఫింగ్' అని, ఇంటర్నెట్ వినియోగదారులను 'నెటిజెన్' అని, వీడియో కాన్ఫరెన్స్‌ను 'వెబినార్' అని పిలుస్తున్నాం. గూగుల్ సహాయంతో ఒక ప్రశ్నకు 0.2 సెకన్లలో సమాధానాలు పొందుతున్నాం. 1971లో ఈ మెయిల్, 1994లో యాహూ, 1995లో ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, 1998లో గూగుల్, 2004లో ఫేస్బుక్, 2006లో ట్విట్టర్ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం గూగుల్‌ను కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్నెట్స్ అని పిలుస్తున్నాం. అంతర్జాల సంద్రంలో మునిగిన నేటి డిజిటల్ మానవుడు ఎలక్ట్రానిక్ మెయిల్స్, పరిశోధనలు, డౌన్‌లోడ్ ఫైల్స్, ఆన్లైన్ చర్చలు, ఈవిద్య, వీడియో గేమ్స్, స్నేహాలు, ఈలైబ్రరీ, కృత్రిమ మేధ, ఆర్థిక బ్యాంకింగ్ సేవలు, సమాచార వితరణ, వర్క్ ఫ్రం హోమ్, విజ్ఞాన బోధన, లాంటి అనేక ప్రయోజనాలను పొందుతున్నాడు. నేడు విశ్వవ్యాప్తంగా 5.56 బిలియన్ల అంతర్జాల వినియోగదారులు, 5.28 బిలియన్ల స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు, ఇంటర్నెట్ వాడుకునే 68 శాతం ప్రపంచ ప్రజలు ఉన్నారు. నేడు అత్యధికంగా చైనాలో 975 మిలియన్లు, భారత్‌లో 806 మిలియన్లు, యూఎస్‌లో 322 మిలియన్ల అంతర్జాల వినియోగదారులు ఉన్నారు. ప్రతి ఏట ఒక మిలియన్ ఇంటర్నెట్ వినియోగదారులు కొత్తగా చేరుతున్నారు.

నేడు ఇంటర్నెట్ సగటు వినియోగం 6 గంటల 42 నిమిషాలు, సోషల్ మీడియా సగటు వినియోగం 2 గంటల 16 నిమిషాల సమయం పడుతున్నది. నిత్యం దాదాపు 350 బిలియన్ల ఈ మెయిల్స్ పంపడం జరుగుతున్నది.

**సురక్షితంగా అంతర్జాలాన్ని వాడుకుందాం:**

అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దానిపట్ల కనీస పరిజ్ఞా నం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 11 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు సురక్షిత అంతర్జాల దినం లేదా సేఫర్ ఇంటర్నెట్ డే పాటించడం కూడా ఆనవాయితీగా మారింది. నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు మిత్రులు, సహచర వర్గాలు, పౌర సమాజాల్లో సురక్షితంగా అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది. ఆన్లైన్‌లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరంగా ఉండడంలాంటివి మనం ఆచరణలో పెట్టాలి.

**ప్రధాన ఇంటర్నెట్ ఆన్లైన్ మోసాలు:**

ఇంటర్నెట్‌తో ఎంతో ప్రయోజనం పొందుతున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అంతర్జాల వలలో చిక్కి జీవితాలు సర్వనాశనం కూడా కావచ్చని మన అనుభవం స్పష్టం చేస్తున్నది. అంతర్జాల వలయంలో అధిక సమయం మునిగితే ఓపిక నశించడం, ఒంటరితనం, నిద్రలేమి, అనారోగ్య సమస్యలు, కంటిచూపుపై దుష్ప్రభావం, ఏకాగ్రత లోపించడం, దుర్వార్తలను ప్రేరేపించడం, అశ్లీల సైట్స్‌తో భవిష్యత్తు సర్వనాశనం, పనిలో శ్రద్ధ తగ్గడం, సైబర్ నేరాలు లాంటివి కలుగుతున్నాయి. ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్వేర్, ఆన్లైన్ గ్రూమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్లైన్ ప్రిడేటర్స్, సెక్స్టింగ్, రాన్సమ్వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ బెట్టింగ్ మోసాలు, ఆన్లైన్ అప్పుల వేధింపులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యింది. వీటి పట్ల అవగాహనలేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవాలి. తగు విధంగా ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వాడడం నేర్చుకొని భద్రంగా అంతర్జాల వలలో ఆనంద తాండవం ఆడుదాం, విజ్ఞాన వివేకాలను పొందుదాం,ఆన్లైన్ మోసగాళ్లకు ముచ్చెమటలు పట్టిస్తూ వారి భరతం పడదాం. ఇంటర్నెట్‌ను విశ్వమానవాళి ప్రయోజనాలకు వినియోగిస్తూ, అన్ని రంగాల్లో ముందడుగు వేద్దాం.

*(29 అక్టోబర్ అంతర్జాతీయ అంతర్జాల దినం సందర్భంగా)*

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037**



కొండేటి ప్రకాష్

## పాలనాదక్షుడు, బహుముఖ సాహితీ వేత్త – తెలంగాణ అంతరంగ ఆవిష్కర్త

ఒక తరం నుండి ఎన్నో తరాల వరకు అందిన మౌఖిక సాహి త్యం అమూల్యమైనది. మాట్లాడటం నేర్చిన మనిషి భౌతిక అవసరాలకే కాక భావోద్వేగాలను కూడా మాటల ద్వారానే వెల్లడించాడు. ఈ ప్రక్రియలో మనిషి అంతర్గత భావాలన్నీ సాహిత్యంగా పరిణామం చెంది మౌఖిక సాహిత్యంగా ప్రశస్తి పొందింది. సాహిత్యంలేని సమాజాన్ని ఊహించలేని స్థితిలో మనం ఇప్పుడు ఉన్నాం. సమాజంలోని ఔన్నత్యాన్ని కొలవడానికి సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపకరిస్తుందన డానికి నూటికి నూరుపాళ్లు నిజమే అని చెప్పవచ్చు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలనలో భాగమైన ఉన్నతాధికారి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తన పదవీ బాధ్యతలను అత్యంత పారదర్శకంగా నిర్వర్తిస్తూనే, సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరుడిగా తన అంచంచలమైన సామాజిక బాధ్యతను కవిగా, రచయితగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా తనదైన శైలిలో విభిన్న రూపాల్లో రచనలు చేస్తున్న వర్తమాన కవి ధురంధరుడు. సాహితీ ప్రపంచంలో ఆయన సుపరిచితుడు. సమాజాన్ని గట్టిగా తన రచనల ద్వారా మందలించకుండా వ్యంగ్యంగా చెప్పడం వారి ప్రత్యేకత అని చెప్పవచ్చు. సాహిత్యంలోకి రాబోతున్న యువ కవుల కు వారు దిక్సూచిగా ఉండటంతో పాటు తన కంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సాహిత్యంలో పదిలం చేసుకున్నారు.


**వ్యక్తిగత నేపథ్యం, విద్యాభ్యాసం, వృత్తి:** భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కల్లోనికుంట గ్రామానికి చెందిన ఏనుగు కృష్ణా రెడ్డి, లక్ష్మ మ్మ దంపతుల కుమారు డు ఏనుగు నరసింహారెడ్డి. పుట్టింది కల్లోనికుంట అయినప్పటికీ, తరువాత కాలంలో ఏనుగు కృష్ణారెడ్డి కుటుంబం చిట్యాల గ్రామంలో స్థిరపడింది. రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన నరసింహారెడ్డి చిన్నప్పటి నుండే గ్రామీణ ప్రజల జీవన విధానంపై పూర్తి అవగాహన కలిగివున్నట్లు వారి రచన లు గమనిస్తే పాఠకులకు అవగతమవుతుంది. తెలుగు గ్రంథం మీద పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ ఆఫీసర్‌గా, డిప్యూటీ కలెక్టర్‌గా తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ తొలి కార్యదర్శిగా పనిచేశారు. డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ప్రస్తుతం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా ఉన్నారు.

**సాహితీ సృజన– విమర్శ:** డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి పరిశీలన దృష్టి, అధ్యయనశీలత, లోతైన అనుభవాన్ని వారి రచనలలో ప్రకటిస్తా యి. కవిత్వం అనే ఒక రేఖమీద అనేక సృజన రూపాలు, వచన కవిత, గేయం, గజల్ లాంటి వైవిధ్య అంశాలపై చేసిన విశ్లేషణలు, కవిత్వంపై చేసిన విశ్లేషణాత్మకమైన వ్యాసాల సంపుటి 'అంతరంగం ఆధునిక కవిత్వ విమర్శ'. దాశరథి, అమ్మంగి, కాళోజీ, సినారె, శివారెడ్డిలు మొదలుకొని ఆశారాజు, విల్సన్ రావు, వడ్డె ఎల్లన్న, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి వరకు ఇలా చెప్పుకుంటూ పోతే సాహితీ కవిత్వంలో ముందు వరుసలో ఉండే ప్రముఖ కవుల కవిత్వం గురించిన ఇరవై ఆరు విశ్లేషణాత్మక వ్యాసాలు ఇందులో ఉన్నాయి. సాహిత్యంలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి ఉన్న లోతైన అనుభవాలను ఈ 'అంతరంగం' ద్వారా పాఠకులు తెలుసుకోవచ్చు.

విమర్శ వారి రచనా వ్యాసంగంలో మేలిమి భాగం. తన దగ్గరకు వచ్చే కవిత్వ పుస్తకాలను శ్రద్ధగా చదువుతూ వాటిలోని సారాన్ని, సారాంశాన్ని వివరిస్తూ వ్యాసాలు రాశారు. వాటిలోంచి ఎంపిక చేసిన సుమారు 62 వ్యాసాల సమాహారం 'ఊహల వేదిక ఆధునిక కవిత్వ విమర్శ'. ఈ వ్యాసాలన్నీ చదువుతూపోతే వందలమంది కవులు తారసపడతారు. కవిత్వంపై ఇంతటి ఆసక్తి వారిలో ఉంద నే విషయం ఈ పుస్తకం చదివితే పాఠకులకు అర్థమవుతుంది.

**రచనా వైవిధ్యం – వస్తువు:** డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి రచనల్లో పల్లె జీవనం, సామాజిక సమస్యలు, రాజకీయ విమర్శ, తెలంగాణ పునర్నిర్మాణం వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి.






**పల్లె జీవనం, సామాజిక సమస్యలు:** పల్లె ప్రజల జీవన విధానంతో పాటు పల్లెలు కూడా మారుతున్న తీరును, పేద ప్రజలు అప్పుల సముద్రంలో మునిగి తేలియాడుతుండటం, ఊరి ఊట బావులు ఎండిపోవడం వంటి పల్లె జీవన వైవిధ్యాన్ని రచయిత తన 'మట్టి పాట పల్లె జీవన శతకం' ద్వారా సమాజానికి విశదీకరించారు.

**రెవెన్యూ వ్యవస్థ – పాలన:** గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలన్నా, సంక్షే మ పథకాలు నిరుపేద ప్రజలకు సకాలంలో చేరాలన్నా, భూ వివాదాలు, కక్షలు, గొడవలు తొలగి ప్రజలు సురక్షితంగా జీవించాలన్నా భారత రాజ్యాంగం ద్వారా నిర్మించబడిన అన్ని రకాల ప్రభుత్వ వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి. రెవెన్యూ వ్యవస్థ మెరుగైన సేవలు అందించినప్పుడు దాదాపు తొంభై శాతం గ్రామ సమస్యలు తొలగిపోతాయి అనే విషయాన్ని గుర్తించారు. ప్రజలపక్షంలో ప్రభుత్వం జవాబుదారీతనంతో ఎందుకు వ్యవహరించాలనే బాధ్యత ను ప్రభుత్వ అధికారులకు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి 'తెలుగు రాష్ట్రాల రెవె న్యూ వ్యవస్థ నిన్న నేడు రేపు' పేరుతో రూపకల్పన చేసిన వచన సంపుటి పుస్తకం ద్వారా తెలియజేశారు.

**కొత్త పలక – కవితా సంపుటి:** 'పీఠభూమిలో/నాగలి కర్రు కింద/ నీటిమట్టం కూడా/నిర్దయగా జారుకుంది అం టూ తెలంగాణ వ్యవసాయ దైన్యాన్ని చెపుతారు. ప్రపంచీకరణలో భాగంగా వ్యవసాయం ప్రస్తుతం ఎలాంటి స్థితిలో కొనసాగుతోంది అనే విషయం ఇందులో ఉంది. తెలంగాణ ప్రాంత భూమి, సాంస్కృతిక పునరుజ్జీవన, పునర్నిర్మా ణ స్థితుల ప్రభావం ఈ కవితా సంపుటికి కారణం కావచ్చు.

రోడ్డు ప్రమాదాల తీవ్రతను, కారణమైన వేగాన్ని గురించి 'యముడు నడిచే దారి' శీర్షికలో 'నిర్లక్ష్యపు క్రాసింగువల్లనో/నిదురమత్తు డ్రైవింగువల్లనో/ మిన్నంటిన హాహాకారాల్ని/ యాక్సిడెంట్లుగా రికార్డు చేస్తుంది. ఆటో నుజ్జైపోవచ్చు, బైకురైడర్ బలైపోవ/అతివేగం పదునుకత్తి. రోడ్డుమీద స్మశానాల్ని సృష్టించే వేగం నిరంతరం యముడికి' అంటూ పదునైన కత్తిగా 'కొత్త పలక కవితా సంపుటి'లో చెపుతారు. ఈ సంపుటి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ కవితా సంపుటి పురస్కారం పొందింది.

**ఏడుకోలల బాయి – ఎన్నికల శతకం:** 'కాటు వేయని నాగును కానగలమె/ దోచుకొనుటను మానిన దొరలు గలరె?' వంటి పంక్తులు రాజకీయాల్లోని లోపాలను సూటిగా ప్రశ్నించాయి. నీతి లేని రాజకీయం అవినీతి నిర్వచనం, రాజకీయ నాయకుల నైజాన్ని, నీతి లేని వైఖరిని నాగుపాము కాటుతో పోల్చి ప్రజలకు సులువుగా అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చోటు చేసుకుంటున్న లోపాలను, అపసవ్య పోకడలను నిశితంగా పరిశీలిస్తూ, వాస్తవాలను కవిత్వంలో నిక్షిప్తం చేసిన అద్భుత సృష్టి 'ఏడుకోలల బాయి ఎన్నికల శతకం'.

**తెలంగాణ రుబాయిలు:** దాశరథి, తిరుమల శ్రీనివాసాచార్య గార్ల తర్వాత ఆ సంఖ్యలో రుబాయీలు రాసినవారు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాత్రమే అని చెప్పవచ్చు. ప్రధానంగా వచన కవి అయినప్పటికీ ఈ ప్రక్రియను చేపట్టా రు.

'చెరువు ఎండిపోయింది; జ్ఞప్తిలా అంతర్జలం!/వాగు వట్టిపోయింది; ఛాయ అంతర్జలం!/ పరమాత్ముని లీల లాగ ప్రవర్తిస్తది ప్రకృతి/ ఊరు వలసపోయి ఊహలా అంతర్జలం!' అంటూ గతంలో తెలంగాణను పీడించిన వలస సమస్యను ప్రస్తావించారు. కొత్త పోలికలతో చమత్కారకరంగా, సరికొత్తగా వ్యక్తీకరించడం వీరి రుబాయీలలోని ఒక ప్రత్యేకత. ప్రచ్ఛన్న హితబోధ, అదృశ్య ఆత్మబోధ, సున్నిత అధిక్షేపం ఈ రుబాయిలలోని అంతస్సారం. తెలంగాణ సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయం 2023 సం.కి తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవల్లో ఉత్తమ గేయ కవితా గ్రంథ సాహితీ పురస్కారాన్ని డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి 'తెలంగాణ రుబాయిలు' ఎంపిక అయ్యింది.

డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఉన్నతాధికారిగా తన వృత్తిని, కవిగా, విమర్శకుడిగా తన సాహితీ ప్రయాణాన్ని సమన్వయం చేసుకుంటూ సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నారు. వారి రచన లు, వారి జీవితం వర్తమాన కవులకు, రచయితలకు ఆదర్శనీయం.

*(29/10/2025నాడు జరుగుతున్న తెలంగాణ సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయం 2023 సంవత్సరానికి తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవాల్లో ఉత్తమ గేయ కవితా గ్రంథ సాహితీ పురస్కారాన్ని డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి 'తెలంగాణ రుబాయిలు' అందుకుంటున్న సందర్భంగా )*

## రక్తదానం అత్యున్నత సేవ

### ఆసిఫాబాద్ ఎఎస్పి చిత్తరంజన్

**ప్రజాపక్షం/కెరిమెరి :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం కెరిమెరి పోలీస్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆసిఫాబాద్ ఎఎస్పి చిత్తరంజన్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఎస్పి చిత్తరంజన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం మనిషి చేయగల అత్యున్నత సేవల్లో ఒకటి అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని, అమరవీరుల స్ఫూర్తినీ ఎప్పటికీ నిలిచిపోయేలా చేస్తాయని తెలిపారు.
కెరిమెరి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి 71 మంది యువత రక్తదాన కార్యక్రమంలో పాల్గొనగా వారిని ఎఎస్పి అభినందించారు. ఈ కార్యక్రమాన్ని సిఐ సత్యనారాయణ, ఎస్ఐ మధుకర్, పోలీస్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా నరేష్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల నరేష్ నియమితులయ్యారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్



మాట్లాడుతూ నాపై నమ్మకంతో మంచిర్యాల జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమించినందుకు అధ్యక్షురాలు కవితకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, అలాగే జాగృతి బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.



## పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పూర్తిచేయాలి

### భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌లు త్వరితగతంగా పూర్తి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డిసిఎల్ కార్మిక శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాజంగుల రాజు మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన కార్మికుడికి శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ ఫలాలు అందజేయాలన్నారు. అడ్డాల వద్ద షెల్టర్లు నిర్మించాలని అన్నారు. సాధారణ మరణానికి ఐదు లక్షలు, యాక్సిడెంట్‌కు పది లక్షల ఇవ్వాలన్నారు. సిఎస్‌సి సెంటర్లను రద్దు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కీర్తి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బదర్ చౌష్, ఉపాధ్యక్షులు మహేందర్, నాగోరావు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా చైర్మన్

### 'ప్రజాపక్షం' కథనానికి స్పందన




**ప్రజాపక్షం/నేరడిగొండ :** గత వారం అక్టోబర్ 20న సమస్యల వలయంలో గ్రంథాలయాలు అనే కథనానికి స్పందించి మంగళవారం గ్రంథాలయ చైర్మన్ మల్లె పూల నరసయ్య, మండల శాఖ గ్రంథాలయాన్ని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యక్షంగా గ్రంథాలయ పరిసరాలను పరిశీలించి పాఠకులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.గ్రంథాలయంలో ఉన్న బుక్స్ వివరాలను గ్రంథాలయానికి ఎంతమంది నిరుద్యోగులకు ప్రతిరోజు వస్తున్నారు.ఉద్యోగ స్టడీ కోచింగ్ కు ప్రిపేర్ అయ్యేవారికి ఉన్న ఇబ్బందులను పఠణం సందర్భంగా ఏర్పడుతున్న ఇబ్బందులపై త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. లైబ్రరీ శ్రీకాంత్‌ని ప్రతిరోజు వచ్చే దినపత్రికలపై రిజిస్టర్లను పరిశీలించి ఆరా తీశాడు అనంతరం ఆయనను గుణింతాలయశాఖ సిబ్బంది శాలువాతో సన్మానించారు.గ్రామ విడిసి సభ్యులతో గ్రంథాలయ భవనం మార్పుపై ఇతర సమస్యలపై వీలైనంత త్వరలోనే పరిష్కార మార్గాలు కనుక్కొని పరిష్కరిస్తామని అన్నారు.అయనతో పాటు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగా రెడ్డి,ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు,రాజశేఖర్ రెడ్డి,సంజీవ్,గట్టు అశోక్,రమేష్,యండి సద్దాం,తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో 'ఛత్' పూజలు

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పట్టణంలోని ఎస్‌పిఎం మైదానంలో ఉత్తర భారత భక్తులు ఛత్ పూజలను సోమవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు ప్రతి ఏటా కార్తీక మాసంలో నీటి కొలనులో ఈ పూజలు నిర్వహిస్తారు. సోమవారం సూర్యాస్తమయం నుండి మంగళవారం సూర్యోదయం వరకు ఈ పూజలు చేస్తారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు 36 గంటల పాటు కఠోర ఉపవాసదీక్షను ఆచరిస్తారు. తొలిరోజు సోమవారం సూర్యభగవానుడికి పండ్లు, ఫలహారాలతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉత్తర భారతీయులు అత్యంత నిష్ఠతో సూర్యభగవానునికి పూజలు చేసి, మంగళవారం ఉదయం సూర్యోదయానికి ముందే నీటిలో ఉండి స్నానం చేసి, సూర్యభగవానుడికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఉపవాసదీక్షను విరమిస్తారు. ఛత్ పూజలు ఆచరించటం ద్వారా కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుందని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు, జెకె వర్కింగ్ ప్రెసిడెంట్ ఏకే మిశ్రా పాల్గొని భక్తులను అభినందించారు. చివరి రోజైన ఉదయం పూజా కార్యక్రమంలో కోనేరు కృష్ణ రావు పాల్గొని సూర్యభగవానుని ప్రార్థించి, ప్రత్యేక పూజలు చేసి ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సలర్ విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

## చెరువులో దూకి బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య



**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామ దుబ్బచెరువులో పడి ఓ బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్య సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. అటుగా వెళుతున్న గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అల్లాదుర్గం ఎస్ఐ శంకర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడి ఇక్కడ జరిగిన విషయం తెలిపి వివరాలు అడిగి తెలుసుకొని ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ గాజులరామారంలో నాగ చారి 35 ఓ ప్రైవేట్ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్ గా పని చేసేవాడు అయ్యప్ప మాల వేసుకున్న అతను భార్యకు గుడికి వెళుతున్న అని చెప్పి సోమవారం ఉదయం ఇంటి నుండి బయలుదేరి సాయంత్రం రాంపూర్ చెరువు వద్దకు చేరుకొని ద్విచక్ర వాహనం బ్యాగు ఐడి కార్డు చెరువు కట్ట పై ఉంచి భార్యతో ఫోన్లో చెరువు చూపించి నాకు బ్రతకడం ఇష్టం లేదని చెరువులో దూకి ఆత్మహత్య పాల్పడినట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. మంగళవారం ప్రొద్దున గజ ఈతగాళ్ల సహాయంతో శవాన్ని బయట తీసి పోస్ట్ మార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులకు అందించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం కాగజ్ నగర్ పట్టణంలోని సర్ సిల్క్ కాలనీ వార్డు నెంబర్ 1 లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు ఇండ్లు కేటాయించి గూడు కల్పిస్తుందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో పథకంలో లబ్ధి పొందిన వారు ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి ప్రారంభించడానికి సిద్ధం చేయాలని



తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ఉచితంగా ఇసుకను అందిస్తుందని, నిర్దేశిత విస్తీర్ణంలో నిర్మించుకున్న ఇండ్లకు బిల్లులు విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో సందర్శించి లబ్ధిదారులకు అవసరమైన సూచనలు అందించాలని, నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం ఆర్థికంగా వెనుకబడిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మండల సమాఖ్య ద్వారా రుణ మంజూరు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, గృహ నిర్మాణ శాఖ పిడి. వేణుగోపాల్, మండల తహసిల్దార్ మధుకర్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యత పెంచుకుని ఉపాధి పొందాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే




**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** నైపుణ్యతను పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం కాగజ్ నగర్ పట్టణంలోని సుప్రభాతం పాఠశాలలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం క్రింద నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమం లో భాగంగా నైపుణ్యత శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇజిఎంఎం, సాహితీ సంస్థ వారు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. శిక్షణలో కంప్యూటర్, ఆంగ్లభాషపై అవగాహన, ఇతర నైపుణ్యతలపై ఇచ్చే శిక్షణను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని, జీవితంలో స్థిరపడాలని తెలిపారు. దేశంలో ప్రైవేటు రంగంలో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని తెలిపారు. సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సిర్పూర్ నియోజకవర్గ శాసన సభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తరాం, తహసిల్దార్ మధుకర్, ఇజిఎంఎం, సాహితీ సంస్థ ప్రతినిధులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

## అవినీతికి తావు లేకుండా పారదర్శకతతో పాలన

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో అవినీతికి తావు లేకుండా పారదర్శకతతో కూడిన సమర్ధ పాలనే లక్ష్యంగా ముందుకు పోతున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు స్టేట్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నిర్వహణలో భాగంగా విజిలెన్స్ డీఎస్పీ సతీష్ రెడ్డి, సీఐ లు నాగుల్ మీరా, ప్రశాంత్, హరికృష్ణ విజిలెన్స్ ఏ.జీ, కోటేశ్వర్ రెడ్డి, విజిలెన్స్ ఏ.ఓ కలిసి జిల్లా కలెక్టర్ సమగ్రత, అవినీతి నిర్మూలన, లంచం ఇవ్వచూపడం, తీసుకోవడం నేరం వంటి అంశాలపై అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 27 నుంచి నవంబరు 2వ తేదీ వరకు కల్చర్ ఆఫ్ ఇంటెగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పర్టీ అనే థీమ్‌తో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పబ్లిక్‌లో అవినీతి నిర్మూలనపై క్విజ్ పోటీలు, వాక్‌థాన్‌లు, మారథాన్‌లు, వీధి నాటకాలు, గ్రామసభలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకతతో కూడిన పని సంస్కృతిని నెలకొల్పేలా ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని వీడి నిజాయితీగా సామాజిక బాధ్యతగా మెలగాలని సూచించారు.



రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని మెదక్ జిల్లాలో జవాబుదారితనం పారదర్శకత తో కూడిన పాలనే లక్ష్యంగా ఈ ఆఫీస్ విధానాన్ని అమలుచేసి సమగ్ర పాలన దిశగా ముందుకు పోతున్నామన్నారు. అన్ని శాఖల కార్యకలాపాల ఫైల్స్ ఈ ఆఫీస్ విధానం ద్వారా తీసుకురావడం వల్ల ఫైల్ మేనేజ్మెంట్ సిస్టం క్రమ పద్ధతిలో ఉండటమే కాకుండా ఉద్యోగి బదిలీపై వెళ్లినా కూడా మళ్లీ వచ్చే నూతన ఉద్యోగికి శాఖల పనితీరుపై అవగాహన కొరకు ఫైల్స్ భద్రంగా ఉంటాయి అన్నారు. అవినీతిని నిరోధించడంలో పౌరులందరూ భాగస్వాములు కావాలని ప్రోత్సహించడం, సమగ్రత, పారదర్శకత మరియు జవాబుదారీతనం యొక్క సంస్కృతిని బలోపేతం చేయడం దీని ప్రధాన లక్ష్యం. గా పేర్కొన్నారు.అదేవిధంగా సోషల్ మీడియా ద్వారా వీటి గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం విజిలెన్స్ పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కలెక్టర్ నగేష్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిర్మల్ విద్యాశాఖలో 'లైంగిక వేధింపుల కలకలం'

**ప్రజాపక్షం/నిర్మల్ :** పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పవలసిన ఉపాధ్యాయులే మైనర్ బాలికలపై అసభ్యంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడడం వంటి ఘటనలు నిర్మల్ జిల్లా విద్యాశాఖకు తీరని మచ్చ తెస్తున్నాయి. సంఘటన జరిగినప్పుడు మాత్రమే జిల్లా యంత్రాంగం స్పందించి,ఆ తర్వాత నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో ఇటువంటి ఘటనలు పదే పదే పునరావృతమవుతున్నాయి.దీంతో తమ పిల్లలను విద్యా సంస్థల్లో చదివించాలంటేనే తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందవలసిన అవసరం ఏర్పడింది. నిర్మల్ జిల్లా లోని బాసర జడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఒక మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించగా అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.ఈ ఘటనను వారం రోజుల పాటు దాచడానికి ప్రయత్నించిన ప్రధానోపాధ్యాయులు,ఇన్‌చార్జి ఎంఈఓ పై కూడా కేసు నమోదవడం విద్యాశాఖలో కలకలం సృష్టించింది.పోలీసుల విచారణలో మైనర్ విద్యార్థినులే ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనను ధృవీకరించారు.ఆరు నెలల క్రితం నర్సాపూర్(జి) ఉన్నత పాఠశాలలో ఎస్టీ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు ఉపాధ్యాయులను కూడా పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌రు పంపారు.ఆ ఘటనను గోప్యంగా ఉంచడానికి ప్రయత్నించిన ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది.ఏడాది కాలంలోనే సోన్,కుబీర్ మండలాల్లోనూ,అలాగే బీసీ హాస్టళ్లు,ప్రైవేటు పాఠశాలల్లోనూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో జరిగిన కొన్ని ఘటనలను ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులను బతిమిలాడి,వెలుగులోకి రాకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.



## వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/హాజీపూర్ :** హాజీపూర్ మండలం గుడిపేటలో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం గుడిపేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను రోడ్లు భవనాల శాఖ డిఇ సజ్జత్ భాషాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందించేందుకు ప్రభుత్వం వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. దీని కోసం 216 కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టడం జరుగుతోందని అన్నారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ డిఇ సజ్జత్ భాషా తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భూభారతి దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా వెంటాదివెంట అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవరం డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ ఇతర సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష జరిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఎంత మందికి నోటీసులు ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయిందా తదితర వివరాలనుఅడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు అన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీఓటీలకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, వెంట వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యంజరగకుండా రోజువారిగా దరఖాస్తులపరిశీలనను పర్యవేక్షిస్తూ వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రేనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, తహసీల్దార్ సతీష్, అధికారులున్నారు.



## కుక్కల బెడద నుండి బెల్లంపల్లి ప్రజలను కాపాడాలి

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** బెల్లంపల్లిలో వీధుల్లో తిరుగుతున్న కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని ఎంసిపిఐయు నాయకులు సోమవారం బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లిలో కుక్కలు స్వేచ్ఛగా తిరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని వారు అన్నారు. ఇటీవల 31వ వార్డులో ఒక వృద్ధురాలిని కుక్క కరవటం వలన అధిక రక్తస్రావం అయిందని, అదే సమయంలో చిన్నపిల్లలు గనుక ఉంటే కుక్కలు వారిని చంపేసేటివని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కుక్కలను ఊరి అవతల వదిలి పెట్టాలని డిమాండ్ చేశారు. కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని, లేకపోతే బెల్లంపల్లిలోని అన్ని పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, తోగరి రాహుల్, పోలోజు రామకృష్ణ పాల్గొన్నారు.


## నిర్మల్ డిసిసి అధ్యక్ష పదవిపై ఉత్కంఠ!

### బిసిలకా? సీనియర్లకా? రేవత్ నిర్ణయంపై దృష్టి

**ప్రజాపక్షం/నిర్మల్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పునర్నిర్మాణంలో భాగంగా, 33 జిల్లాల డిసిసి అధ్యక్షుల నియామక ప్రక్రియ తుది ఘట్టానికి చేరుకుంది. ఈనెల లోపు నియామకాలను పూర్తి చేయాలని ఏఐసీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాజకీయ చైతన్యం ఉన్న నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.ప్రస్తుత నిర్మల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కె.శ్రీహరి రావు రెండేళ్లుగా డీసీసీ అధ్యక్షునిగా కొనసాగుతుండగా,ఈ పదవి కోసం ఏకంగా 20 మంది నేతలు దరఖాస్తు చేసుకున్నారు.ఏఐసీసీ నియమించిన పరిశీలకులు (కర్ణాటక మాజీ మంత్రి అజయ్ సింగ్) జిల్లాలోని నిర్మల్,ఖానాపూర్,ముధోల్ నియోజకవర్గాల్లో బ్లాక్ స్థాయి సమావేశాలు నిర్వహించి,దరఖాస్తులు స్వీకరించి అభిప్రాయాలను సేకరించారు.ఏఐసీసీ ఈ సారి పారదర్శక పద్ధతిలో నియామకాలను చేపట్టాలని నిర్ణయించింది.రాజకీయ ప్రాబల్యం ఉన్న నేతల కంటే,ప్రజలతో బలమైన సంబంధాలు ఉండి,పార్టీ కార్యక్రమాలను నిర్వహించిన నాయకులకే అవకాశం ఇవ్వాలని సూచించింది.కాంగ్రెస్‌లో కనీసం ఐదేళ్లు పనిచేసిన వారికే అవకాశం ఇవ్వాలని,ఒకరికి ఒకే పదవి విధానాన్ని అమలు చేయాలని,రాజకీయ లాబీయింగ్‌కు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది.ఈ కఠిన నిబంధనల కారణంగా,2023 అసెంబ్లీ ఎన్నికల పైగా అభ్యర్థులు రేసు నుంచి వైదొలగక తప్పని పరిస్థితి ఏర్పడింది. డిసిసి అధ్యక్షుడి ఎంపిక కోసం కసరత్తు పూర్తి చేసి,ముగ్గురు కీలక నేతల పేర్లతో కూడిన షార్ట్‌లిస్ట్‌ను ఢిల్లీకి పంపినట్లు ప్రచారం జరుగుతోంది.ఈ తుది జాబితాలో ప్రస్తుత అధ్యక్షుడు శ్రీహరి రావు,జడ్పిటిసిల ఫారం కన్వీనర్ మాజీ కన్వీనర్ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి,గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ పేర్లు ఉన్నట్టు తెలుస్తోంది.నిర్మల్ జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవి తరచుగా ఓసీ సామాజిక వర్గానికే కేటాయిస్తున్నందున,ఈ సారి బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆ వర్గానికి చెందిన నేతలు పట్టుబడుతున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న నేపథ్యంలో,తమ డిమాండ్‌కు ప్రాధాన్యత దక్కుతుందని వారు ఆశిస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని,ఈసారి బీసీ వర్గానికి అవకాశం ఇస్తారా లేదా అనే అంశంపై రాష్ట్ర అధిష్ఠానం తీవ్రంగా చర్చిస్తోంది.ప్రస్తుతం నిర్మల్ డీసీసీ పీఠం కోసం



బీసీ వర్గానికి చెందిన ఖానాపూర్ లోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడి పేరు బలంగా వినిపిస్తోంది.డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న వారిలో జడ్పిటిసిల ఫారం కన్వీనర్ మాజీ కన్వీనర్ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తుంది.రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి కూడా తన పేరును పరిశీలించాలని కోరడం గమనార్హం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావు వంటి అగ్ర నాయకులపై జిల్లా నేతలు డీసీసీ పదవి కోసం తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు.ఉమ్మడి జిల్లాలోని మాజీ మంత్రులు,ప్రస్తుత మంత్రుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుని డీసీసీ అధ్యక్షుడి ఎంపిక చేసే విధంగా పార్టీ చర్యలు తీసుకుంటోంది.
జిల్లాలోని నిర్మల్,ఖానాపూర్,ముధోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతల మధ్య గ్రూపు విభేదాలు ఉండటం వల్ల,డీసీసీ అధ్యక్షుడి ఎంపిక పార్టీకి పెను సవాలుగా నిలవనుంది.ప్రస్తుత అధ్యక్షుడిని మార్చి కొత్త నాయకుడికి పగ్గాలు ఇవ్వడం దాదాపు ఖాయమైన నేపథ్యంలో,బీసీ వర్గానికి చెందిన నాయకుడిని ఎంపిక చేసి సామాజిక న్యాయం చేస్తారా,లేక వివాద రహిత సీనియర్ అనుభవజ్ఞుడికి పట్టం కట్టి పార్టీని బలోపేతం చేస్తారా అనే అంశంపై నే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నందున,జిల్లా కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.




## జాతీయస్థాయి బాలసాహిత్య పురస్కారానికి చింతల శ్రీనివాస్‌గుప్త ఎంపిక

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జాతీయస్థాయి బాలసాహిత్య పురస్కారానికి చింతల శ్రీనివాస్‌గుప్త ఎంపికయ్యారు.బోర్గాం(పి) పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న చింతల శ్రీనివాస్‌గుప్త విరివిగా సాహితీ సృజనలు చేస్తూ ప్రముఖ కవిగా, నాటక కర్తగా, పద్మ కవిగా, బాలసాహిత్య శిల్పిగా, చిత్రకారునిగా బహుళ రంగాల్లోరాణిస్తున్నారని వీరి సాహిత్య సేవల్నిగుర్తించి పెందోట పురస్కారం వరించిందని కొరవి గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ కవి కంకణాల రాజేశ్వర్ మంగళవారంవెల్లడించారు.ఈ సందర్భంగా కంకణాల రాజేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ చిగురింతల పుస్తకంలో 100 గేయాలున్నాయి, వృత్తి ఉపాధ్యాయుడైతే ప్రవృత్తి సాహితీ సృజన, సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీవాణి సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో పెందోట బాలసాహిత్య పీఠం అధ్యక్షులు పెందోట వెంకటేశ్వర్లు చింతల శ్రీనివాస్ గుప్తను జాతీయస్థాయి బాలసాహిత్య పురస్కారానికి ఎంపిక చేయటం జిల్లా కే గర్వంగా ఉందని ముమ్ముందు సాహిత్య రంగంలో అజరామరమైన సేవలందించాలని కంకణాల రాజేశ్వర్ మంగళవారం మీడియాతో తెలిపారు. 2025 కు గాను ఈ పురస్కారం లభించడం సర్వత్రా హర్షణీయమన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి: ఇన్‌చార్జి కలెక్టర్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలోని పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో ముష్టిపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంత వరకు ఎంత ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారో ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్, నీటి, విద్యుత్ సరఫరా వసతి కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన తేమ శాతం 17 వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సిరిసిల్ల తహసిల్దార్ మహేష్ కుమార్, మెప్మా ఎఒ మీర్జా ఫసహత్ అలీ బేగ్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్



**ప్రజాపక్షం/కొండపాక:** కొండపాక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు.రోగులకు అందిస్తున్న వైద్యసేవలను ఆమె స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆరోగ్య కేంద్రంలో అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్లను పరిశీలించి, ఈరోజు 50 మందికి పైగా రోగులు వైద్యం పొందినట్లు గుర్తించి మెడికల్ ఆఫీసర్, సిబ్బందిని ప్రశంసించారు.మెడికల్ ఆఫీసర్ పిహెచ్‌సిలో కొన్ని మైనర్ రిపేర్లు అవసరమని తెలపగా వాటిని వెంటనే వెరిఫై చేసి ఇంజనీరింగ్ శాఖ అధికారులతో అంచనా సిద్ధం చేయాలని కలెక్టర్ డిఎం అండ్‌హెచ్‌ఒకు ఫోన్ ద్వారా సూచించారు.తర్వాత ఆమె ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలోని ఆయుష్ సెంటర్ను కూడా సందర్శించి అక్కడి సేవలపై వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు సమీపంలో ఉన్న వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ కళాశాలను తనిఖీ చేసిన నోడల్ అధికారి



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా నోడల్ అధికారి డి. కల్పన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగాకళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ జిఎల్ఎన్ రావుతో కలిసి ప్రతి తరగతి గదికి తిరుగుతూ అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను పరిశీలించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో సిబ్బందితో మీటింగ్ ఏర్పాటు చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ..ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని చెప్పా రు. పాఠ్యాంశాలను సిలబస్ ప్రకారం పూర్తి చేసుకుంటూ విద్యార్థుల్లో పరీక్షల భయం లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ మంచి ఉత్తీర్ణత శాతం వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చా ర్జి ప్రిన్సిపాల్ జిఎల్ఎన్ రావుతో పాటు అధ్యాపకులు ఉన్నారు.

## జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మై భారత్ (మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ అఫైర్స్ ) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మరియు యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ పత్తిప్తాక963/2024 ఆధ్వర్యంలో పెద్దపల్లి ఐటిఐ కళాశాల మైదానంలో డిస్టిక్ లెవెల్ క్రీడా పోటీలు (టోర్నమెంట్) నిర్వహించడం జరుగుతుందనీ నిర్వాహకులు తెలిపారు.తేదీ 31/10/2025 నుండి 01/11/2025 వరకు నిర్వహించబడుతాయని, టోర్నమెంట్లో భాగంగా , వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ ,షార్ట్ పుట్ , బ్యాట్మెంటన్ , చెస్ , పైటోర్నమెంట్ నిర్వహిస్థామని, పోటీల్లో పాల్గొని క్రీడాకారుల వయసు 15–29 లోపు గల పురుషులు మరియు మహిళలు ముందుగానే రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా, రిజిస్ట్రేషన్ కొరకు ఆర్గనైజర్స్ రేషవేణి మహేష్: 7993604489 , రాకేష్ : 7780674425 ( వాలీబాల్)వేగోళం రిషి 9390559514(కబడ్డీ) కర్ణాకర్ రెడ్డి 9908133143లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

## అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం.. తప్పిన ప్రాణాపాయం



**ప్రజాపక్షం/చందుర్తి :**మండలం లోని వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారి పై మల్యాల కట్ట లింగంపేట గ్రామాల మధ్య మంగళవారం అర్ధ రాత్రి దాదాపు ఒంటిగంట ప్రాంతం లో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడం తో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాత్రి సమయం కావడం , వాహనాల లైట్ల వెలుతురు , పొగమంచు కారణంగా రోడ్డు సరిగా కనిపించక పోవడం తో ఎదురుగా వస్తున్న వాహనాలు ఢీ కొట్టి ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు.రుద్రంగి గ్రామానికి చెందిన కొందరు టాటా ఏసి వాహనం టీజి 23 7749 లో స్వర్ణగిరి యాత్ర ముగించుకొని ఇంటికి వస్తుండగా మండలం లోని మల్యాల కట్ట లింగంపేట గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న కారు ఏపి 29 బిజి 0568 ఢీకొట్టాయని ఈ ప్రమాదం లో ప్రాణాపాయం లేకపోయిన పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి అని అన్నారు. టాటా ఏసి డ్రైవర్ రాజు కు కాలు విరగగా పలువురు తీవ్ర గాయాల పాలయ్యారు.ప్రమాద విషయం తెలిసి అక్కడకు చేరుకున్న స్థానికులు సమాచారం అందిచండం తో రుద్రంగి , చందుర్తి మండలాల రెండు అంబులెన్స్ లు అక్కడికి చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అర్ధరాత్రి సమయం లో ఆపద అని తెలియగానే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది తోట నరేష్ , చాణక్య, గణేష్ నాయక్ లను పలువురు అభినందించారు.

## ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:**కరీంనగర్ లోని కొత్తపల్లిలో గల ఆల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థులు ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులను అభినందించి మా ట్లాడారు... క్రీడల ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నామని, వివిధ స్థాయిలలో ని ర్వహింపబడేటువంటి పోటీలకు ఎంపిక చేస్తున్నారని వారు తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో నిర్వహించినటువంటి ఎస్‌జిఎఫ్ జోనల్ స్థా యి అండర్ 14 చెస్ పోటీలలో శివన్, అండర్ 17 విభాగంలో పి.వి శ్వంత్, వి.అభిరామ్ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారని హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన సందర్భంగా వి జేతలకు పుష్పగుచ్ఛాలను అందజేసి రానున్న రోజుల్లో నిర్వహించేటువం టి రాష్ట్ర స్థాయి పోటీలను జయకేతనం ఎగురవేయాలని, జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్




**ప్రజాపక్షం/కొత్తపల్లి:**పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కొత్తపల్లి పోలీసుస్టేషన్ నందు విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు కరీంనగర్ సిపి గౌష్ ఆలం తెలిపారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనగా ఓపెన్ హౌస్ ద్వారా విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరు, విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ పరికరాలపై అవగాహన కల్పించారు. షీటీం, సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్, యాంటీ నార్కోటిక్ సెల్ విభాగాల స్టాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కొత్తపలి సిఐ బిల్లా కోటేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అటెండర్ అరెస్టు

### రిమాండ్‌కు తరలించిన పోలీసులు,కరీంనగర్ రూరల్ ఎసిపి విజయ్‌కుమార్ వెల్లడి

**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్/అటెండర్‌గా పనిచేస్తున్న మహ్మద్ యాకూబ్ పాషా(30)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ రూరల్ ఎసిపి విజయ్‌కుమార్ వెల్లడించారు. గంగాధర మండలంలో కొన్ని రోజులు పాఠశాలలో చదువుతున్న మైనర్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని, పాఠశాల వేడుకల్లో విద్యార్థినులతో ఫోటోలు దిగగా వాటిని మార్ఫింగ్ చేసి బెదిరించి పోస్ట్ చేశాడని ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు జిల్లా చైల్డ్ అండ్ మహిళా వెల్ఫేర్ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మండల విద్యాధికారి, ఎంపిడిఒలు పాఠశాలను సందర్శించారని తెలిపారు. ఈ సందర్భంగా బాధిత విద్యార్థినుల నుంచి సమగ్ర వివరాలు సేకరించారు. ఫిర్యాదులో పేర్కొన్న అభియోగాలు నిజమేనని అధికారుల కమిటీ విచారణలో తేలింది. కాగా సోమవారం సాయంత్రం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై బిఎన్ఎస్, పో క్సో, ఐటి చట్టాల్లోని కఠినమైన సెక్షన్లలో కేసు నమో దు చేయడం జరిగిందని తెలిపారు. కరీంనగర్ రూరల్ ఎసిపి జి.విజయ్‌కుమార్ ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. మైనర్లపై దాష్టీకానికి పాల్పడిన కేసు కావడంతో ఎసిపి వేగవంతంగా విచారణ చేపట్టారని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న కొందరు విద్యార్థినులపై లైంగిక దాడి చేసినట్లు ఎసిపి విజయ్ కుమార్ విచారణలో నిర్ధారణ అయ్యింద ని, దీంతో నిందితుడిని పట్టుకోవాలని గంగాధర్ ఎస్ఐ, సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నిందితుడు మహ్మద్ యాకూబ్ పాషాను కరీంనగర్‌లోని రేకుర్తి చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. నిందితుడిని వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు పర్చగా జ్యుడీషియల్ రిమాండ్ వి ధించడం జరిగిందని పేర్కొన్నారు. మైనర్ అమ్మాయిలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎ సిపి విజయ్ కుమార్ హెచ్చరించారు. పాఠశాల, కళాశాలలో చదివే విద్యార్థినులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మహిళలు వేధింపులు, లైంగిక దాడులకు గురయినట్లయితే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, బాధితుల వి వరాలు గోప్యంగా ఉంచబడతాయని వెల్లడించారు.

**ప్రధానోపాధ్యాయురాలు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్**

గంగాధర మండలంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్ ఎండి.యాకూబ్ పాషా బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో సంఘటనను ఉన్నతాధికారులకు నివేదించడం, వాస్తవాలు దా చడం, నిర్లక్ష్యం కారణంగా పాఠశాల గ్రేడ్2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు టి.కమలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్ యాకూబ్ పాషా లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణల నేపథ్యంలో వెంటనే జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముగ్గురు సభ్యుల అధికారుల బృందాన్ని విచారణకు ఆదేశించా రు. విచారించిన బృందం తమ నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పించింది. ప్రధానోపాధ్యాయురాలు కమల జరిగిన సంఘటనను దాచిపెట్టాల్సిందిగా పాఠశాల సిబ్బందిని బెదిరించారని, విద్యార్థుల భద్రతను ఆమె విస్మరించారని, జరిగిన సంఘటనను ఉన్నతాధికారులకు తెలియ జేయకుండా వాస్తవాలు దాచారని విచారణ కమిటీ తమ నివేదికలో వెల్లడించింది.ఉత్తర్వులుఅమలులో ఉన్నంత కాలం ప్రధానోపాధ్యాయురాలు కమలముందస్తు అ నుమతిలేకుండాహెడ్‌క్వార్టర్‌వదిలివెళ్లరాదనిఆదేశించారు.

**బాలికల భద్రత, గౌరవం పట్ల నిర్లక్ష్యాన్ని సహించబోము :తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై అటెండర్ చేసిన అనుచిత ప్రవర్తనను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తీవ్రంగా ఖండించారు. విద్యాసంస్థల్లో చదువుకునే బాలికల భద్రత, గౌరవం పట్ల నిర్లక్ష్యాన్ని ఏ రూపంలోనూ సహించబోమని ఆమె స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించేందుకు జిల్లా యంత్రాంగం కాలేజీలు, విద్యాసంస్థలు, హాస్టళ్లలో తనిఖీలు చేపట్టి భద్రతా చర్యలను మరింత బలోపేతంచేయాలనిఆదేశించారు.ఈకేసుపురోగతినిమహిళా కమిషన్ పర్యవేక్షిస్తామని, బాధిత విద్యార్థినులకు అన్నివిధాలాసహకారంఅందిస్తామనిచైర్మన్‌హామీఇచ్చారు.

### అవసరమైతే పోక్సో కేసు నమోదు చేయాలి: కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్ జిల్లాలోని ఓ పాఠశాలలో యా కూబ్ పాషా అనే అటెండర్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంలు లోతైన విచార ణ జరిపి నివేదిక తెప్పించుకున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పోక్సో కేసు కావడంతో విషయం బయటకు వస్తే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే ఉద్దేశ్యంతోనే ఈ విషయాన్ని బయటకు రానియ్యలేదన్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత పాఠశాల హెడ్‌మాస్టర్ నిర్లక్ష్యం ఉన్నట్లు తేలడంతో హెచ్ఎంను సైతం సస్పెండ్ చేశారన్నారు. ఒకవేళ లైంగిక వేధింపుల విషయంలో హెచ్ఎం, ఇతర సిబ్బంది పాత్ర పైనా విచారణ కొనసాగుతోందన్నారు. ఒకవేళ వారి పాత్ర సైతం ఉన్నట్లు తేలితే వారిపై పోక్సో కేసు నమోదు చేసేందుకు వెనుకాడొద్దని ఇప్పటికే కలెక్టర్, సిపిని కోరినట్లు తెలిపారు. మంగళవారం కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ చైల్డ్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో మీడియా ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రస్తావించగా పై విధంగా స్పందించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వంగర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని మీడియా ప్రస్తావించగా వంగర గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య దారుణమన్నారు.

## దివ్యాంగులకు సేవ చేయడం అభినందనీయం

### కలెక్టర్ పమేలా సత్పతి





**ప్రజాపక్షం/కరీంనగర్:**స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆద్వర్యంలో దివ్యాంగులకు సేవలు అందించడం అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆద్వర్యంలో తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి విద్యాశిక్షణ కేంద్రానికి నూతన బస్సు ప్రారంభోత్సవం జరిగింది. రూ.26 లక్షలతో శ్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఈ బస్సును అందజేసింది. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి బస్సును ప్రారంభించి మానసిక విద్యార్థులతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మానసిక వికలాంగుల పాఠశాలను, వృత్తి విద్యాకేంద్రాన్ని స్థాపించి ట్రస్ట్ సభ్యులు నిర్విరామంగా దశాబ్దాల పాటు సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ డిజిఎం సిహెచ్ వెంకటరెడ్డి, బోర్డు డైరెక్టర్ తిరుమల, ట్రస్ట్ వ్యవస్థాపకుడు బి.వెంకటయ్య, ఇతర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సందర్శన**

తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఇక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళావైద్య పరీక్షలను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ,ఒపి రిజిస్టర్‌ను పరిశీలించారు. గర్భిణీలకు 4 ఎఎన్‌సి వైద్య పరీక్షల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వారికి కచ్చితంగా నాలుగు ఎఎన్‌సి పరీక్షలు అయ్యేలా చూడాలని తెలిపారు. సాధారణ ప్రసవాల ప్రాధాన్యత పట్ల అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఉన్నారు

**సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం పరిశీలన**

ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో మహిలలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అలింకో సహకారంతో నిర్వహించిన దివ్యాంగులకు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించా రు. శిబిరానికి హాజరైన వారి వివరాలు, వైద్య పరీక్షల వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు.

## అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సైకిల్ ర్యాలీ

### ర్యాలీకి పెద్దపల్లి డిసిపి కరుణాకర్, గోదావరిఖని ఎసిపి రమేష్, మంథని సిఐ హాజరు



**ప్రజాపక్షం/ముత్తారం :** పోలీస్ అమరవీరులసంస్మరణ వారోత్సవాల సందర్భంగా పెద్దపద్ద జిల్లా ముత్తారం మండల ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సైకిల్ ర్యాలీ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దపల్లి డిసిపి కరుణాకర్,గోదావరిఖని ఎసిపి మడత రమేష్,మంథని సిఐ రాజు గౌడ్ ఈ సైకిల్ ర్యాలీ కి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సైకిల్ ర్యాలీ ఇద్లాపూర్ నుండి సర్వారం,లక్కారం, మచ్చు పేట మీదుగా రామగిరి పోలీస్ స్టేషన్ వరకు సాగింది.ఈ సందర్భంగా పెద్దపల్లి డి సి పి కరుణాకర్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మానియామని, ప్రతి ఒక్కరు వారి సేవలను స్మరించుకోవాలని అన్నారు. పోలీస్ అమరవీరులు దేశానికి చేసిన త్యాగాల గురించి ప్రజలందరికీ తెలియాలని ఉద్దేశంతోనే ఈ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం గోదావరిఖని ఎసిపి మడత రమేష్ మాట్లాడుతూ1959లో భారత్ చైనా సరిహద్దులో విధి నిర్వహణలో అమరులైన భారత పోలీసులను స్మరించుకుంటూ దానికి గుర్తుగా ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించుకుంటామని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సిఐ ప్రసాద్ రావు, ముత్తారం ఎస్ఐరవికుమార్, మంథని ఎస్ఐ సాగర్, కమాన్ పూర్ ఎస్ఐ ప్రసాద్, డబ్లు పిసి సౌజన్య, ప్రత్యూష, శ్వేత తో పాటు విద్యార్థులు, యువకులు, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నవంబర్ 1న హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ వెల్లడి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిజెగవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ తెలిపారు. సిద్దిపేట పట్టణ కేంద్రంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ధర్మం న్యాయం ముసుగులో ఎవరు అయినా చెడు చేస్తే వారికి చట్టాలు వర్తించవా ఆయన మండిపడ్డారు. సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి గవాయిపైన దాడి చేసిన వ్యక్తి పైన ఇంతవరకు ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. జార్ఖండ్‌లో ఒక జడ్జిపై న్యాయవాది వాగ్వాదం చేస్తే సుమోటోగా కేసు నమోదు చేశారు. అలాగే రౌడీ షీటర్ ను ఎన్కౌంటర్ చేస్తే సుమోటగా మానవహక్కుల కమిషన్ కేసు నమోదు చేసిందని, కానీసిజెపై దాడి చేస్తే కేసు నమోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి న్యాయవ్యవస్థలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లు అమలుకు నిర్ణయమ తీసుకున్నారని గుర్తు చేశారు. గతంలో ఎవరూఏ ప్రధాన న్యాయమూర్తి చేయని విధంగా తీర్పులు ఇచ్చారని, ఆ తీర్పులే దాడికి కారణమన్నారు. ప్రధాన న్యాయమూర్తి దళితుడు కాబట్టి కేసులు నమోదు చేయడం లేదని అగ్రవర్ణాలు అయి ఉంటే కేసు నమోదు చేసేవారుకాదా అని ప్రశ్నించారు. దాడికి ముందు సొంత రాష్ట్రంకు వెళితే అక్కడ ప్రభు త్వం ప్రోటో కాల్ కూడా ఇవ్వడం లేదని అప్పడే కేసు నమోదు చేస్తే ఇంత వరకు వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.దళిత జస్టిస్ పైన జరిగిన దాడిని ఖండిస్తూ నవంబర్ 1న దళితుల ఆత్మ గౌ రవ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీలో దళితులే కాకుండా కుల మతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలోనాయకులుముక్కపల్లి రాజు,యాదగిరి,పెర్కపర్శరాములు,రమేశ్‌ఉన్నారు.

## సిటిజన్ క్లబ్‌లో పోలీసుల సోదాలు



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** సిద్దిపేట పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పోలీసులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఎసిపి రవీందర్‌రెడ్డి, టాస్క్ ఫోర్స్ ఎసిపి రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం సాయంత్రం సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా 50 మంది పేకాట ఆడుతున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. సోదాలో 8ప్లే కార్డు సెట్‌లు, 6 స్కోర్ కార్డులు, 20 ప్లాస్టిక్ కాయిన్లు, 2 సెల్‌ఫోన్లు స్వాధినం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎసిపి హెచ్చరించారు.

# నాణ్యమైన పంట కొనుగోలు చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:**నాణ్యమైన పంటను పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో వానాకాలం పంట కొనుగోలుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , అదనపు కలెక్టర్ డి. వేణు తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఏ ప్రాంతంలో ఎప్పుడు వరి కోతల జరుగుతాయో షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా వరి కోతలు చేయవద్దని రైతులకు సూచించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైస్ మిల్లులకు ట్యాగ్ చేసుకోవాలని అన్నారు. 100 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఓపెన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేం ద్రం వద్ద గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు, తేమ యం త్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర సామాగ్రి అందుబాటులో పెట్టాలని, హమాలీల కొరత రాకుండా చూసుకోవాలని అన్నారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా కొ నుగోలు చేసిన ధాన్యం సంబంధిత ట్రక్ షీట్స్ ఎప్పటికప్పుడు జనరేట్ చేయాలని అన్నారు. ధాన్యం తేమ శాతం రాగానే 24 గంటలలో మిల్లులకు తరలించాలని, 48 గంటలో రైతులకు డబ్బులు జమ చేయాలని కలెక్టర్ తెలిపారు.నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు తరలించాలని, పెద్దపెల్లి జిల్లాకు చెందిన ధా న్యం కొనుగోలు చేసిన తర్వాత మాత్రమే రైస్ మిల్లుల వ ద్ద ఇ తర జిల్లాల ధాన్యం కేటాయింపు జరగాలని అ న్నారు. జిల్లాలో ఇప్పటి వర కు 2 సిసిఐ కేంద్రాలను ఓ పెన్ చే యడం జరిగిందని అ న్నారు. పత్తి రైతులు తేమ శాతం రాగానే కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బు కింగ్ చేసి మద్దతు ధరకు పత్తి ప ంట విక్రయించాలని తెలిపారు. క పాస్ కిసాన్ యాప్ పై పత్తి రైతులకు పూర్తి స్థాయిలో అ వగాహన కల్పించాలని అన్నారు.జిల్లాలో ఓదెల, శ్రీరాంపూర్ మండలాలో 596 ఎకరాల పరిధిలో మొక్కజొన్న పంట సాగు అవుతుందని, మార్క్ ఫెడ్ ద్వారా కొనుగో లు కేంద్రం ఏర్పాటు చేశామని, 14 శాతం తేమ రాగానే మొక్కజొన్న పంట మ ద్దతు ధర కొనుగోలు చేయాలని అన్నారు. నవంబర్ 7 లోపు కౌలు రైతులు, భూ సేకరణ చేసిన రైతులు పంట విక్రయం కోసం అవసరమైన సర్టిఫికెట్‌లను వ్యవసాయ విస్తరణ అధికారులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నవంబర్ 7 తర్వాత ఎటువ ంటి సర్టిఫికెట్ జారీ చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్ప ష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీ నివాస్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జి ల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, జిల్లా సహకార అధికా రి శ్రీమాల , సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

**అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి**

అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష విజిలెన్స్ వారోత్సవాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. అవినీతి అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడిరాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ , విజిలెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## రంజీ ట్రోఫీలో షమీ జోరు..



రంజీ ట్రోఫీలో భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ నిప్పులు చెరుగుతున్నాడు. తన ఫిట్‌నెస్‌పై వస్తున్న తప్పుడు వార్తలకు చెక్ పెడుతూ వికెట్ల వేట కొనసాగిస్తున్నాడీ స్పీడ్‌స్టర్. ఉత్తరాఖండ్‌పై ఏడు వికెట్లతో చెలరేగిన షమీ.. ఈసారి గుజరాత్‌పైనా విజృంభించాడు. చివరిరోజు ఐదు వికెట్లు తీసిన ఈ పేస్ గన్.. బెంగాల్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. రెండో ఇన్నింగ్స్‌లో విజయం దిశగా సాగుతున్న ప్రత్యర్థిని షమీ దెబ్బకొట్టగా.. పన్నెండేళ్ల తర్వాత బెంగాల్ జట్టు గుజరాత్‌పై విజయాన్ని చవిచూసింది. టీమిండియాకు మళ్లీ ఆడేందుకు ఎదురుచూస్తున్న షమీ.. రంజీ ట్రోఫీ రెండో రౌండ్‌లోనూ చెలరేగిపోతున్నాడు. ఉత్తరాఖండ్‌పై ఏడు వికెట్లు.. గుజరాత్‌పై ఐదు వికెట్లు తీసిన ఈ స్పీడ్‌స్టర్ సెలెక్టర్లకు సవాల్ విసురుతున్నాడు. సొంతగడ్డపై నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌కు స్క్వాడ ఎంపిక సమయంలో తన పేరును పరిశీలించాలని చెప్పకనే చెబుతున్నాడు. రెండో ఇన్నింగ్స్‌ను 214/8 వద్ద డిక్లేర్ చేసిన బెంగాల్‌కు గుజరాత్ షాకిచ్చేలా కనిపించింది.

**ఉర్విల్ పోరాడినా..**

బెంగాల్ నిర్దేశించిన 326 పరుగుల ఛేదనలో ఉర్విల్ పటేల్(109 నాటౌట్), జయమీత్ పటేల్(45)లు సెంచరీ భాగస్వామ్యంతో గుబులు రేపారు. అయితే.. నాలుగో రోజు రెండో సెషన్‌లో ఉర్విల్ రిటైర్డ్ హర్ట్ అయ్యాక షమీ చెలరేగిపోయాడు. వరుసగా వికెట్లు తీసి గుజరాత్ పతనాన్ని శాసించాడు. అతడి విజృంభణతో 153/3తో పటిష్ట స్థితిలో ఉన్న జట్టు 185 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లతో మెరిసిన షమీ.. రెండో ఇన్నింగ్స్‌తో ఐదు వికెట్లు తీసి బెంగాల్‌ను 141 పరుగుల తేడాతో గెలిపించాడు. ఇప్పటివరకూ అతడు రెండు మ్యాచుల్లో కలిపి పదిహేను వికెట్లు పడగొట్టడం విశేషం. వరుసగా రెండు విజయాలతో ఎలైట్ గ్రూప్ సీ పట్టికలో బెంగాల్ రెండో స్థానానికి దూసుకెళ్లింది.


## నేటి నుంచే సెమీస్ యుద్ధం




మహిళల వన్డే ప్రపంచ కప్‌లో కీలక మ్యాచ్‌లకు నేటితో తెరలేవనుంది. లీగ్ దశలో అదరగొట్టిన నాలుగు జట్లు ఇప్పుడు సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లు ఇప్పటికే మాజీ ఛాంపియన్లుకాగా.. భారత్, దక్షిణాఫ్రికా తొలి కప్ కోసం చకోర పక్షుల్లా నిరీక్షిస్తున్నాయి. నాకౌట్ దశలో తిరుగులేని ఆసీస్, ఇంగ్లీష్ జట్లకు చెక్ పెడితే తప్ప కొత్త విజేతను చూడలేం. అన్ని విభాగాల్లో దుర్భేద్యంగా ఉన్న ఈ రెండు జట్లకు టీమిండియా, సఫారీ టీమ్‌లు మట్టికరిపించాలంటే సర్వశక్తులు ఒడ్డాల్సిందే. ఒకరిద్దరి మీద ఆధారపడకుండా సమిష్టిగా రాణించడం తప్ప మరో దారి లేదు. వరల్డ్ కప్ అంటే చాలు.. ఆస్ట్రేలియా జట్టు ట్రోఫీని తన్నుకపోవడం పరిపాటి అయింది. పురుషుల జట్టు మాత్రమే కాదు ఆ దేశపు ఆడ సింహాలు కూడా రికార్డు స్థాయిలో కప్‌ను తన్నుకుపోయాయి. ఎక్కడ టోర్నీ జరిగినా విజేతలం మేమే అన్నట్టుగా ఆసీస్ (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022, ) ఎనిమిదిసార్లు, ఇంగ్లాండ్ జట్టు (1973, 1993, 2009, 2017) నాలుగుసార్లు ఛాంపియన్లు అయ్యాయి. ఈ రెండు జట్లను కాదని ఒకేఒకసారి 2000 సంవత్సరంలో న్యూజిలాండ్ విశ్వవిజేతగా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు పదమూడో సీజన్‌లోనూ అలీసా హేలీ సారథ్యంలోని కంగారూ టీమ్‌అజేయంగా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లి తొమ్మిదోసారి విజేతగా నిలవాలనే కసితో ఉంది.

మరోవైపు చివరి లీగ్ మ్యాచ్‌లో ఓటమి మినహా ఛాంపియన్ ఆటతో ఇంగ్లాండ్ సెమీస్ బెర్తు దక్కించుకుంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్, హీథర్ నైట్, అమీ జోన్స్ రాణిస్తుండగా.. స్పిన్నర్లు లిన్సే స్మిత్, డీన్స్, ఎకిల్‌స్టోన్ ఆ జట్టు విజయాల్లో కీలకం అవుతున్నారు. సెమీస్‌లోనూ విజయంతో ఐదో కప్ వేటకు మరింత చేరువవ్వాలనే పట్టుదలతో ఉంది ఇంగ్లాండ్ ఇక.. దక్షిణాఫ్రికా కథ వేరు. ఆరంభ పోరులోనే ఇంగ్లాండ్ బౌలర్లను ఎదుర్కోలేక 69 పరుగులకే ఆలౌటయ్యింది సఫారీ టీమ్. అయితే.. మ్యాచ్ అనంతరం 'మేము 69 ఆలౌట్ కన్నా ఎంతో మెరుగైన వాళ్లం' అని చెప్పిన కెప్టెన్ లారా వొల్వార్డ్ట్ ఊహించని విధంగా జట్టును సెమీస్ చేర్చింది. మిడిలార్డర్లలో చోలే ట్రయాన్, మరినే కాప్.. ఫినిషర్ డీక్లెర్క్ తుఫాన్ ఇన్నింగ్స్‌లకు తోడు.. స్పిన్నర్ మ్లాబా జోరుతో వరుసగా ఐదు విజయాలతో దర్జాగా నాకౌట్ పోరుకు అర్హత సాధించింది.

## కాంబినేషన్ల గురించి ఆలోచించం



ఆసియా కప్ ఛాంపియన్‌గా మొదటి టీ20 సిరీస్‌కు సన్నద్ధమవుతోంది టీమిండియా. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ కోల్పోయిన భారత జట్టు ఐదు మ్యాచ్‌ల పొట్టి సిరీస్‌ను పట్టేసేందుకు వ్యూహరచన చేస్తోంది. ఆసీస్‌పై కూడా ముగ్గురు స్పిన్నర్ల వ్యూహాన్నే అమలు చేయనుంది. నేడు తొలి టీ20 జరుగునున్నందున కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ కాంబినేషన్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఆస్ట్రేలియా అంటేనే పేస్, బౌన్సీ పిచ్‌లకు పెట్టింది పేరు. అందుకే.. కంగారూ టీమ్‌ను ఓడించాలంటే పేస్ బలం ఎంతో ముఖ్యం. అయితే.. భారత్ మాత్రం ఈ ఫంథాను అనుసరించబోదు అంటున్నాడు సారథి సూర్య. బుధవారం తొలి మ్యాచ్ ఉన్నందున జట్టు కూర్పు ఎలా ఉండనుంది? అనే ప్రశ్నకు బదులిస్తూ.. పరిస్థితులను బట్టి కాంబినేషన్లు మార్చడం మా నైజం కాదని తేల్చిపారేశాడు మిస్టర్ 360. 'పరిస్థితులకు తగ్గట్టు అని చెప్పి భారత జట్టు కూర్పులో భారీగా మార్పులు చేయం. ఎందుకంటే బౌన్సీ పిచ్‌లున్న దక్షిణాఫ్రికా పర్యటనలోనూ ఒకే ఫాస్ట్ బౌలర్, ఒక ఆల్‌రౌండర్.. ముగ్గురు స్పిన్నర్లుతో బరిలోకి దిగాం. ఆసియాలో అయినా.. ఆసియా అవతల అయినా సరే మేము మ్యాచ్‌ల కోసం కాకుండా వరల్డ్ కప్ లక్ష్యంగా సాగుతున్నాం అని సూర్య వెల్లడించాడు. అంతేకాదు గెలుపే లక్ష్యంగా ఆడుతున్నప్పుడు కాంబినేషన్ల గురించి పట్టించుకోం. ఒక మ్యాచ్‌లో ఆడినవాళ్లు మరొక మ్యాచ్ దూరం కావచ్చు. కొన్నిసార్లు అదనపు స్పిన్నర్, అదనపు పేసర్, ఆల్‌రౌండర్.. ఇలా చిన్నపాటి మార్పులు చేయాల్సి వస్తుంది. అలా అనీ తమను పక్కన పెట్టేశారని స్క్వాడ్‌లోని ఏ ఒక్కరూ బాధపడరు. ఇప్పుడు భారత ఆటగాళ్లు ఆ మానసిక పరిపక్వతకు వచ్చేశారు' అని సూర్య తెలిపాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి టీ20 జరుగనుంది. దాంతో.. తుది జట్టులో ఉండేది ఎవరు? అనే చర్చ జోరుగా జరుగుతోంది. ఆసియా కప్‌లో దంచేసిన ఓపెనర్ అభిషేక్ శర్మకు తోడుగా శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్ ఆరంభించే అవకాశముంది. మిడిలార్డర్‌లో సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, సంజూ శాంసన్ ఉండే అవకాశముంది. ఇక వన్డే సిరీస్‌లో ఆడని బుమ్రా రాకతో బౌలింగ్ దళం పటిష్టం కానుంది. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ తిప్పేసేందుకు రెడీగా ఉన్నారు. ఆల్‌రౌండర్ కోటాలో నితీశ్ రెడ్డి లేదా ఆసియా కప్‌లో మెరిసిన శివం దూబేలో ఒకరికి అవకాశం దక్కనుంది.

# ఫోకస్

# మహిళ

## ఆక్రిలిక్ గోళ్లతో ప్రమాదం!

గోళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు నెయిల్ పాలిష్ వేసుకోవడం పాత విధానం. ఆక్రిలిక్ (కృత్రిమ) గోళ్లు ధరించడం నేటి కొత్త ఫ్యాషన్. అయితే, వీటిని ఉపయోగించడం వల్ల దీర్ఘకాల అనారోగ్యం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా బ్రిటన్‌కు చెందిన 35 ఏళ్ల మహిళకు కేన్సర్ నిర్ధారణ కావడాన్ని పేర్కొంటున్నారు. తాజా నివేదికను అనుసరించి, గోళ్ల సుందరీకరణలో వినియోగించే రసాయనాలపై చాలా మంది మహిళలకు సరైన అవగాహన లేదు. గోళ్ల రంగుతో ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటుండగా, ఆక్రిలిక్ గోళ్లు మరింత సమస్యాత్మకంగా మారుతున్నాయి. వీటిలో ఉపయోగించిన మెథాక్రిలేట్స్ అనే రసాయన పదార్థాలు చర్మంపై దురద, అలర్జీ వంటి సమస్యలను కలిగించవచ్చు. చాలా అరుదుగా ఇవి మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ఇది నేరుగా కేన్సర్‌కు దారితీస్తుందని చెప్పలేకపోయినా, బ్రిటిష్ మహిళ ఉదంతం కొత్త అనుమానాలకు తావిస్తున్నది. యువి క్యూరింగ్ లాంప్‌లు, గోళ్లను అతికించుకోవడానికి ఉపయోగించిన జిగురు పదార్థాలు తరచు ఉపయోగించడం వల్ల చర్మం దెబ్బతినే అవకాశం ఉంది. ఆక్రిలిక్ గోళ్ల వల్ల చర్మ కేన్సర్ వస్తుందని శాస్త్రీయంగా నిరూపించలేకపోయినప్పటికీ, జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. గోళ్ల సంరక్షణలో శుభ్రతను కాపాడడం, గోళ్లను కొంతకాలం సహజస్థితిలో ఉంచడం వంటి చర్యలను సిఫారసు చేస్తున్నారు. జెల్‌ఫ్రీ మానిక్యూర్‌లు లేదా వృక్ష ఆధారిత ఉత్పత్తులు వంటి విషరహిత (నాన్ టాక్సిక్) ప్రత్యామ్నాయాలను ఎంచుకోవచ్చని అంటున్నారు. తరచు చర్మ పరీక్షలు చేయించుకోవడం, ఏవైనా అసాధారణ మార్పులు కనిపించినప్పుడు వెంటనే చర్మ వైద్యుడు (డెర్మిటాలజిస్ట్)ను సంప్రదించడం అత్యవసరం. బ్రిటిష్ మహిళ ఘటన సౌందర్య పరిరక్షణలో ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా పరిగణించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. అందం, ఆరోగ్యం రెండింటినీ సమతుల్యంగా ఉంచే జాగ్రత్తపూర్వక నిర్ణయాలను తీసుకోవడం అత్యంత అవసరం.




## పరిశోధనల్లో మేటి సంధ్య షెనాయ్



విజ్ఞానాన్ని, దృఢ సంకల్పాన్ని, సామాజిక బాధ్యతను ఒకటిగా చేసి, పరిశోధనలు సాగిస్తున్న సంధ్య షెనాయ్ ప్రపంచంలోనే మేటి ఆవిష్కర్తల్లో ఒకరుగా నిలుస్తున్నారు. వృథా అవుతున్న ఉష్ణం నుంచి విద్యుత్ శక్తిని తయారు చేసే ప్రక్రియను అభివృద్ధి చేసినప్పుడు, ఆమె ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు. మంగళూరులోని శ్రీనివాస్ విశ్వవిద్యాలయం, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో అధ్యాపకురాలిగా, పరిశోధకురాలిగా విశిష్ట సేవలు అందిస్తున్న సంధ్యకు ఇటీవలే సిఆర్ఎస్ పురస్కారం లభించింది. రసాయన శాస్త్రంలో అత్యుత్తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించి, విలక్షణమైన ఆవిష్కరణలు చేసిన వారి కి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులు అందచేస్తారు. సంధ్య ఒకవైపు వృథా అవుతున్న ఉష్ణాన్ని విద్యుత్‌గా మారుస్తూనే, మరోవైపు పర్యావరణ పరిరక్షణకు తనవింతు కృషి చేస్తున్నారు. వృథా అవుతున్న ఉష్ణాన్ని ఆమె థర్మోయులెక్ట్రిక్ పదార్థాలతో విద్యుత్తును సృష్టించడం రసాయన రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నది. ఈ ఆవిష్కరణతోనే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తల్లో, మొదటి రెండు శాతం మందిలో ఆమె పేరు చేరింది. థర్మోఎలక్ట్రికల్ మెటీరియల్, ఫొటోకెటాలిసిస్, నానో మెటీరియర్ సిస్టమ్స్‌పై ఆమె విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. మహిళా లోకానికి మార్గదర్శకురాలిగా నిలుస్తున్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని పరిశోధనలు, ఆవిష్కరణలతో భారత కీర్తి పతకాన్ని రెపరెపలాడిస్తారని ఆశిద్దాం.

## రోజుకు ఆరు ఖర్జూరాలు

గర్భిణులు ప్రసవానికి ముందు కనీసం నాలుగు వారాల పాటు, రోజుకు ఆరు చొప్పున ఖర్జూరాలు తినడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంటది. తాజా పరిశోధనలను అనుసరించి, ఈ విధంగా చేసిన మహిళలు ఆసుపత్రిలో చేరినప్పుడు, ప్రసవ సంబంధమైన సమస్యలు 77 శాతం తగ్గాయి. సిజేరియన్ అవసరం 42 శాతం తగ్గింది. ఖర్జూరాల్లో సహజంగా ఉండే రసాయనాలు గర్భాశయ పనితీరును మెరుగుపరచడం, గర్భద్వారాన్ని సిద్ధం చేయడం ద్వారా ప్రసవాన్ని సులభతరంగా, తక్కువ నొప్పితో జరగించడంలో సహాయపడతాయి. ఈ సహజ పద్ధతి గర్భిణి శరీరానికి ప్రసవానికి తగిన విధంగా సిద్ధంగా ఉండేందుకు సహకరిస్తుంది. అలాగే, ఖర్జూరాలు ఫైబర్, కాల్షియం, యాంటీఆక్సిడెంట్స్ వంటి ముఖ్య పోషకాలు సమృద్ధిగా కలిగి ఉండటం ద్వారా తల్లి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గర్భధారణ చివరి కొన్ని వారాల్లో వాటిని ఆహారంలో చేర్చడం ఒక చిన్న, సహజమైన, రుచికరమైన చర్యగా పరిగణించవచ్చు. అయితే, ప్రతి గర్భధారణ వేరువేరు తీరుల్లో ఉంటుంది కాబట్టి, ఆయా శరీర తత్వాన్ని బట్టి ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. ఇందుకు వైద్యులను సంప్రదించడం అత్యవసరం. తల్లీ శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే, వైద్యుల సూచనలను తప్పక పాటించాలి. ఖర్జూరాలను తినడం వంటి ప్రక్రియలు ఈ సాధారణ సహజ పద్ధతి గర్భిణులు ఆరోగ్యవంతమైన, సులభమైన ప్రసవ అనుభవం కోరుకునే వారికీ ఎంతో ఉపయోగకరం కావచ్చు. ఈ విధంగా ఖర్జూరాలు ప్రసవ సహాయకంగా కాకుండా, తల్లి శక్తిని పెంచే ఆహారంగా కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఒకవేళ వీటి వల్ల లాభం కనిపించకపోయినా, నష్టం మాత్రం ఉండదని నిపుణులు అంటున్నారు.



## రాజ్యాంగం కల్పించిన ఉపాధి హక్కును కాలరాస్తున్న పాలకులు

### కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచి పెట్టిన మోదీ

### ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భారత రాజ్యాంగం కల్పించిన ఉద్యోగ, ఉపాధి హక్కును కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులపై ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం భువనగిరిలోని కార్యాలయంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన జరిగింది. ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచి పెట్టిన చరిత్ర మోదీ ప్రభుత్వానిదేనన్నారు. ఎల్ఐసి సొమ్మును ఆదానికి ధారాదత్తం చేసిన బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరమని వారు ఆరోపించారు. పేద ప్రజలు ఎల్ఐసికి రూ.33 వేల కోట్లు డిపాజిట్ చేస్తే అదానీ కంపెనీ సంక్షోభంలో ఉన్నదని వారిని ఆదుకోవడం కోసం ఎల్ఐసి వద్ద వేల కోట్ల పేద ప్రజల డబ్బులు అదానీ కంపెనీకి ఇవ్వడం మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానం అర్థం అవుతుందని అన్నారు. మోదీ ప్రభుత్వానికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను మూస్తూ, కార్పొరేట్‌లకు రెడ్ కార్పెట్ ఎందుకు వేస్తున్నాడో స్పష్టం చేయాలన్నారు. అందుకే ఎఐవైఎఫ్ జాతీయ స్థాయిలో యువజనులు, పౌరుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. అలాగే సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతి, అక్రమాలపై యువత నిరంతరం పోరాటాలు చేయాలని కోరారు. 100 సంవత్సరాల సిపిఐ త్యాగాలను యువతలోకి తీసుకెళ్లి, సమ సమాజ స్థాపనే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ మాట్లాడారు. జిల్లాలో ఉపాధి కల్పన కేంద్రాలు నామమాత్రంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఉపాధికి అవసరమయ్యే నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలపై సర్వేలు నిర్వహిస్తామని తెలిపారు. ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, జిల్లా సమితి సభ్యులు ఎండీ.నయీమ్, బద్ధుల శ్రీనివాస్, సుద్దాల సాయికుమార్, బెల్లి శ్రీకాంత్, నర్సింహాచారి, అలంశెట్టి వెంకటేష్, విజయ్, భాను కృష్ణ, కంబాల వెంకటేష్, తోటకూరిశ్రీకాంత్, అనంతుల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## 31న డిఇఓ కార్యాలయం ముట్టడి

**ప్రజాపక్షం/ములుగు:** ఈ నెల 31వ తేదీన జరిగే డిఈఓ కార్యాలయాన్ని ముట్టడిని జయప్రదం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. మధ్యాహ్నభోజనవంట కార్మికుల సమస్యలపై 31న జరిగే ధర్నాకు సంబంధించిన వినతిపత్రాన్ని జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి సిద్దార్థరెడ్డికి మంగళవారం అందించారు.మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడారు. వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు, అల్పాహారం బిల్లులు, తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉంటే వంటలు ఎలా చేస్తారన్నారు.పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు.సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నాల రాజకుమారి, మాలగాని కమలక్క, పౌరరాధ, రేవూరి రాజేందర్‌ఉన్నారు.

## కార్పొరేట్ శక్తుల నుండి చేతివృత్తులను కాపాడాలి

### ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** నాయి బ్రాహ్మణ సంక్షేమ భవన నిర్మాణం కోసం కృషి చేయనున్నట్లుఎంఎల్ఏకూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శేషగిరి భవన్‌లో నాయిబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా మహాసభ ఉత్సాహంగా జరిగింది.ముఖ్య అతిథిగా కూనంనేని మాట్లాడారు. ఎంఎల్ఏ అభివృద్ధి నిధుల్లో నుండి రూ.25 లక్షలు నాయిబ్రాహ్మణ సేవా సంఘం భవనం కోసం కేటాయించినట్లు చెప్పారు. తరతరాలుగా చేతి వృత్తులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారి బ్రతుకులపై కార్పొరేట్ కత్తి నాట్యం చేస్తుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు చేతి వృత్తుల్లోనికి ప్రవేశించి విపరీతమైన హంగులతో మార్కెట్లోకి వచ్చి వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయని మండిపడ్డారు. సామాన్య వృత్తిదారుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అదాని, అంబానీ వంటి బడా వ్యాపార వేత్తలు మంగలి వృత్తిని హైజాగ్ చేస్తూ నాయి బ్రాహ్మణులను రోజువారీ కూలీలుగా వారి సెలూన్లలో పనికిపెట్టుకుంటున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. దీనిని తప్పికొట్టేందుకు నాయిబ్రాహ్మణులంతా ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. మరో ప్రక్క నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పోరాటాలు నిర్వహించాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూముల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్పోరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ను ఎంపిక చేయడంతో పాటు జిల్లాకు ఒక డైరెక్టర్‌చొప్పున నియమించాలని, రూ.200 కోట్ల నిధిని ప్రకటించాలని, విద్యుత్ బిల్లుల వేదింపులు ఆగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొమరవెల్లి రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు సదానందం, నాగేశ్వరరావు, లక్ష్మణ్, రవీంధర్, నర్సింహారావు,దుర్గయ్య, వెంకటేశ్వరరావు, మణికుమార్, వెంకన్న శంకర్, శాంతారావు, వినోద్, వెంకట్రావు, శ్రీరాములు, ఉదయ్ పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని ఉపాధిని మెరుగు పరుచుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మోటారు రంగ మెకానికులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని ఉపాధిని మెరుగు పరుచుకోవాలని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. స్థానిక శేషగిరి భవన్‌లో మంగళవారం జరిగిన ఎఐటియుసి అనుబంధ మోటార్ మెకానిక్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మెకానిక్ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మెకానిక్ రంగానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని, పనిముట్లు కొనుగోలు చేసుకునేందుకు వంద శాతం సబ్సిడితో రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎఐటియుసి గుర్తింపు కార్డులను అందజేశారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్, యూనియన్ నాయకులు ఎండి గౌస్, ఎస్కే అక్బర్, అన్వర్, కృష్ణ,, శ్రీనివాస రెడ్డి, రాజ్, తాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సిపిఐది నిరంతర పోరాటం

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 30న హుజూర్‌నగర్‌లో జరిగే జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అగ్రభాగాన పోరాడి ప్రాణత్యాగాలు చేసి అనేక ప్రజా సంఘాలు నిర్మించి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసిన పార్టీ సిపిఐ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడి త్యాగాలు చేసిన పార్టీ ఈ దేశంలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని ముగింపు సభ ఖమ్మంలో డిసెంబర్ 26న ఐదు లక్షల మందితో ఈ సభ నిర్వహించబోతుందని ఇది చరిత్రలో నిలిచిపోయే విధంగా జరపనున్నట్లు తెలిపారు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వర్షాలతో వరి పంట పడిపోవడంతోపాటు రైతులు నష్టపోయారని రైతులలో సన్న, చిన్న కారు రైతులు, కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలో జరగబోవు జిల్లా స్థాయి మండల, పట్టణ కౌన్సిల్ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, పట్టణ కమిటి సభ్యులు దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, గాలి కృష్ణ, చిట్టిప్రోలు కోటయ్య పాల్గొన్నారు.

## మొంతా తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొమ్ముభరత్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మొంథా తుఫాన్‌కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని సిపిఐజిల్లాకార్యవర్గ సభ్యులు కొమ్ముభరత్ డిమాండ్‌చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారిభవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా అకాలవర్షాలకారణంగా రైతులు ఆరుగాలం పండించిన పంటచేతికొచ్చేదశలో అతివృష్టి అనావృష్టితో నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇటీవలకాలంలో అకాలవర్షాలు కురుస్తుండటంతో అనేకమంది రైతులు పంటపొలాలు నేలకు పడిపోవడం, పత్తిచేనుమీదనే మొలకలు మొలవడం జరిగిందన్నారు. వడ్డీలకు తెచ్చి పెట్టుబడిపెట్టి కౌలుతీసుకున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వంద్వారా పత్తిని కొనుగోలుచేసి తేమశాతాన్ని 20శాతానికి పెంచాల్సిందిగా, అదేవిధంగా పత్తి క్వింటాల్‌కు రూ.15వేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. అగ్రికల్చర్ ఆఫీసర్స్‌ద్వారా సర్వేచేయించి కచ్చితంగా రైతులను ఆదుకునేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐజిల్లా కౌన్సిల్‌సభ్యులు పి.కృష్ణాజి, ఎఐటియూసి జిల్లా ప్రధానకార్యదర్శి శివశంకర్, సిపిఐపార్టీ జిల్లాకౌన్సిల్ సభ్యులు పెరుమాలగోపాల్, ఎస్‌కె.ఖాజామైనోద్దీన్ పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించరూ..

### భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌లు త్వరితగతంగా పూర్తి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డిసిఎల్ కార్మి క శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాజంగుల రాజు మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన కార్మికుడికి శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ ఫలాలు అందజేయాలన్నారు. అడ్డాల వద్ద షెల్టర్లు నిర్మించాలని అన్నారు. సాధారణ మరణానికి ఐదు లక్షలు, యాక్సిడెంట్‌కు పది లక్షల ఇవ్వాలన్నారు. సిఎస్‌సి సెంటర్లను రద్దు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కీర్తి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బదర్ చౌష్, ఉపాధ్యక్షులు మహేందర్, నాగోరావు పాల్గొన్నారు.





## డిప్లొమా కోర్సులకు దరఖాస్తు గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** డిప్లొమా కోర్సులకు దరఖాస్తు గడువు నవంబర్ 27 వరకు పొడిగించడం జరిగిందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల నందు డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ రెండు సంవత్సరాల వ్యవధి గల కోర్సులలో 30 చొప్పున సీట్లు ఉన్నాయని ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన విద్యార్థుల్లో మొదటి ప్రాధాన్యత బైపిసి విద్యార్థులకు ఉంటుందని తర్వాత ఎంపిసి ఇతర విద్యార్థులకు తదుపరి ప్రాధాన్యతనిస్తామన్నారు. అభ్యర్థులు ముందుగా https://tspmb.telangana.gov.in నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకుని అవసరమైన ధృవపత్రాలతో కలిపి నవంబర్ 27 సాయంత్రం ఐదు గంటల లోపు ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం https://gmc.khammam.org వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

# అంతరాయం లేని విద్యుత్ సరఫరానే లక్ష్యం

### డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క





**ప్రజాపక్షం/ మధిర :** భారీ వర్షాలు, తుఫాన్ సమయంలో కూడా మధిర పట్టణంలో ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించటమే లక్ష్యంగా భూగర్భ విద్యుత్ కేబుల్ నిర్మాణం చేపట్టనున్నట్లు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మధిర పట్టణంలో పర్యటించిన ఆయన రూ.27.76 కోట్ల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మడుపల్లిలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు, రాయపట్నం గ్రామంలో 33/11 కెవి నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తెలంగాణ రైజింగ్ 2047లక్ష్యం నెరవేరాలంటే విద్యుత్‌శాఖ చాలా కీలకమని, ప్రతి రంగ అభివృద్ధికి నాణ్యమైన విద్యుత్ సరఫరా కీలకమని అన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలని పాలసీలను రూపొందించుకుని ప్రభుత్వం సీరియస్‌గా పనిచేస్తుందని తెలిపారు. మధిర పట్టణ ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని లక్ష్యంతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని అన్నారు. మధిర పట్టణ పరిధిలో ముందస్తుగా రూ.27.76కోట్లు ఖర్చు చేస్తూ 3.5కిమీ 33 కెవిలైన్, 17.3కిలోమీటర్ల 11 కెవి లైన్, 15 కిలో మీటర్లు ఎల్‌టి లైన్ భూగర్భంలో వేదయం జరుగుతుందని తెలిపారు. మధిర సబ్‌స్టేషన్ నుంచి ఆత్కూరు రింగ్ రోడ్డు, విజయవాడ రోడ్డులోని హెచ్‌పి గ్యాస్ గౌడోన్‌కు రెండు వైపులా, వైయస్సార్ విగ్రహం నుండి అంబారుపేట చెరువు వరకు ప్రస్తుత 11కెవి ఓవర్ హెడ్ లైన్లను భూగర్భంలో మార్చేందుకు ప్రతిపాదించామని, నందిగామ బైపాస్ రోడ్డు హెచ్‌పి పెట్రోల్ బంక్ నుండి డంప్ యార్డ్ వరకు భూగర్భ విద్యుత్ లైన్ పనులు ప్రతిపాదించామని అన్నారు. భూగర్భ విద్యుత్ లైన్లు వేయడం వల్ల మధిర పట్టణంలో వైర్లు వేలాడకుండా అందంగా కనపడుతుందని, కాలుష్యం, విద్యుత్ ప్రమాదాలు తగ్గుతాయని, రోడ్ల పక్కన మంచి చెట్లు పెంచుకోవచ్చునని అన్నారు. భారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో కూడా మధిర పట్టణంలోని ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన తెలిపారు. విద్యుత్ అంబులెన్స్‌లను ట్రాన్స్‌ఫార్మర్‌తో సహా అసరమైన సామాగ్రి, టెక్నీషియన్స్‌తో ఏర్పాటు చేశామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కనీసం ఒక విద్యుత్ అంబులెన్స్ అందుబాటులో ఉండాలని అన్నారు. ఇందిరాగిరి వికాసం కింద సోలార్ పంప్ సెట్ల ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎన్పీడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, రాష్ట్ర హస్తకళల సంస్థ అభివృద్ధి చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎన్పీడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాసాచారి, ఆర్అండ్‌బి ఇఇ తానేశ్వర్, వివిధ శాఖల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## భయపెడుతున్న మొంతా తుఫాన్

### అప్రమత్తమైన అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలను భయపెడుతుంది. మంగళవారం రాత్రికి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఇప్పటికే అడపా దడపా చినుకులు చిరుజల్లులు పడుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచే బలమైన గాలులు వీస్తున్నాయి. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అతివృష్టితో నష్టపోయిన రైతాంగానికి ఇప్పుడు తుఫాన్ రాక మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది. ఇప్పటికే పత్తి పై రైతులు ఆశలు వదులుకోగా ఇప్పుడు వరి సాగు చేసిన రైతులు కూడా నష్టపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కోతకు వచ్చిన భూములు నేలవాలి గింజలు రాలిపోతున్నాయి. మెట్ట పంటలు ఇప్పటికే నష్టపోగా తుఫాన్‌తో ఉద్యానవన పంటలు కూడా దెబ్బతినే అవకాశం ఉంది. తుఫాన్ హెచ్చరికలను పరిగణలోకి తీసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. పంటల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

## గ్రంథాలయానికి రూ.20 వేల విలువైన వస్తువులు వితరణ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.20 వేల విలువచేసే రెండు వస్తువులను ఇరువురు వ్యక్తులు మంగళవారం అందజేశారు. వివరాల ప్రకారం, జిల్లా గ్రందాలయంలో గ్రేడ్ 2 గ్రంథపాలకునిగా పనిచేసిన అమరేంద్ర కోటేశ్వరరావు రూ.5 వేల విలువ చేసే గ్లాస్ నోటీస్ బోర్డును, అదే విధంగా ఇదే గ్రంథాలయంలో చదువుకుని గ్రూప్ 2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి సెక్రటరేటియట్ లో విధులు నిర్వహిస్తున్న భూక్య రమేష్ రూ.15 వేల విలువ చేసే బోర్డును చైర్మన్ వీరబాబు చేతులకు అందించారు. అదే విధంగా ఇదే గ్రంథాలయంపై ఆధారపడి కష్టపడి చదువుకుని ఉద్యోగం సాధించిన రమేష్ తన వంతు సహకారాన్ని అందించడం గర్వకారణం అన్నారు. చైర్మన్ ఇరువురు వ్యక్తులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ప్రకటించారు. గ్రంధపాలకురాలు గుమ్మడి మణి మృదుల, యూత్ కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్, విశ్రాంత ఉద్యోగి అమరేంద్ర కోటేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంవీ,పాలెం, వరంగల్‌క్రాస్‌రోడ్డు, జలగంగగర్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌లను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి కట్ చేశారు. శీనన్నపై చూపించిన ఈ అభిమానం వెలకట్టలేనిదిన్నారు. పాలేరు ప్రజలకు ఆయన పెద్ద కొడుకుగా అండగా నిలుస్తున్నారన్నారు. ప్రజలిచ్చిన తోడ్పాటుతో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పయనింపచేస్తున్నారన్నారు. వెంకటగిరిలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరంను నిర్వహించారు. ఖమ్మంరూరల్ మండల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడప గడపకూ.. సిపిఐ ప్రచారం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య అన్నారు. మంగళవారం ఆళ్లపల్లి మండలంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు.కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలను డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకులు, అంతర్జాతీయ నాయకులు సుమారు 40దేశాల నుండి ఈ మీటింగ్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. మండలం నుండి భారీగా కార్యకర్తలు కదలి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సభకు సంబంధించిన జన సమీకరణ, నిధి వసూళ్ల లక్ష్యాలను, అదే విధంగా సభ్యత్వ నమోదు, చేర్పింపు లక్ష్యాలను పరి పూర్తి చేయడంతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి జీప్ జాతా కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా అన్ని మండల, గ్రామ కేంద్రాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు కొమరం హన్మంతరావు, మండల కార్యదర్శి ఎస్‌కె రహీం, వజ్జ పగడయ్య, సహాయ కార్యదర్శులు, మండల నాయకులు రేసు సురేందర్, కసనబోయిన నరేష్, వగలబోయిన రమేష్, తాళ్లపల్లి సాయన్న, తాళ్లపల్లి రమేష్, సుతారి కాంతారావు, తాళ్లపల్లి శ్రీను, వినయ్, ప్రభాకర్, రామయ్య, శ్రీను, పాల్గొన్నారు.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 2025 26 విద్యా సంవత్సరంలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు డిసెంబర్ 31 వరకు పొడిగించడం జరిగిందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి మహ్మద్ ముజాహిద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో చదువుతున్న అర్హులైన మైనార్టీ విద్యార్థి, విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్స్ తమ కళాశాలలోని విద్యార్థిని, విద్యార్థులందరూ అర్హతలను బట్టి ఉపకార వేతనాలను https://telanganaepass.cgg.gov.in వెబ్ సైట్‌లో డిసెంబర్ 31లోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి తెలిపారు.

## ఎఐటియుసి యూనియన్‌లో చేరికలు



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి ఆధ్వర్యంలో మంగళవారం ఫిట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్ మాట్లాడుతూ 83 సంవత్సరాల పోరాటాల చరిత్రగల ఏఐటియుసి సింగరేణి గని కార్మికుల గుండె చప్పుడు అని అన్నారు. కార్మికులను, కాంట్రాక్ట్ కార్మికులను, సర్వే డిపార్ట్మెంట్‌ను కలుసుకొని వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిందిగా కాలరీ మేనేజర్ ని కోరడం జరిగింది. అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ మేకల ఈశ్వరరావు, ఆఫీస్ బేరర్ ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, సెంట్రల్ కమిటీ మెంబర్ కామ్రేడ్ దాట్ల సందీప్ కుమార్, ఫిట్ కార్యదర్శి సాయి ప్రకాష్ చారి, సుధాకర్, రవి, కోటేశ్వరరావు, వివిఆర్ రెడ్డి, శంకర్, రంజాన్, సాంబశివరావు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి

### ఎంపిడిఒ యం.యర్రయ్య

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** సీజనల్ వ్యాధులు పట్ల అప్రమతంగా ఉండాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలంలోని రాజేశ్వరపురం ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం భవిత కేంద్రాలను మంగళవారం సందర్శించారు. సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధం పట్ల ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.వచ్చేగర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పౌష్టికాహారంను అందించాలని ఆదేశించారు.

## దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

### జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైకల్య నిర్ధారణ సదరం క్యాంపును కలెక్టర స్వయంగా పరిశీలించారు. వైద్య పరీక్షలు, ఆన్‌లైన్ దరఖాస్తుల ఎంట్రీ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. పరికరాల పనితీరును, అందుతున్న సేవలను సమీక్షించారు.ప్రభుత్వం అందిస్తున్న యూనిక్ డెసెబిలిటి ఐడెంటిటి (యుడిఐడి) కార్డులు తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కూడా గుర్తింపు పొందుతాయని చెప్పారు. ఈ కార్డు ద్వారా దివ్యాంగులు ఆరోగ్య, విద్య, ఉపాది, రవాణా వంటి రంగాల్లో కేంద్రప్రభుత్వం అథకాల ప్రయోజనాలకు సులభంగా పొందే అవకాశం ఉందన్నారు. ప్రతీ దివ్యాంగుడు సమాజంలో సమాన హక్కు, అవకాశాలు పొందేలా ప్రభుత్వం యంత్రాంగం సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా యూ డిఐడి కార్డుల కోసం దరఖాస్తు చేసిన దివ్యాంగులకు ఆస్పత్రిలో వైకల్య నిర్ధారణ కోసం సదరం స్లాట్ బుక్ చేయాలని, ముందుగానే దరఖాస్తుల దారులకు సమాచారం అందించి సమయానికి పరీక్షలు జరిగేలా చూడాలని ఆయన సూచించారు. వైద్య పరీక్షల సమయంలో అవసరమైన వైద్య నిపుణులు, పరీక్షా పరికరాలు, సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్యాంపు జరిగే ప్రదేశంలో దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొకుండా రిషెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ, తాగునీరు, టాయ్‌లెట్స్, ర్యాంప్, వీల్ చైయిర్ వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

## సిపిఐ పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దొండపాటి



**ప్రజాపక్షం/ కొణిజర్ల :** పేదల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం వందేళ్ల పోరాటం నేటి తరాలకు స్ఫూర్తి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్ తెలిపారు. మంగళవారం చిన్న గోపతి గ్రామంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్వాతంత్ర్యానికి ముందు తర్వాత అనేక చారిత్రిక పోరాటాలను సిపిఐ నిర్వహించిందన్నారు. లక్షలాది ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన ఘనత సిపిఐకి దక్కుతుందన్నారు. నేడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం పోరాటాలేనని పోరాట ప్రణాళికను రూపొందించుకుని మరింత ముందుకు సాగేందుకు ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని రమేష్ తెలిపారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంకటేశ్వర్లు, మండల నాయకులు శ్రీనివాసరావు, దేరంగుల లక్ష్మయ్య, నాగేశ్వరరావు, భద్రయ్య, పగడాల నర్సింహా పాల్గొన్నారు.

## శతాబ్ది ఉత్సవాలకు భారీగా తరలిరావాలి

### మండలంలో విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/పాల్వంచ :** డిసెంబర్ 26వ, తేదీన జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ శాతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఖమ్మం గుమ్మాన్ని ఎరుపెక్కించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ముత్యాల విశ్వనాధం పిలుపునిచ్చారు. మండలంలోని నగారం కాలని, రంగాపురం, కేశవాపురం, జగన్నాధపురం తదితర గ్రామాలలో శతాబ్ది ఉత్సవాల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలను పంచిపెట్టారు. సిపిఐ 100 సంవత్సరాల చరిత్ర, సాధించిన ఘన విజయాలను, ప్రజలకు అందించిన ఫలాలను గడప గడపకు తీసుకెళ్ళారు. అనంతరం ముత్యాల మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో 1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో ప్రారంభించటం జరిగిందన్నారు. ఎన్నో నిర్బంధాల నడుమ దేశంలో 100 సంవత్సరాలపాటు నిలబడిందన్నారు. మరో వందేండ్లయినా ఇదే ఉత్సాహంతో ప్రజల పక్షాన నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం రావాలని, కావాలని బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసింది, పిలుపునిచ్చింది కేవలం సిపిఐ పార్టీ మాత్రమేనన్నారు. దేశవ్యాప్తంగా కష్టజీవులు, శ్రమజీవులు తరపున నిలబడి కొట్లాడింది సిపిఐ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణాలో దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకం గా అనేక పోరాటాలు చేసి లక్షలాది ఎకరాల భూమిని రైతులకు పంచిపెట్టిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. శత జయంతి ముగింపు ఉత్సవాలకు సందర్భంగా డిసెంబర్ 26వ, తేదీన ఖమ్మంలో సుమారు 5 లక్షల మందితో భారీ జనసభ జరుగుతుందన్నారు. దీనికి జాతీయ నాయకులు, 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు. కనీవిని ఎరుగని రీతిలో జరిగే బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

## సిసిఐ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర :** సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మధిర డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజచంద్ర తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో పత్తి కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, కొనుగోలు కేంద్రానికి ఖచ్చితమైన 8 నుండి 12శాతం ఉన్న పత్తిని తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుతం అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తిని ఆరబెట్టుకోవాలని, కపాస్ కిసాన్ యాప్ నందు స్లాట్ బుక్ చేసుకుని నిర్ధేశించి సమయానికి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయశాఖ ద్వారా పంట నమోదు చేయబడిన రైతుల వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పొందుపర్చటం జరిగిందని, ఏమైనా ఫోన్ నెంబర్ తేడా ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారిని కలిసి సరి చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి కె.సాయిదీక్షిత్ పాల్గొన్నారు.

# రైతును ముంచిన అతివృష్టి..మరింత సంక్షోభంలో సాగు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యవసాయ రంగాన్ని ప్రకృతి పగబట్టినట్లుగా ఉంది. ఏదో ఒక రూపంలో వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తూనే ఉంది. అతివృష్టి లేదంటే అనావృష్టి పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుండగా ఈ ఏడాది అతివృష్టి రైతాంగాన్ని కోలుకోలేని విధంగా నష్టపరిచింది. ఈ ఏడాది ప్రారంభం నుండి వర్షం వెంటాడుతూనే ఉంది. అతివృష్టి కారణంగా పత్తి ఎదుగు బొదుగు లేకుండా పోగా సగానికి పైగా పల్లపు భూముల్లో గడ్డి పెరిగి రైతులు వదిలేశారు. ఇప్పటికే ఆ భూముల్లో రైతులు ఏ పంట వేయలేని స్థితి. మిగిలిన భూముల్లో నానా ఇబ్బందులు పడి సాకితే కాత, పూత సమయంలో ఎడ తెరిపి లేని వర్షాల కారణంగా కాయలు నల్లబారి పోయాయి. ఎకరాకు క్వింటా నుంచి మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి రావడం లేదు. పండిన పంట అమ్ముకోవడం మరింత ఇబ్బందిగా మారింది. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోళ్ల ప్రారంభించిన రైతులు మాత్రం సిసిఐకి అమ్ముకునే పరిస్థితి లేదు. యాప్ పేరుతో రకరకాల నిబంధనలను విధించడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. అతివృష్టి పత్తి రైతును కోలుకోలేని దెబ్బతీయగా అపరాలైన పెసలు, మినుములు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా అపరాల పంటలకు సంబంధించి పెట్టుబడుల సంగతి పక్కన పెడితే విత్తనం కూడా రాలేదు. మెట్ట పంటల పరిస్థితి ఇలా ఉంటే మొంథా తుఫాన్ వరి రైతులను ముంచే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం నుండి వెంటాడుతున్న వర్షం వరి కోతకు వచ్చిన వర్షం వీడటం లేదు. చాలా ప్రాంతాల్లో వరి కోతకు సిద్ధమైంది. ఈదురు గాలులకు వరి నేలకు ఒరిగింది. ఎత్తుకు పెరిగిన వరి చేలు గాలికి కదిలి వడ్లు రాలి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వరుసగా అతివృష్టితోనూ, అనావృష్టితోనూ పంటలు దెబ్బతింటూనే ఉన్నాయి. పాలకుల నుంచి సాగు రంగానికి అంతగా ప్రోత్సాహం లేకపోవడం, ప్రకృతి సహకరించకపోవడం,వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో వ్యవసాయ రంగం రోజు రోజుకుసంక్షోభంలోకి కూరుకుపోతుంది. రైతాంగం అప్పుల ఊబిలోకి కూరుకుపోయి సాగు అంటే భయపడే పరిస్థితి దాపురించింది. ఏ పంట పండుతుందో ఏ పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందో, వాతావరణం దేనికి అనుకూలంగా ఉంటుందో తెలియని స్థితి. గడిచిన దశాబ్ద కాలంలో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు విపరీతం గా పెరగడంతో పాటు డీజిల్, ట్రాక్టర్ ఇతర వ్యవసాయ యంత్రాల విడిభాగాల ధరలు పెరగడం కూడా పెట్టుబడుల పెరుగుదలకు కారణమైంది. పెట్టుబడుల ఆధారంగా వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరను నిర్ణయించాలన్న రైతాంగ డిమాండ్ నెరవేరడం లేదు. మోడీ పాలనలో సాగు రంగాన్ని సైతం కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర జరుగుతుంది. ఇప్పటికే వందల ఎకరాలతో భూకమతాలు ఏర్పడి పల్లెలపై పట్టు కోసం సంపన్న వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. వ్యవసాయంతో వస్తున్న వరస నష్టాల కారణంగా వ్యవసాయ రంగం నుంచి వైదొలిగి ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్తున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో యువ రైతులు కనిపించడం లేదు. నూటికి యాభై శాతం మందికి పైగా ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నిరుద్యోగ సమస్యకు కారణమవుతుంది. సాగు పరిరక్షణకు సంబంధించి సత్వర చర్యలు చేపట్టకపోతే దేశ భవిష్యత్తే ఇబ్బందికరంగా మారుతుంది.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## విజిలెన్స్ అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ



ప్రజాపక్షం/ములుగు: రాష్ట్రంలో ఈ నెల 27 నుండి నవంబర్ 2వ తేదీ వరకు వారం రోజుల పాటు చేపట్టిన విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు కలెక్టర్ టిఎస్ దివాకర విజిలెన్స్ అవగాహన పోస్టర్లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ జిల్లా అధికారులు, విజిలెన్స్ అధికారులు, ఉద్యోగస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. విజిలెన్స్ టోల్‌ఫ్రీ నెంబర్ 14432 ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ సోషల్ మీడియా అకౌంట్లను ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

## ఎంజిఎం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా హరీష్ చంద్రారెడ్డి నియామకం

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరీశ్ చంద్రా రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు డాక్టర్ హరీష్ చంద్రారెడ్డిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఎంజీఎం ఆసుపత్రిలో రోగులు ఇబ్బందులు పడుతున్న విషయాలపై మీడియాలో వరుస కథనాలు రాగా ప్రభుత్వం సీరియస్‌గా ఎంజీఎంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఒకే ఆక్సిజన్ సిలిండర్‌ను ఇద్దరు బాలురకు అమర్చిన విషయం పత్రికలలో వార్తగా ప్రచురితం అయింది. దీంతో వెంటనే ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకుని ఆయన స్థానంలో కొత్తగా హరీష్ చంద్రారెడ్డిని నియమించారు.

## హైనా దాడిలో గేదె పిల్ల మృతి



ప్రజాపక్షం/జఫర్‌గడ్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో హైనా దాడి చేయడంతో గేదె పిల్ల చనిపోవడం జరిగిందని ఎఫ్ఆర్‌వో కొండల్ రెడ్డి తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతు ఎర్రం నాగలక్ష్మి గేదెపై హైనా దాడి చేయడంతో చనిపోయిన గేదె పిల్లను, పరిసర ప్రాంతాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ బావుల వద్ద, పొలాల వద్ద రాత్రి వేళలలో గేదెలను, ఆవులను ఉంచొద్దని, ఇంటి వద్దకు తీసుకెళ్లాలన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, హైనాను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ జరీనా బేగం, బీట్ ఆఫీసర్ అంజయ్య, వాచర్ మోహన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లలో వేగం పెంచాలి



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: పన్ను వసూళ్లలో వేగం పెంచాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించి పన్ను వసూళ్ల పన్నుల వసూళ్ల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని పెండింగ్ పన్నులను సమయానుకూలంగా వసూలు చేయడం ద్వారా బల్దియా ఆర్థిక స్థితి బలపడుతుందని పేర్కొన్నారు. ప్రతి వార్డు పరిధిలో పన్ను చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించి 100 శాతం వసూళ్లను సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ఆస్తి పన్నుతో పాటు నీటి, ఇతర పన్నులను సేకరించాలని, అందుకు ఆర్ఓలు, ఆర్ఐలు నిత్యం పర్యవేక్షించాలని అన్నారు. నవంబర్ చివరి నాటికి కనీసం 45 శాతం పన్నులు వసూలు చేయాలని అన్నారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ పన్ను వసూళ్లలో పారదర్శకత, వేగం, సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పన్నుల లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్న సిబ్బందిపై చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్నరాణి, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్ఓలు శేహజాది బేగం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తులను ఇతరులకు ఇస్తే ఊరుకోం




ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి రమేష్

ప్రజాపక్షం/భూపాలపల్లి : సింగరేణి ఆస్తులను ఇతరులకు ఇస్తే ఊరుకునేది లేదని, ఆస్తులను ఇతరుల అవసరాలకు కాకుండా సింగరేణి కార్మికుల అవసరాల కోసం వినియోగించాలని సెక్రటరీ మోట పలుకుల రమేష్ అన్నారు. మంగళవారం భూపాలపల్లి ఏఐటీయూసీ కొమురయ్య భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో బస్టాండ్ వద్ద ఉన్న సింగరేణి కమ్యూనిటీ హాల్‌ను గతంలో ఎస్పి కార్యాలయాల అవసరాల రీత్యా ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం దాన్ని పోలీస్ వాళ్ల నుండి సింగరేణి తీసుకోవడం జరిగిందని దాన్ని మళ్ళీ కోర్టు అవసరాల కోసం ఇవ్వడం కోసం సరైనది కాదన్నారు. సింగరేణి కమ్యూనిటీ హాల్ కార్మికుల అవసరాల కోసం వినియోగించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. లేదంటే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సింగరేణి ఆస్తులను ఇతరుల అవసరాలకు ఇస్తే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా రమేష్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా, రాజ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంఘాలకు అండగా ఎఐటియుసి

ప్రజాపక్షం/లింగాలఘణపురం : కార్మిక సంఘాలకు, ఏఐటియూసి అనుబంధ సంఘాలకు అండగా ఉంటుందని జనగామ జిల్లా ఏఐయుటిసి, జిల్లా ఉపాధ్యక్షులు రావుల సదానందం ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం, మండలంలోని నెల్లుట్ల గ్రామంలో ఏఐటియూసి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రావుల సదానందం పాల్గొని మాట్లాడుతూ, 1920 అక్టోబర్ రోజున, 31న ఏఐటియూసి, ఏర్పడిందని, ఇప్పటివరకు 105 సంవత్సరాలు దాటి సంవత్సరాలు దాటి, అనేక పోరాటాల ద్వారా 44 కార్మిక చట్టాలను సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో, పేరబోయిన వీరస్వామి, బర్ల అంజయ్య, చీటూరీ రవి, మొటికె యాదగిరి, శ్రీనివాస్, కే.సత్తయ్య, పి.వెంకన్న, కే.శీను, పి సోమయ్య, బి.శ్రీశైలం, జి.శ్రీశైలం, డి.ఆంజనేయులు పాల్గొన్నారు.

# అందుబాటులో సరిపడా యూరియా

కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశం



ప్రజాపక్షం/జనగామ : జిల్లాలో రబీ సాగు సాఫీగా సాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. రబి సాగు నేపధ్యంలో విత్తనాలు, ఎరువులు, ప్రధానంగా యూరియా కొరత లేకుండా చూడడంపై వ్యవసాయ శాఖ అధికారులు, ఫర్టిలైజర్ యజమానులతో మంగళవారం సమావేశం నిర్వయించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి లక్షా 98వేల ఎకరాల్లో మొక్కజొన్న 21వేల 800 ఎకరాల్లో సాగవుతున్నందున సరిపడా విత్తనాలు, ఎరువులు ఉండాలన్నారు. రైతు వారిగా యూరియా అమ్మకాలపై పరిమితి విధించి అధిక కోనుగోల్లు నివారించాలని, రైతు రిజిస్టేషన్ నిర్వయించి ప్రతి రైతు తీసుకున్న ఎరువుల వివరాలు పర్యవేక్షించాలన్నారు. మండల, డివిజన్ వారిగా యూరియా కేటాయింపులు అవసరానుసారంగా నిర్ణయించాలని, ప్రైవేట్ డీలర్లకు కేటాయింపులు వారి పరిధిలో ఉన్న పంటల స్థితి గతుల ఆధారంగా ఇవ్వాల్నారు. బేసల్‌డోస్‌లో కాంప్లెక్స్ ఎరువులు వినియోగాన్ని ప్రోత్సహించి, సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కోత్త రేక్ పాయింట్ ఏర్పాటుపై చర్చిస్తూ, జిల్లాకు కొత్త రేక్ పాయింట్‌గా నాగిరెడ్డిపల్లి కేటాయించడం జరిగిందన్నారు. వరంగల్ రేక్ పాయింట్ చింతపల్లికి మారిన కారణంగా ఈ మార్పులు జరిగాయని, నాగిరెడ్డిపల్లి రేక్ పాయింట్‌లో త్వరిగతగిన ఇండెంట్లు సమర్పించి ఎరువులను జనగామ ఇజల్లాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనంగా రోడ్ మూమెంట్, ద్వారా యూరియా, సరఫరా చేసే అవకాశాలన్ని కూడా పరిశీలించి రైతులకు ఎరువులు కొరత లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, అసిస్టెంట్ డైరెక్టర్ ఫర్టిలైజర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

**విజిలెన్స్ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ**

ఈ నెల 27 నుండి వచ్చే నెల 2వ తేదీ వరకు వారం రోజుల పాటు చేపట్టే విజిలెన్స్ వారోత్సవాల వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆవిష్కరించారు. జిల్లా అధికారులు, ఉద్యోగస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. విజిలెన్స్ టోల్ ఫ్రీ నెంబర్ 14432, ఎక్స్, ఇన్స్టాగ్రామ్, సోషల్ మీడియా అకౌంట్లను ఉపయోగించుకోవాలని ప్రజలకు కోరారు.

# విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలి



ములుగు ఎస్పి డాక్టర్ శబరీష్

ప్రజాపక్షం/ములుగు : విధి నిర్వహణలో పోలీసు అధికారులు నిబద్ధతతో పక్షపాతం లేకుండా పని చేయాలని ములుగు ఎస్పి డాక్టర్ శబరీష్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్ పి ఐపిఎస్ నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. మొదటగా జిల్లా ఎస్పి అధికారులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతను కలిగి ఉండాలని, పక్షపాతం లేకుండా సమానత్వం పాటించాలని, బాధితులందరిని ఒకేవిధంగా చూడాలని అందరికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఫి కోర్టులో ట్రయల్‌లో ఉన్న కేసుల గురించి ఆరా తీసి ప్రతి కేసులోను తప్పని సరిగా సాక్షులకు, ముద్దాయిలకు సమన్లు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ నెలలో కేసుల వివరాలపై పోలీస్‌స్టేషన్‌ల వారీగా ఆరా తీసి, కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రతి కేసులలోనూ ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో ఫైల్ అప్‌డేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని అన్నారు. మహిళలపై జరిగే నేరాలలో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ వలలో పడి మోసపోకుండా పోలీస్‌స్టేషన్‌ల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా ఆన్‌లైన్ బెట్టింగ్‌ని ప్రోత్సహిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. యువత, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా సైబర్ క్రైమ్ నేరాలపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి శివం ఉపాధ్యాయ ఐపిఎస్, ములుగు డిఎస్పి రవీందర్, ఎస్‌బి ఇన్స్‌స్పెక్టర్ శంకర్, సిసిఎస్ ఇన్స్‌స్పెక్టర్ కుమార్, సిఐ ఏటూరునాగారం శ్రీనివాస్, సిఐ ములుగు సురేష్, వెంకటాపురం సిఐ రమేష్, పస్రా సిఐ దయాకర్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వరరావు, వెంకటాపూర్ ఎస్ఐ రాజు, పస్రా ఎస్ఐ కమలాకర్, తాడ్వాయి ఎస్ఐ శ్రీకాం త్ రెడ్డి, ఏటూరునాగారం ఎస్ఐ రాజ్ కుమార్, మంగపేట ఎస్ఐ సురేష్, కన్నాయిగూడెం ఎస్ఐ వెంకటేష్, వాజేడు ఎస్ఐ సతీష్, పేరూరు ఎస్ఐ కృష్ణ ప్రసాద్, వెంకటాపురం ఎస్ఐ తిరుపతి, డిసిఆర్‌బి ఎస్ఐ జగదీష్, ఐటి కోర్ టీం, డిసిఆర్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

# రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ




ప్రజాపక్షం/హనుమకొండ : మహిళలకు రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన ఎంతో అవసరం అని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ అన్నారు. మంగళవారం రెనోవా బన్ను క్యాన్సర్ హాస్పిటల్స్ నిర్వహించి "వాకథాన్"లో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తులకు పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిని ముందే గ్రహించగలిగితే, దాని నివారణ సులభతరం అవుతుందని, తద్వారా ప్రాణాపాయ స్థితి నుండి బయటపడవచ్చని తెలిపారు. సరైన అవగాహన లేక మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారని, భయం కన్నా ప్రాణం విలువైనదని తెలిపారు. క్యాన్సర్ చికిత్సలకు నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వైద్య సదుపాయాలతో క్యాన్సర్‌ను మొదటి దశలోనే ఆపడం సులభతరమని పేర్కొన్నారు. క్యాన్సర్ మహమ్మారి నుండి కోలుకున్న వారిని ఉదాహరణగా తీసుకొని ధైర్యంగా ఉండాలని తెలిపారు. క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండి, సరైన నియమ నిబంధనలు పాటిస్తే క్యాన్సర్‌ను ఎదుర్కొనవచ్చును అని తెలిపారు. రెగ్యులర్గా పరీక్షలు చేయించుకోవడం మనకి, మన కుటుంబానికి మనం ఇచ్చే గొప్ప బహుమతిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, వరంగల్ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వలుస.సుధీర్, రెనోవ బన్ను క్యాన్సర్ హాస్పిటల్ నుండి డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శివకుమార్, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ తరుణ్ రెడ్డి, డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ములుగు రోడ్డు నుండి హనుమకొండ చౌరస్తా వరకు ర్యాలీగా వాకతాన్ నిర్వహించారు.

# ప్రతీ కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ : ప్రతీ కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా పరకాల డైరీ ఏర్పాటు చేస్తున్నామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ భవానినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల మహిళా పాల ఉత్పత్తిదారుల సొసైటీ (డెయిరీ) సభ్యుల సమావేశాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సొసైటీ సేవలు అందించాలన్నదే తమ లక్ష్యమని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. పరకాల మహిళా డైరీ గురించి పూర్తిగా అవగాహన కల్పించిన తర్వాతే ప్రారంభిస్తామని అన్నారు. చట్ట ప్రకారం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం డెయిరీని ఏర్పాటు చేస్తేనే ప్రభుత్వం నుండి నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ సంస్థల నుండి సబ్సిడీ నిధులు రావాలంటే మన సభ్యత్వం, వాటాదనం, మూలధనం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మెజార్టీ కుటుంబాలను మన డెయిరీ సొసైటీలో చేర్పించుకోవాలని, మొదట పరకాల, నడికూడ మండల కేంద్రాలలో పాలసేకరణ జరుగుతుందని, సొసైటీ మెంబర్లకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు అందిస్తామన్నారు. గేదెల పెంపకం, పాల సేకరణ, దాన, పశుగ్రాసం, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కావున అందరూ డైరీ సొసైటీలో భాగస్వాములై, సొసైటీ పరిధిలో ఎక్కువ మహిళలను చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ డిఆర్‌డిఓ శ్రీనివాస్, మెప్మా అధికారులు, డిసిఒ అధికారులు, ఏపీఎంలు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లు నియమాలను తప్పనిసరిగా పాటించాలి

హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్.ఎ.అప్పయ్య



ప్రజాపక్షం/హనుమకొండ : పీసీ, పీఎన్డీటీ చట్టం నియమాలను డాక్టర్లు తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్.ఏ. అప్పయ్య అన్నారు. పీసీ, పీఎన్డీటీ జిల్లా స్థాయి అడ్వైసరీ కమిటీ సమావేశం మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో డాక్టర్. ఎ.అప్పయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ జిల్లాలో నిర్వహించిన తనిఖీలు, నోటిస్‌ల గురించి లింగ నిష్పత్తి గురించి వివరించారు. పీఎన్డీటీ, ఎంటీపీ చట్టం నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వ్యహరించాలని, నియమాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అన్ని అనుమతి పత్రాలను రిసెప్షన్ లో ప్రదర్శించాలని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డుల నిర్వహణ అనేది సంభందిత డాక్టర్లు పర్యవేక్షించాలన్నారు. చట్టం ఉల్లంఘిస్తున్న వారి వివరాలు అలాగే చట్ట విరుద్ధంగా లింగ నిర్ధారణ అబార్షణలు నిర్వహించే వారి గురించి అనుమతి లేని ఆసుపత్రులు, ఇళ్ళల్లో స్కానింగ్ మిషన్ వినియోగిస్తున్నారని అనుమానం ఉంటే 6300030940 కు ఫోన్ చేయాలన్నారు. ఆశాలు, ఏఎన్ఎంలు అంగన్వాడీ టీచర్లు అవగాహన కలిగించడంతో పాటు అప్పటికే ఆడబిడ్డ కలిగి ఉంటే ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవగాహన కార్యక్రమాలలో స్వచ్ఛంధ సంస్థలను భాగస్వాములుగా చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఏ.మంజుల, గైనకాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ నిర్మల, డాక్టర్. ఎవ్.కవిత, సభ్యులు పి.రేవతి దేవి, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈవో తాళ్లూరి లత, జిల్లా కోర్టు నుండి ఏ.నాగరాజు, డాన్ బోస్కో స్వచ్ఛంధ సంస్థ పి.శారద, ఈ.రాజు, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్ రెడ్డి, ఎస్ఓ ప్రసన్న కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్

ప్రజాపక్షం/మహబూబాబాద్: కన్యకా పరమేశ్వరి గుడి గుంజీ కార్మికుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ హామీ ఇచ్చారు. మంగళవారం గుంజీ కార్మికులతో కలిసి వారి సమస్యను సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి వివరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గత 30 ఏళ్లుగా గుంచి విలువ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న కార్మికుల గుంజీలను ఇటీవల కన్యకాపరమేశ్వరి గుడి వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగించడం జరిగిందని, వారికి ప్రత్యామ్నాయం చూపెట్టాలని కోరుతూ ఇటీవల ధర్నాలు చేసిన సందర్భంగా బాధితులను కలిసి ఎమ్మెల్యే డాక్టర్ బి.మురళి నాయక్‌ని కలవడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సార్ రెడ్డి ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న వీరి అడ్డాలు పోకుండా వారిని కాపాడాలని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని కమిషనర్‌తో మాట్లాడి ప్రత్యామ్నాయ స్థలం వద్దకు పర్యటించి వారి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుమ్చి వాసులు బోళ్ల భద్రయ్య, పాష ,యూసుఫ్ ,మోరే సత్తెమ్మ, ఎండి రహీం, హైమద్, పెరుగు కుమార్, దేశ పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, జలగం ప్రవీణ్, ఎండి మహమూద్, చిదిరాల జ్ఞానేశ్వర్, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, మంద శ్రీను, కూరాకుల పాల్ పాల్గొన్నారు.

## ఎంజెపి గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



పాఠశాల వసతుల గురించి ఆరా తీసిన కలెక్టర్

ప్రజాపక్షం/ఆత్మకూరు : హనుమకొండ జిల్లా గూడెప్పాడ్ వద్ద ఉన్న ఆత్మకూరు మండలం పెద్దాపూర్‌కు సంబంధించిన మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 8,9,10వ తరగతుల విద్యార్థినులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. వారి విద్యా ప్రగతిని, పాఠశాల వసతులను గురించి విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. అదేవిధంగా గురుకుల పాఠశాలలోని కిచెన్ షెడ్ ను పరిశీలించి వంట నిర్వాహకులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వరంగల్ రైల్వే స్టేషన్‌లో డ్రగ్స్ కంట్రోల్ టీమ్ తనిఖీలు




ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్‌లో డ్రగ్స్ కంట్రోల్ టీమ్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జాగిలాల సహాయంతో అనుమానిత వ్యక్తులు, వారి బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్స్పెక్టర్ సతీశ్ సూచించారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ శివ కేశవులు, ఆర్ఎస్ ఐలు పూర్ణ, మనోజ్, నాగరాజు తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి



ప్రజాపక్షం/పరకాల : నడికూడ మండలం రామకృష్ణాపురం గ్రామంలో పౌర సరఫరాల సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(ఐకెపి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.రైతులు దళారులను నమ్మి మొసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్ని బ్యాగ్స్ కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్న నా దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. ఏ గ్రేడ్‌కు రూ. 2389, కామన్ రకానికి రూ.2369 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17 శాతం మాయుచర్ ఉండాలి అని అన్నారు.

# రీల్

## 31న చిన్ని గుండెలో పాట రిలీజ్



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూక'. మహేష్ బాబు పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 28న గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది. ఫస్ట్ సింగిల్ నువ్వుంటే చాలే ద్వారా రామ్ తన సింగింగ్ డెబ్యూ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ పాట ప్రేక్షకుల మనసులను దోచుకుని బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. రెండవ పాట పప్పీ షేమ్ కూడా అలరిస్తోంది. ఈ సాంగ్‌కి రామ్ స్వయంగా వాయిస్ ఇచ్చారు. 'చిన్ని గుండెలో' పాటను ఈనెల 31న రిలీజ్ చేయనున్నారు. సాంగ్‌కు సంబధించిన పోస్టర్‌లో రామ్, భాగ్యశ్రీ క్లాసిక్ లవ్ మూమెంట్ అదిరిపోయింది.

## 'మాస్ జాతర' ట్రైలర్ విడుదల



రవితేజ హీరోగా, శ్రీలీల హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'మాస్ జాతర' ట్రైలర్ విడుదలైంది. రైల్వే పోలీస్ అధికారిగా రవి తేజ తనదైన శైలిలో ఒదిగిపోయిన తీరు కట్టిపడేసింది. ఆ ఉత్సాహం 'మాస్ జతర' ట్రైలర్ లో అడుగడుగునా కనిపించింది. భారీ యాక్షన్ సన్నివేశాలు, అదిరిపోయే పంచ్ డైలాగ్‌లతో మాస్ మహా రాజా అభిమానులు కోరుకునే మాస్ విందులా ఈ ట్రైలర్ ను మలిచారు. కథానాయకుడు, ప్రతినాయకుడు మధ్య ఉత్కంఠభరితమైన సంఘర్షణ నేపథ్యంలో ట్రైలర్ ను రూపొందిన తీరు ఆకట్టుకుంది. వాణిజ్య అంశాలతో నిండిన పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం 'మాస్ జాతర' ట్రైలర్ ఉంది. నవీన్ చంద్ర మరోసారి శక్తివంతమైన ప్రతినాయక పాత్రలో మెరిసి, రవితేజను ఢీకొట్టే పాత్రలో మెప్పించారు. ట్రైలర్‌కు మరింత ఆకర్షణ, తాజాదనాన్ని జోడిస్తూ, కథానాయిక శ్రీలీల తెరపై ఎంతో అందంగా కనిపించారు. ఆమె మొదటిసారి శ్రీకాకుళం యాసలో మాట్లాడినప్పటికీ, ఆ యాసను పూర్తిగా ఆస్వాదిస్తూ అద్భుతంగా పలికిన తీరు ఆశ్చర్యపరిచింది. రవితేజ శ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, ఈ ట్రైలర్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చింది. ఇప్పటికే పాటలతో ప్రేక్షకుల మనసు దోచుకున్న సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో, తన నేపథ్య సంగీతంతో ట్రైలర్ ను మరో స్థాయికి తీసుకెళ్ళారు. రవితేజ వింటేజ్ మాస్ ఆరాకు సరిగ్గా సరిపోయేలా ఆయన సంగీతం ఉంది. భారీ పోరాట సన్నివేశాలు, కడుపుబ్బా నవ్వించే హాస్యం, అద్భుతమైన పాటలతో విందు భోజనం లాంటి చిత్రానికి 'మాస్ జాతర' హామీ ఇస్తోంది.తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు, 'మాస్ జాతర' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేక్షకులకు పూర్తి స్థాయి మాస్ విందుని అందించడానికి 31న 'మాస్ జాతర' చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అడుగుపెట్టనుంది.

## 31న 'డియాస్ ఇరాయ్' విడుదల



మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్ లాల్ తనయుడిగా చిత్రసీమలో అడుగు పెట్టిన ప్రణవ్, అతి తక్కువ సమయంలో తనకంటూ ఒక స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. 'హృదయం'తో భాషలకు అతీతంగా ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించుకున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'డియాస్ ఇరాయ్'. మిస్టరీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాను సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ శ్రీ స్రవంతి మూవీస్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లో విడుదల చేస్తోంది. కమల్ హాసన్ 'పుష్పక విమానం', 'నాయకుడు' నుంచి ధనుష్ 'రఘువరన్ బీటెక్' వరకు తెలుగులో శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేసిన పరభాషా సినిమాలు భారీ విజయాలు సాధించడంతో పాటు విమర్శకుల ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. అందువల్ల, 'డియాస్ ఇరాయ్' మీద ప్రేక్షకులతో పాటు బిజినెస్ వర్గాల్లో అంచనాలు ఏర్పడ్డాయి. 'హృదయం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రణవ్ మోహన్ లాల్ వరుసగా సినిమాలు చేయలేదు. సెలక్టివ్‌గా కథలు ఎంపిక చేసుకుంటూ వస్తున్నారు. 'భూత కాలం', మమ్ముట్టి 'భ్రమ యుగం' చిత్రాలకు దర్శకత్వం వహించిన రాహుల్ సదాశివన్, ఈ 'డియాస్ ఇరాయ్'ను తెరకెక్కించారు. మలయాళ, తమిళ భాషల్లో ఈ నెల 31న ఈ సినిమా విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ 'డియాస్ ఇరాయ్' మలయాళ వెర్షన్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు శ్రీ స్రవంతి మూవీస్ అధినేత రవికిశోర్. సుష్మితా భట్, జిబిన్ గోపీనాథ్, జయ కురుప్, మనోహరి జాయ్, అరుణ్ అజికుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన 'డియాస్ ఇరాయ్' తెలుగు వెర్షన్‌ను నవంబర్ తొలి వారంలో థియేటర్లలో విడుదల చేయనున్నారు.

## అదే నా డ్రీం..

### 'చిట్ చాట్'లో శిల్పా శిరోద్కర్



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్, నిఖిల్ నందా నిర్మించారు. ఈ చిత్రంలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. 'బ్రహ్మ' తర్వాత ఈ సినిమాతో మళ్లీ తెలుగులోకి వస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది. ఇందులో శోభ అనే క్యారెక్టర్ కనిపిస్తాను. చాలా ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్. తనకి డబ్బంటే అత్యాశ. ఎలాగైనా సరే రిచ్ అయిపోవాలి అనుకునే క్యారెక్టర్. సినిమాలో చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుంది. ఈ క్యారెక్టర్ ప్లే చేయడం చాలా చాలెంజింగ్‌గా అనిపించింది. ఎందుకంటే ఇలాంటి క్యారెక్టర్ నేనెప్పుడూ చేయలేదు. అయితే మా డైరెక్టర్స్ క్లియర్ విజన్, సపోర్ట్ తో ఈ క్యారెక్టర్ని చేయగలిగాను.జటాధరతో రీఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. సుధీర్ బాబుతో కలిసి వర్క్ చేయడం మంచి ఎక్స్పీరియన్స్. ఈ జనరేషన్ యాక్టర్స్ నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. సుదీర్ బాబు చాలా డెడికేషన్‌తో ఈ ప్రాజెక్టు చేశారు. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం గుర్తుండిపోయే అనుభూతి. సుధీర్ బాబు మాకు రిలేటివ్. అయినప్పటికీ మేము చాలా ప్రొఫెషనల్‌గా ఉంటాము. సెట్‌లోకి ఎంటర్ అయిన తర్వాత మేము కేవలం యాక్టర్స్ మాత్రమే. మహేష్ బాబు మా ట్రైలర్ లాంచ్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆయన ఇండస్ట్రీ లోకి వెల్కం చెప్పడం మరింత హ్యాపీనెస్ ఇచ్చింది. పరిశ్రమ చాలా అభివృద్ధి చెందింది. కంటెంట్ పరంగా టెక్నికల్‌గా చాలా అడ్వాన్స్ అయ్యాము. ప్రస్తుతం తెలుగు సినిమా బెస్ట్ పేజ్‌లో ఉంది. జటాధరా ఇది మంచి సూపర్ నేచురల్ థ్రిల్లర్. స్టన్నింగ్ విజువల్స్ ఉంటాయి. ఎమోషన్స్ కూడా చాలా అద్భుతంగా ఉంటాయి. మంచి మ్యూజిక్ ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఖచ్చితంగా ఆడియన్స్‌కి చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. వెంకట్ అభిషేక్ చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్స్. యాక్టర్స్ నుంచి ఏం కావాలో వాళ్ళకి తెలుసు. ప్రతి యాక్టర్ నుంచి మంచి పెర్ఫార్మెన్స్‌ని రాబట్టుకున్నారు.ప్రేరణ అరోరా చాలా ఫ్యాసినేట్ ప్రొడ్యూసర్. ఈ సబ్జెక్టు చెప్తున్నప్పుడే అద్భుతంగా అనిపించింది. చాలా మంచి ప్రొడక్షన్ వాల్యూస్ తో సినిమా నిర్మించారు.సినిమా కోసం తెలుగు హిందీ అన్నిచోట్ల చాలా క్యూరియస్‌గా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత అంచనాలు మరింతగా పెరిగాయి. నవంబర్ 7న ఖచ్చితంగా ఒక అద్భుతమైన సినిమాని చూడబోతున్నారు. నాకు రొమాంటిక్ కామెడీలు ఇష్టం, మంచి సినిమాలు చేయడమే నా డ్రీం అని అన్నారు.

## 'చిరంజీవ' ట్రైలర్ రిలీజ్



రాజ్ తరుణ్ హీరోగా నటించిన ఆహా ఒరిజినల్ ఫిల్మ్ 'చిరంజీవ'. ఈ చిత్రంలో కుషిత కల్లపు హీరోయిన్ గా నటించింది. స్ట్రీమ్ లైన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాహుల్ అవుదొడ్డి, సుహాసినీ రాహుల్ నిర్మించారు. అభినయ కృష్ణ దర్శకత్వం వహించారు. నవంబర్ 7వ తేదీ నుంచి చిరంజీవ సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.చిరంజీవ మూవీ ట్రైలర్ ఎంటర్‌టైన్ మెంట్, లవ్, యాక్షన్‌తో ఆకట్టుకుంది. శివ(రాజ్ తరుణ్) పుట్టగానే మహార్జాతకుడు అవుతాడని పండితులు చెబుతారు. శివకు చిన్నప్పటి నుంచి స్పీడు ఎక్కువ. అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శివ ఓ రోడ్డు ప్రమాదానికి గురవుతాడు. అతనికి తెలియకుండానే కొన్ని శక్తులు వచ్చేస్తాయి. ఎవరెవరు ఎంతకాలం జీవిస్తారు అనేది శివకు తెలిసిపోతుంటుంది. ఈ క్రమంలోనే శివ రౌడీ సత్తు పైల్వాన్ ను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ సత్తు పైల్వాన్‌తో చేసిన పోరాటంలో శివ గెలిచాడా లేదా అనేది ట్రైలర్‌లో ఆసక్తిని కలిగించింది. హీరో హీరోయిన్స్ కుషిత కల్లపు, రాజ్ తరుణ్ పాత్రల మధ్య వచ్చిన క్యూట్ లవ్ స్టోరీ కూడా ఆకట్టుకుంది. చిరంజీవ సినిమా ఆహా ఓటీటీకి మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ కానుందని టీజర్‌తో తెలుస్తోంది.

## బాహుబలి ఎపిక్ 31న విడుదల




ప్రభాస్‌ను పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టిన సినిమా బాహుబలి. ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన బాహుబలి సినిమా విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా బాహుబలి ఎపిక్ పేరుతో సినిమాను మళ్ళీ విడుదల చేయనున్నారు. రెండు భాగాలుగా ఉన్న బాహుబలిని ఇప్పుడు ఒకే భాగం చేసి ఈనెల 31న విడుదల చేయనున్నారు. ప్రభాస్, రానా దగ్గుపాటి అన్న దమ్ములుగా నటించారు. రాజ్యాన్ని చేజిక్కించుకోవడం కోసం జరిగే పోరాటమే ఈ బాహుబలి కథ. రమ్యకృష్ణ, నాజర్ ముఖ్యపాత్రలు పోషించిన ఈ సినిమాకు ఎంఎం.కీరవాణి సంగీతం అందించారు. ప్రభాస్ సరసన ఇందులో తమన్నా హీరోయిన్‌గా నటించింది. అనుష్క ఇందులో అత్యంత కీలమైన పాత్రను పోషించింది. ఈ చిత్రంలో కథ మలుపు తిరిగే పాత్రలో తమిళ నటుడు సత్యరాజ్ కన్నప్పగా నటించాడు. ఈ పాత్రే బాహుబలి సినిమాకు హైలెట్‌గా చెప్పవచ్చు. ఈ చిత్రానికి కథ విజయేంద్ర ప్రసాద్, నిర్మాత శోభు యార్లగడ్డ.

# సిసిఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం

**సమస్యలు ఉంటే పత్తి రైతులు 'టోల్ ఫ్రీ' నెంబర్‌లో సంప్రదించవచ్చు**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మొంథా తుఫాన్ కారణంగా పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో ఖమ్మం, మంచిర్యాల, కామారెడ్డి, నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ రైతులతో మంత్రి తుమ్మల మాట్లాడి వారి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావంతో చేతి కందిన పత్తి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తేమ శాతం 12శాతం మించకుండా చూడాలని కోరారు. మారిన వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తేమ శాతం 20 వరకు ఉన్నప్పటికి పత్తి కొనుగోళ్లు జరపాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ వానాకాలం సీజన్ పత్తి కొనుగోళ్లు సిసిఐ ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 72 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు సోమవారం నుంచి ప్రారంభించారు. 784 మంది రైతులకు చెందిన 1623 క్వింటాళ్ల పత్తి తొలిరోజు కొనుగోలు చేశారు. పత్తి కొనుగోళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 318 జిన్నింగ్ మిల్లులు నోటిఫై చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా 28లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనాలు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడులు తగ్గడం, మారిన వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తేమ శాతం విషయంలో 12శాతం పైగా ఉన్న పత్తినీ కూడా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు జరపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. అలాగే నేటి నుంచి సోయాబీన్ కొనుగోళ్లు చేస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ప్రైస్ సపోర్ట్ స్కీమ్‌లో మొక్కజొన్న, జొన్నలు చేర్చాలని సోయాపై ఉన్న పరిమితులు ఎత్తి వేయాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

**'టోల్ ఫ్రీ' నెంబర్ ఏర్పాటు..**

పత్తి రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా రైతుల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 5779 కి కాల్ చేయొచ్చని మంత్రి తుమ్మల ప్రకటించారు. పత్తి రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేలా ప్రజా ప్రభుత్వంలో అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి రైతులు పత్తి అమ్ముకునేలా సిసిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధి చేస్తాం

**గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, వంద శాతం ఉచిత చేపల పంపిణీలో మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే గండ్ర**



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ, వ్యవసాయ అభివృద్ధికి కట్టుబడి ఉందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి, క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గంలో రేగొండ మండల కేంద్రం లోని గుడ్ లైఫ్ పాఠశాల మైదానంలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువులకు గాలికుంటి వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, మత్స్య సహకార సంఘం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయి కుమార్ లతో కలిసి మంత్రి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పరిశ్రమకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గాలికుంటు వ్యాధి నివారణ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. పాల ఉత్పత్తి పెంపు, పశువుల సంతానోత్పత్తికి గాలికుం టు వ్యాధి విఘాతం కలుగకుండా వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3కోట్ల 26 లక్షల పశువులకు 26 లక్షల 55 వేల టీకాలు వేయడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 25 వేల టీకాలు పూర్తయ్యాయి అని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభమైన గాలి కుంటు వ్యాధి వచ్చేనెల వరకు జరుగుతుందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. స్టేడియం నిర్మాణం, పాడి పరిశ్రమలు, క్రీడల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో రెండు పశు వైద్యశాలలు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు తన పరిధిలో ఉన్న ఐదు శాఖల ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. అనంతరం గణపురం మండలంలోని ఘనప సముద్రం చెరువులో 90 వేల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి చెరువులో చేపలను విడిచారు. ముదిరాజులకు 50 లక్షలతో కళ్యాణ మండపం, 5 కోట్ల తో క్రీడా ప్రాంగణం, ముదిరాజుల ఆరోగ్య దైవమైన పెద్దమ్మ తల్లి దేవాలయ ఏర్పాటుకు సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ డిడి డాక్టర్ కుమార్ స్వామి, చిట్యాల భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, గుటోజు కిష్టయ్య, సింగిల్ విండో చైర్మన్ విజ్జన రావు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లకు అండగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)



క్షమించదు. మీకు అనుగుణంగా వారు కోవిడ్ ప్రతిస్పందనలో ఉన్నారని, వారు కోవిడ్ కారణంగా మరణించారనే షరతు నెరవేరితే, బీమా కంపెనీని చెల్లించమని మీరు తప్పకుండా ఒత్తిడి చేయాలి.' వారు ప్రభుత్వ డ్యూటీలో లేనందున, వారు లాభాలు ఆర్జిస్తున్నారని భావించి వారు కూర్చోవడం సరైనది కాదు' అని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. ప్రధానమంత్రి బీమా పథకం గురించి కాకుండా అందుబాటులో ఉన్న ఇతర సారూప్య లేదా సమాంతర పథకాలకు సంబంధించిన డేటా, సమాచారాన్ని అందించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. 'ప్రధానమంత్రి పథకం కాకుండా అందుబాటులో ఉన్న ఇతర సమాంతర పథకాల గురించి గణాంకాలు, కొంత సమాచారాన్ని మాకు ఇవ్వండి. మేము సూత్రాన్ని నిర్దేశిస్తాము. దాని ఆధారంగా బీమా కంపెనీకి క్లెయిమ్‌లు నిర్దేశించుకోవచ్చు. మా తీర్పు ఆధారంగా బీమా కంపెనీ పరిగణనలోనికి తీసుకుని ఆదేశాలు జారీ చేస్తుంది' అని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వం వారి సేవలను అభ్యర్థించలేకపోతే ప్రవేట్ హాస్పిటల్ సిబ్బంది బీమా పథకం కింద ప్రయోజనాలను పొందేందుకు అర్హులు కారని బాంబే హైకోర్టు 2021, మార్చి 9న ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ప్రదీప్ అరోరా, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. తన భర్తను కోల్పోయిన కిరణ్ భాస్కర్ సుర్గాడే అనే పిటిషనర్ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. 2020లో కొవిడ్19 సమయంలో థానేలో ఒక ప్రైవేట్ క్లినిక్‌ను నడిపే ఓ మహిళ తన భర్తను కోల్పోయింది. ఆమె భర్త క్లినిక్ కొవిడ్ 19 హాస్పిటల్‌గా గుర్తించబడలేదనే కారణంతో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ ప్యాకేజీ (పిఎంజికెపి) కింద ఆమె క్లెయిమ్‌ను బీమా కంపెనీ తిరస్కరించింది. పిఎంజికెపి మార్చి 2020న ప్రకటించబడింది.అప్పటి నుంచి దాని కవరేజీ కూడా పొడిగింపబడింది. పిఎంకెజిపి పథకం కింద ఆరోగ్య కార్యకర్తలకు రూ.50లక్షల బీమా సౌకర్యం అందించబడుతుంది. ఇది ఇన్ఫెక్షన్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన కోవిడ్ వారియర్లపై ఆధారపడ్డ వారికి ఒక భద్రతా వలయంగా మారింది.

# 8వ వేతన సంఘం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభిస్తుందని అన్నారు. వేతన సంఘం తన నివేదిక సమర్పించిన 10 సంవత్సరాల తర్వాత దానిని అమలు చేయడం ప్రారంభించడం ఇప్పుడు సర్వసాధారణ విషయంగా మారిపోయింది. ఈ ధోరణిలో ఆలోచిస్తే, ఎనిమిదవ వేతన సంఘం సిఫార్సులు 2026 జనవరి ఒకటో తేదీ నుండి సాధారణంగా అమలులోకి రావాల్సి ఉంది. కానీ ఏడవ వేతన సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం 2014 ఫిబ్రవరిలో నియమించింది. ఈ సంఘం ఇచ్చిన సిఫార్సులను 2016 జనవరి 1వ తేదీ నుండి అమలు చేశారు. ఈ విధంగా వేతన సంఘం సిఫార్సులు అమలు చేయడంలో జాప్యం జరుగుతోంది. ఐతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ద్రవ్యోల్బణం కారణంగా నిజవేతనాల విలువ తగ్గిపోతుంది. దీనిని ఎప్పటికప్పుడు కేంద్రం భర్తీ చేస్తుంది. కరువుభత్యం చెల్లింపు, డి.ఎ నిష్పత్తిని ప్రతి ఆరు నెలలకు ఒకసారి సవరించడం ద్వారా ఈ పరిహారాన్ని భర్తీ చేస్తుంది.

ఎనిమిదవ వేతన సంఘానికి సూత్ర ప్రాయంగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన తొమ్మిది నెలల తర్వాత కేంద్ర మంత్రివర్గం మంగళవారం ఈ సంఘం పరిమితులు, పని పరిధులను నిర్దేశిస్తూ తీర్మానం చేసింది. బీహార్‌లో నవంబరు ఆరో తేదీ నుండి 11వ తేదీ వరకూ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరగనున్న తరుణంలో కేంద్ర మంత్రివర్గం చేసిన తీర్మానానికి ప్రాధాన్యత ఏర్పడింది. మంత్రివర్గం నిర్ణయం ప్రకారం, రంజన ప్రకాశ్ దేశాయ్ నాయకత్వానగల ఈ వేతన సంఘంలో బెంగళూరు ఐఐఎంకు చెందిన ప్రొఫెసర్ పులక్ ఘోష్ పార్ట్ టైమ్ సభ్యుడుగా ఉన్నారు. పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ప్రస్తుతం రంజన ప్రకాశ్ దేశాయ్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఛైర్మన్‌గా ఉన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన తర్వాత గతంలో ఆమె అనేక పెద్ద పెద్ద ప్రభుత్వ కమిటీలకు నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కశ్మీరులో నియోజకవర్గాల పునర్విభజన కమిషన్‌కు గతంలో ఆమె నాయకత్వం వహించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం అమలులోకి తెచ్చిన ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) ముసాయిదా రచనలో నిపుణుల కమిటీకి కూడా ఆమె నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. ఈ విధంగా ఆమె దేశంలో తన కెరీర్‌లో అతిపెద్ద నాలుగో కమిషన్‌కు నాయకత్వం వహిస్తున్నారు.

**రబీ సీజన్‌లో ఎరువుల సబ్సిడీ రూ.37,952 కోట్లకు పెంపు**

ఈ ఏడాది రబీ సీజనులో యూరియా యేతర ఫాస్ఫరస్ (పి), సల్ఫర్ (ఎస్) ఎరువులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని గతం కంటే రూ.14 వేల కోట్లు పెంచింది. కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు ఒక తీర్మానం చేసింది. ఐతే నైట్రోజన్ (ఎన్), పోటాష్ (పి) లకు సబ్సిడీలలో ఎలాంటి మార్పులూ లేవు. ఈనెల (అక్టోబరు) ఒకటో తేదీ నుండీ ఆరునెలలపాటు అంటే మార్చి 31వ తేదీ వరకూ పెంచిన సబ్సిడీలు అమలులో ఉంటాయి. దేశవ్యాప్తంగా పలుచోట్ల ఇప్పటికే దాళ్వా పంటల నాట్లు ప్రారంభమయ్యాయి. ఈ రబీ సీజన్‌లో ప్రధానంగా గోధుమలు, అవాలు, కాయధాన్యాల పంటలు పండిస్తారు.

2025–26 ఆర్థిక సంవత్సరం రబీ సీజనుకుగాను రైతులకు ఉపశమనం కలిగించేందుకు వీలుగా ఎరువుల సబ్సిడీని అత్యధికంగా రూ.37,952 కోట్లకు పెంచారు. 2024 ఆర్థిక సంవత్సరం రబీ సీజన్‌లో ఈ ఎరువుల సబ్సిడీ రూ.24,000 కోట్లుగా ఉండేది. గతంకంటే ఈ సారి ఈ సబ్సిడీని రూ.14,000 కోట్లు ఎక్కువ పెంచారు. ఒక కిలో ఫాస్ఫేట్‌కు ప్రస్తుత రబీ సీజనులో సబ్సిడీని రూ.47.96లకు పెంచారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో ఈ సబ్సిడీ కిలోకు రూ.43.60లు ఉండేది. అదేవిధంగా సల్ఫర్‌పై ఒక కిలోకు సబ్సిడీని రూ.1.77ల నుండి రూ.2.87లుకు పెంచారు. నైట్రోజన్ (ఒక కిలోకు రూ.43.02లు), ఫాస్ఫేట్ (ఒక కిలోకు రూ.2.38లు)లకు సబ్సిడీలో మార్పులేదు. దిగుమతి ధరలను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఆర్థిక సమస్యలు రాకుండా ఉండటంకోసం ఈ సబ్సిడీ ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ సవరిస్తూ ఉంటుంది.

ఐతే దేశంలో డిఏపి (డై అమ్మోనియా ఫాస్ఫేట్), టిఎస్‌పి (ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్)లు భారీగా రైతులు ఉపయోగిస్తూ ఉంటారు. ఈ డిఎప, టిఎస్‌పిలను అందుబాటులో ఉంచేందుకు వీలుగా ఎంఆర్‌పిలో మార్పులకు సంబంధం లేకుండా ఒక ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం సమకూర్చింది. గతంలో ఉన్న స్థాయికంటే ఫాస్ఫరస్, సల్ఫేట్‌ల ధరలను పదిశాతం మేరకు పెంచినట్లు మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ఈ రబీ సీజన్‌లో సబ్సిడీ పెంచడంవల్ల రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని ఆయన చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com